# నినాదం

నిఖార్సైన జర్నలిజం

సోమవారం 2 ఫిబ్రవరి 2026 | సంపుటి: 22 | సంచిక: 131 | వెల: రూ.7 | పేజీలు: 12+12

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal
Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam




## కొత్త శక్తినిచ్చిన బడ్జెట్: ప్రధాని

కేంద్ర బడ్జెట్ 2026-27పై ప్రధాని మోదీ స్పందించారు. ఈ పద్దు 140 కోట్ల మంది ఆకాంక్షలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. ఇది సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. మూలధన వ్యయానికి, వృద్ధికి మధ్య సమతూకం పాటించారని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై ప్రశంసలు కురిపించారు. వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశనం చేస్తుందని, ఇది చరిత్రాత్మక బడ్జెట్ అని కొనియాడారు. ''బడ్జెట్‌లో ఆత్మనిర్భర్ భారత్‌కు కేటాయింపులు చేశారు. 2047 మిషన్ లక్ష్యాల అనుగుణంగా ఈ బడ్జెట్ ఉంది. త్వరలో ఇండియా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది'' అని చెప్పారు.

## రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బడ్జెట్

**రాష్ట్రాల ఆర్థిక స్వావలంబన లేనిదే దేశాభివృద్ధి సాధ్యమా..?**

**తెలంగాణపై కేంద్ర ప్రభుత్వానిది వివక్షాపూరిత సమాఖ్య ధోరణి**

**రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**



భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 ప్రకారం.. ఇండియా అంటే రాష్ట్రాల సమూహం. రాష్ట్రాల ఆర్థిక స్వావలంబన లేనిదే దేశాభివృద్ధి సాధ్యపడదని రాజ్యాంగం చెబితే, కేంద్రం మాత్రం ఈ బడ్జెట్ లో ఆ మూలసూత్రాన్నే విస్మరించింది అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శించారు.

- హైదరాబాద్, ఫిబ్రవరి 1 (నినాదం)

2

# స్థిరంగా భారతదేశ ఆర్థిక ప్రయాణం

## వికసిత భారత్ దిశగా అడుగులు

- ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నాం
- మూడు కర్తవ్యాలు లక్ష్యంగా సాధనే లక్ష్యం
- ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ రేటు ఆకాంక్ష
- బయో ఫార్మా రంగానికి రూ.10 వేల కోట్లు
- కంటైనర్ నిర్మాణ రంగానికి రూ.10 వేల కోట్లు
- 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూత
- మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణం
- మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు
- 2026-27 ద్రవ్యలోటు 4.3 శాతంగా అంచనా
- మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు
- రూ.28.70 లక్షల కోట్ల పన్ను వసూళ్ల అంచనా
- 2047 నాటికి సమగ్రాభివృద్ధితో వికసిత్ భారత్ లక్ష్యం
- కేంద్రబడ్జెట్‌లో నిర్మలా సీతారామన్ ప్రతిపాదనలు



భారతదేశ ఆర్థిక ప్రయాణం స్థిరంగా సాగుతోందని, యువశక్తి కేంద్రంగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నామని, గ్లోబల్ మార్కెట్లతో పోటీ పడుతూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 9వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. లోక్ సభలో 2026-27 బడ్జెట్ గురించి నిర్మలా సీతారామన్ ప్రసంగించారు.

- న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (నినాదం)

2

## ఏపీ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ ఒక వరం



**ఇది ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్: చంద్రబాబు**

**2047 నాటి వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ ఉందని ప్రశంస**

## బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం



**ఎంపీలంతా కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

## బడ్జెట్ దేశ ప్రజలను నిరాశపరిచింది



**కేంద్రంపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి**



## నిరుద్యోగం, రైతుల కష్టాలు విస్మరణ

**రాహుల్ గాంధీ**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌పై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ ఆర్థిక, సామాజిక సవాళ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరుద్యోగం, తయారీ రంగం క్షీణత, రైతుల కష్టాలు వంటి కీలక సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆదివారం విమర్శించారు.

## మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

మంత్రి కొండా సురేఖ

ప్రభుత్వ పథకాలే అస్త్రాలుగా ప్రజల్లోకి వెళ్లండి

ఐక్యతతోనే విజయం సాధ్యం..

ఏదులాపురం సన్నాహక సభలో పిలుపు

2



## ద్రవ్యలోటు 4.3 శాతానికి తగ్గింపే లక్ష్యం

పన్ను వసూళ్లు రూ.28.70 లక్షల కోట్లుగా అంచనా

మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు

2



## ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ

**కేసీఆర్‌ను 4 గంటల 50 నిమిషాల పాటు ప్రశ్నించిన అధికారులు**

**కేసీఆర్ ఆడియో, వీడియో వాంగ్మూలం రికార్డ్**

**నిందితుల వాంగ్మూలాల ఆధారంగా సాగిన దర్యాప్తు**

*రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారణ ముగిసింది. ఆదివారం నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), కేసీఆర్‌ను దాదాపు 4 గంటల 50 నిమిషాల పాటు విచారించింది. విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేసుకున్నారు.*

- హైదరాబాద్, ఫిబ్రవరి 1 (నినాదం)

2

## సిట్ ఒక సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్



- కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులు రాజకీయ కక్షసాధింపు చర్యలేనని ఆగ్రహం
- పాలనలోని వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ డ్రామా అంటూ విమర్శలు
- చట్టబద్ధం కాకపోయినా కేసీఆర్ దర్యాప్తునకు సహకరిస్తున్నారని వెల్లడి

# జగిత్యాల బరి... బియ్యం స్మగ్లర్ గురి

**వీరప్పన్‌కు ఛైర్మన్ కుర్చీ కావాలట!**

- జాతీయ పార్టీలో చేరి డ్రామా.. బ్లాక్ మనీతో కొండంత హంగామా
- అడ్డదారి సొమ్ముతో.. మ్యాజిక్ ఫిగర్ కొనుగోలుకు రంగం రెడీ
- బియ్యం దందా విస్తరించేందుకు కొత్త ప్లాన్... అన్నీ తెలిసి ఆపలేకపోతున్న అధికారులు




***లోతైన మూలాలతో ఉద్భవించిన మావోయిస్టు పార్టీకి సైతం కేంద్రప్రభుత్వం దాదాపుగా చెక్ పెట్టింది.మారణాయుధాలతో దట్టమైన అడవుల్లో సంచరించిన వీరప్పన్ నూ కర్ణాటక సర్కారు మట్టుపెట్టింది.నిత్యం రేయింబవళ్లూ సబ్సిడీ బియ్యాన్ని స్మగ్లింగ్ చేస్తూ,తద్వారా వేల కోట్లు ఆర్జిస్తూ బాహాటంగా బయట తిరుగుతున్న జిల్లాలోని వ్యవస్థీకృత క్రిమినల్ ని మాత్రం రాష్ట్రంలోని సిస్టం ఏమీ చెయ్యలేకపోతోంది. వెరసీ మరోసారి పట్టుబడకుండా ఓ కీలక శాఖకు చెందిన కొందరు సలహాలిచ్చినట్లు తెలిసింది.దాంతో ఆ వీరప్పన్ తాను చీకటి దందా సాగించే సదరు మిల్లు చుట్టూ గల గోడ ఎవరూ ఎక్కలేనంత ఎత్తు పెంచేసాడట. ఇక ఇంకేముంది సొంత శాఖ సాకులు,సవతి శాఖల సపోర్టు కూడగట్టుకుని సదరు వీరప్పన్ నిత్యం లక్షల విలువైన బియ్యాన్ని స్మగ్లింగ్ చేస్తూ రోజురోజుకూ తన అక్రమ సంపాదన అంకెలు పెంచుకుంటున్నాడు.అయితే కానేకాదిది నినాదం మాట, వ్యక్తమవుతున్న పై ప్రతీ అభిప్రాయం అక్కడి జనం నోటిదేనని పాఠకులు గమనించాలి.***

- హైదరాబాద్ బ్యూరో,ఫిబ్రవరి 1(నినాదం)

**రక్షణకోసం రాజ్యాధికారం వైపు....**

బియ్యం దందాలో కొండంత ఎదిగిన సదరు ఈ వ్యక్తి చట్టం నుండి రక్షణ కోసం ప్రజాప్రతినిధిగా అవతారం ఎత్తే పనిలో పడ్డాడు. దీనిలో భాగంగా ప్రస్తుతం జరగనున్న స్థానిక ఎన్నికల్ని ఎంచుకున్నాడు.ఓ జాతీయ పార్టీలో చేరి ఏకంగా ప్రధాన కుర్చీకే ఎసరు పెట్టాడట. దానికోసం మ్యాజిక్ మెంబర్లందరినీ కొనైనా సదరు కుర్చీని కైవసం చేసుకోవాలని చూస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పుక్కిడి సొమ్మేగా పుచ్చుకుని సినిమా చూపిద్దామని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

**ధీమానిచ్చిన ప్రధాన పార్టీల గందరగోళం...**

స్థానికంగా గల రాజకీయ గందరగోళం సదరు వీరప్పన్ కు కావలసిన ధీమానిచ్చింది.బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్థానిక ప్రస్తుత ఎమ్మెల్యే సంజయ్ అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. అది రుచించని పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర వ్యతిరేకత రణం మొదలెట్టారు. అది రావణ కాష్టంలా నేటికీ రగులుతూనే ఉంది.ఇలా అధికార,ప్రధాన విపక్ష పార్టీలకు సంబంధించి ఏర్పడ్డ అగాదం, సదరు బియ్యం వీరప్పన్ మదిలో అధికార ఆశను మొలకెత్తించింది.

**అధికారుల జీరో లాయల్టీ.. దొంగవైపే పల్టీ...!**

మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పార్టీ ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్రంలోని అన్ని కార్పోరేషన్లు, మున్సిపాలిటీల్లో తమ జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాలలో మాత్రం వారి ధీమా ప్రశ్నార్థకంగా మారిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దానికీ ఓ క్రిమినల్ కారణం కాగా, సంబంధిత అధికారులు సైతం సదరు క్రిమినల్ కే సహకరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనువైన పోస్టింగులు పొంది ఇచ్చిన తమ సర్కారు పట్ల ఏమాత్రం లాయల్టీ ప్రదర్శించటం లేదని స్థానిక కాంగ్రెస్ శ్రేణుల నుండి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అధికార పార్టీగా ఉండి పురపోరు విజయం ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## ద్రవ్యలోటు 4.3 శాతానికి తగ్గింపే లక్ష్యం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (నినాదం):**

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో 2026–27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గతేడాదితో పోలిస్తే ద్రవ్యలోటు 0.1 శాతం తగ్గినట్టు మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటును 4.3 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అలాగే రాబోయే ఆర్థిక సంవత్సరంలో పన్ను వసూళ్లు రూ.28.70 లక్షల కోట్లు అని అంచనా వేశారు.ఇక, మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు అని పేర్కొన్నారు. 2026–27బడ్జెట్‌లో ఏ రంగానికి ఎంత కేటాయించారంటే రక్షణ రంగానికి కేటాయింపుల పెరిగాయి. రవాణా రంగం – రూ.5,98,520 కోట్లు,రక్షణ రంగం – రూ.5,94,585 కోట్లు,గ్రామీణాభివృద్ధి – రూ.2,73,108 కోట్లు, హోంశాఖ – రూ.2,55,234 కోట్లు,వ్యవసాయం – రూ.1,62,671 కోట్లు,విద్యా రంగం – రూ.1,39,289 కోట్లు,ఇంధన రంగం – రూ.1,09,029 కోట్లు,ఆరోగ్య రంగం – రూ. 1,04,599 కోట్లు,పట్టణాభివృద్ధి – రూ.85,522 కోట్లు, కామర్స్ అండ్ ఇండస్ట్రీ – రూ.70,296 కోట్లు,సోషల్ వెల్ఫేర్ – రూ.62,362 కోట్లు సైంటిఫిక డెవలప్‌మెంట్ – రూ.55,756 కోట్లు,ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ – రూ.45,500 కోట్లు,విదేశీ వ్యవహారాలు – రూ.22,119 కోట్లు,ఫైనాన్స్ – రూ. 20,649, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి – రూ.6,812 కోట్లు కేటాయించారు.

## బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 (నినాదం):**

కేంద్ర బడ్జెట్ తెలంగాణను నిరాశకు గురి చేసిందని ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈసారి బడ్జెట్‌లో ఆశించిన మేరకు కేటాయింపులు ఉంటాయని భావించినా.. ఈ ఏడాది కూడా అదే జరిగిందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డితో సహా మంత్రులంతా.. ఎంపీల బృందంతో ప్రధానిని, కేంద్ర మంత్రులను అనేక సార్లు కలిశామని అయినా ప్రయోజనం లేదని విమర్శించారు. మూసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణలకు బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆశించామన్నారు. బయోఫార్మాపై ఫోకస్ చేశారని.. దాంట్లో కూడా తెలంగాణను గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీఐఎల్ లాంటి కంపెనీని హైదరాబాద్‌లో పెట్టింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న భట్టి.. కెమికల్ పార్క్‌లో కూడా హైదరాబాద్‌కు చోటు దక్కలేదని విమర్శించారు. మూసీ ప్రక్షాళన కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసినా సాయం అందలేదన్నారు. బడ్జెట్‌లో జరిగిన అన్యాయంపై రాజకీయాలకు అతీతంగా.. రాష్ట్రంలోని ఎంపీలు అందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి పెంచాలని పేర్కొన్నారు.

## రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా బడ్జెట్

దేశ జీడీపీలో 5 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్న తెలంగాణ గురించి బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా ప్రస్తావించకపోవడం గర్హనీయమని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం తరచూ వల్లించే సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్‌అ నే నినాదం తెలంగాణ విషయంలో కేవలం నీటి మూటలేనని మరోసారి ఈ బడ్జెట్ లో స్పష్టం అయ్యిందన్నారు. ఓ వైపు అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ఉంటుందని చెబుతూనే, మరోవైపు నిధుల కేటాయింపుల్లో తెలంగాణ పట్ల రాజకీయ వివక్ష చూపడం రాజ్యాంగ నైతికత అనిపించుకోదని హితవు పలికారు. బడ్జెట్ అనేది ఆర్థిక హేతుబద్ధత ఆధారంగా రూపొందించాలి. కానీ... కేంద్రం రాజకీయ అనుకూలతకు ప్రాధాన్యతనిచ్చి తాజా బడ్జెట్లో తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింది అని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో తెలంగాణకు రూ. 22,782 కోట్లు వస్తాయని అంచనా వేయగా, ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 10 నెలలు గడుస్తున్నా అందింది కేవలం సుమారు రూ. 4,000 కోట్లు మాత్రమే. అంటే రావాల్సిన దాంట్లో 20 శాతం కూడా అందలేదు. ఇది తెలంగాణ పట్ల కేంద్రం చూపుతున్న ఆర్థిక అణచివేతకు ఇది మరో సాక్ష్యం అని వెల్లడించారు. రాజ్యాంగం ప్రకారం కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల పంపిణీ అనేది సమ న్యాయంగా జరగాలి. కానీ, సహకార సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షాపూరిత సమాఖ్య ధోరణిని ప్రదర్శిస్తోందని తాజా బడ్జెట్ మరోసారి రుజువు చేసింది అని అన్నారు. రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, మెట్రో ఫేజ్ – 2, గోదావరి – మూసీ అనుసంధానం, బందరు పోర్టు–హైదరాబాద్ డ్రైపోర్టు మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే, నాలుగు కొత్త విమానాశ్రయాలు, రైలు కనెక్టివిటీ మెరుగుదల, విభజన చట్టంలోని పెండింగ్ హామీల అమలుకు నిధులు కేటాయించాలని మేము పలుమార్లు కోరినా పట్టించుకోకపోవడం ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం అవలభిస్తోన్న వివక్ష పూరిత వైఖరికి నిలువెత్తు నిదర్శనం అని ఆందోళన వ్యక్తం చేశారు. హై స్పీడ్ రైల్ కారిడార్స్‌తో తెలంగాణకు మమ అనిపించిన కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత వైఖరిపై తెలంగాణ నుంచి బీజేపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న 8 మంది ఎంపీలు ఈ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. ఇకనైనా కేంద్రం తన ధోరణిని వీడి, రాజ్యాంగబద్ధమైన సమానత్వం పాటించాలని కోరారు.

## బడ్జెట్ దేశ ప్రజలను నిరాశపరిచింది

**కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి**

తెలంగాణ ప్రజలను పూర్తిగా నిరాశకు గురి చేసిందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి వ్యాఖ్యనించారు. ఢిల్లీలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి, మంత్రులు చేసిన విజ్ఞప్తులనుకేంద్రం పట్టించుకోలేదని ఆవేదన చెందారు. ప్రత్యేక ప్యాకేజీ,జాతీయ ప్రాజెక్టులు, హైదరాబాద్ మౌలిక వసతులకు నిధులు ఇవ్వాలని కోరాం ఏవీ ఇవ్వలేదన్నారు. హైదరాబాద్ మెట్రో గురించి ప్రస్తావన లేదు. రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై బడ్జెట్‌లో మాట్లాడతారు.కానీ ప్రస్తుత భారత ను గాలికి వదిలేసి 2047 మీద ఫోకస్ చేస్తూ..ఇప్పుడున్న సమస్యలను పక్కన పెట్టారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెద్ద ఎత్తున ఉన్నా గుర్తించకపోవడం అన్యాయమన్నారు. 11 ఏళ్లుగా 22 కోట్ల మందికి ఉద్యోగాలు ఇవ్వాలి..2014 నుంచి కార్పొరేట్ సంస్థలకు అనుకూల బడ్జెట్ ఇస్తున్నారు, వ ద్ధి రేటుకు అర్థం ఉండదు, సామాన్య ప్రజలకు ఉపయోగం లేకుండా ఉండే వ ద్ధి రేటు ఉంది.ఉన్నవారు లేని వారికి మధ్య అంతరం పెరిగిపోతుంది. సామాజిక సమానత్వాన్ని బిజెపి మర్చిపోయి అగ్ర వర్ణాల పార్టీగా మారిందని దుయ్య బట్టారు. ఉపాధి హామీకి నిధులు పెంచామని అంటున్నారు... కానీ అవి బడ్జెట్ లో కనిపించడం లేదన్నారు. నిరుద్యోగం, నిత్యవసర ధరలు పెరగడం వల్ల యువత ఆందోళనలు చేస్తున్నా నిత్యవసర ధరలు తగ్గించడం లేదని కేంద్రం పేదల వ్యతిరేక ప్రభుత్వమన్నారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలనేది రైతుల ప్రధాన డిమాండ్..దాని గురించి ప్రస్తావించలేదు, ప్రధాన పంటలకు సంబంధించి బడ్జెట్ లో ప్రస్తావించలేదు, పంట నష్టం ఇన్ పుట్ సబ్సిడీ గురించి మాట్లాడలేదు, దేశవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగం,పట్టణ ఉపాధి కల్పన,పంటలకు చట్టబద్ధత గురించి మాట్లాడలేదని ఎంపీ మల్లు రవి ఆవేదన చెందారు.బ్రిటిష్ వారు ఉన్నపుడు పెట్టే లా ప్రస్తుత బడ్జెట్ ఉంది, పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజ్ లేదన్నారు. మూసి ప్రక్షాళన కు నిధులు ఇవ్వలేదు, గంగ నదికి,యమునా నదికి నిధులు ఇస్తారు ..కానీ ముసి నదికి ఇవ్వడం లేదన్నారు. తెలంగాణకి ప్రత్యేక అభివ ద్ధి ప్యాకేజ్ ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని, తెలంగాణ వాటా నిధులు విడుదల చేయాలని ఎంపీ మల్లు రవి డిమాండ్ చేశారు. తెలంగాణ బిజెపి ఎంపీలు ప్రధాని ఆర్థిక మంత్రితో మాట్లాడి, తెలంగాణ అవసరాలు తీర్చడానికి పనిచేయాలని సూచించారు. తెలంగాణ ప్రజల హక్కుల కోసం పార్లమెంటు లోపల, బయట తాము పోరాడుతామని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు.

# స్థిరంగా భారతదేశ ఆర్థిక ప్రయాణం

మొదటి పేజీ తరువాయి

కేంద్ర బడ్జెట్.. మూలధన వ్యయం రూ.12.20 లక్షల కోట్లు.. కాగా.. 2026–27 ద్రవ్యలోటు 4.3 శాతంగా అంచనా వేశారు. 2027లో రూ.28.70 లక్షల కోట్ల పన్ను వసూళ్లు అంచనా వేశారు. ప్రభుత్వానికి బాసటగా నిలుస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. మూడు కర్తవ్యాలను లక్ష్యాలుగా ప్రకటించారు. ప్రజల ఆశయాలను అందుకోవడమే తమ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోడీ ఆలోచనలతో ఎన్నో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నామని తెలియ జేశారు. ఈ బ్జడెట్ ను యువశక్తి బడ్జెట్‌గా అభివర్ణించారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నామని, రైతులు, దళిత, ఆదివాసీ సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నారు. మూడు కర్తవ్యాలను స్ఫూర్తిగా తీసుకుని కర్తవ్యభవన్‌లో రూపొందించిన బడ్జెట్ ఇదంటూ పేర్కొన్నారు.నిర్మాణాత్మక సంస్కరణలతో ఈ కార్యవ్యాలను సాధిస్తామని, ఇది యూనిక బడ్జెట్ అని పేర్కొన్నారు. ఆత్మనిర్భరత వల్లే 7 శాతం గ్రోత్ ఉంటుందని అన్నారు. కర్తవ్యం1: సమ్మిళిత ఆర్థిక వృద్ధి. కర్తవ్యం 2: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం 3: సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అని తెలిపారు. బయోఫార్మా రంగానికి రూ.10 వేల కోట్లు, ఎపి, ఒడిశా, తమిళనాడు, కేరళలో గనుల కారిడార్, మూడు డెడికేటెడ్ కెమికల్ పార్కుల నిర్మాణం చేపడుతామని, ప్రస్తుతమున్న ఎన్ఐపిఇఆర్ఎస్ ఆధునీకరించడంతో పాటు దేశంలో రెండు హైటెక టెక్నాలజీ రూమ్స్ ఏర్పాటు చేస్తామన్నారు. కంటైనర్ నిర్మాణ రంగానికి రూ.10 వేల కోట్లు, దేశంలో కొత్తగా మూడు కెమికల్ రీసెర్చ్ పార్కులు, సెమీకండక్టర్ మిషన్ కోసం రూ.40 వేల కోట్లు, జౌళి రంగానికి కేంద్ర బ్జడెట్‌లో చేయూతనివ్వడంతో పాటు మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణం చేపడుతామని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. సెమీ కండక్టర్ మిషన్ 2.క్ష ప్రారంభిస్తామని, త్వరలో నేషనల్ స్కీమ్ ప్రారంభం, టెక్స్‌టైల్ రంగం అభివృద్ధికి కొత్త పథకం, దేశంలో కొత్త మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు చేయడంతో పాటు ఖాదీ, హ్యాండ్లూమ్, హస్తకళల ప్రోత్సాహానికి పథకం ఏర్పాటు చేస్తామని, అత్యంత నాణ్యత కలిగిన క్రీడా వస్తువుల తయారీకి పథకం ఉంటుందని, 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునీకరణకు చేయూతనిస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించడంతో పాటు ఎస్ఎంఇ రంగానికి రూ.10 వేల కోట్లు ఇస్తామని, మైక్రో సెక్టార్‌కు రూ.2 వేల కోట్లు ఇస్తామని, ఆత్మనిర్భర్ భారత్‌కు రూ.2 వేల కోట్లు ఇస్తామని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. నగరాలే దేశ గ్రోత్ ఇంజిన్లు అని, రెండో, మూడో స్థాయి నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, పాట్నా, వారణాసిల్లో షిప్ రిపేర్ ఎకోసిస్టమ్, ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్ల అభివృద్ధితో పాటు ముంబై– పుణెళి, పుణెళి–హైదరాబాద్, హైదరాబాద్– చెన్నై రూట్లలో హైస్పీడ్ రైల్ కారిడార్లు నిర్మించడంతో పాటు ఢిల్లీ– వారణాసి, వారణాసి– సిలిగురి మార్గాల్లో హైస్పీడ్ రైల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దేశంలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచి సుస్థిరతర ఆర్థికాభివృద్ధి సాధించడం. మొదటి కర్తవ్యంలో భాగంగా ఈ ఆరు రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు. ఏడు వ్యూహాత్మక, నిర్దేశిత రంగాల్లో ఉత్పాదతక ను వేగవంతం చేయడం, పారిశ్రామిక రంగాన్ని పునరుజ్జీవింపజేయడం వంటివి ప్రధానంగా ప్రస్తావించారు. వికసిత్ భారత్ థీమ్‌గా బడ్జెట్ ఉందన్నారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్ మాదిరిగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఉపాధి, వృద్ధిని ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం ఎంతో చేసిందని నిర్మలా సీతారామన్ అన్నారు. 2025లో 350కి పైగా సంస్కరణలు ప్రారంభించినట్లు చెప్పారు.కొన్ని వస్తువులకు పన్నుల మినహాయింపులు, తగ్గింపును ప్రకటించారు. దీంతో పలు వస్తువుల ధరలు తగ్గనున్నాయి. మరికొన్ని వస్తువుల ధరలు మాత్రం మరింత పెరగనున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ఊతం. దీర్ఘకాలిక ఇంధన భద్రత, స్థిరత్వం వంటివి ప్రతిపాదించారు. టెక టూల్ రూమ్స్ ఏర్పాటు, పరిశ్రమలకు విద్యాసంస్థల అనుసంధానంమెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు. 5 సూత్రాలతో ప్రత్యేక కార్యక్రమం. టెక్స్‌టైల్ రంగం కోసం వచ్చే ఐదేళ్లకు రూ.10వేల కోట్లు. జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూ.10వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయోఫార్మా శక్తి పథకం. ఫార్మా విద్య, పరిశోధనకు జాతీయ స్థాయిలో మూడు కొత్త విద్యా సంస్థల స్థాపన. రెడో కర్తవ్యం.. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించి సుసంపన్న భారత్ దిశగా అడుగులు వేసేలా భాగం చేయడం. ఈ దిశగా ఇప్పటికే అడుగులు పడినట్లు తెలిపారు. గత పదేళ్ల కాలంలో దేశంలో స్థిరమైన ప్రభుత్వం, సంస్కరణల కారణంగా సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు. ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో మెడికల్ టూరిజం సర్వీసులు. ఐదు రీజినల్ మెడికల్ హబ్స్ ఏర్పాటు. ఆయుష్ కేంద్రాల అప్‌గ్రేడేషన్, సంప్రదాయ వైద్య పరిశోధనకు జామ్‌నగర్‌లో పరిశోధన కేంద్రం ఏర్పాటు. ప్రైవేటు రంగంలో పశువైద్య, డయాగ్నస్టిక్స ఏర్పాటుకు ప్రోత్సాహం. యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సుల ఏర్పాటు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక రంగాలకు చేయూత. నేషనల్ డిజిటల్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు. ఖేలో ఇండియా మిషన్‌లో భాగంగా క్రీడాభివృద్ధి. సబ్ కా సాత్ సబ్ కా వికాస్ విజన్‌తో దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం, మతం, రంగానికి వనరులు, సదుపాయాలు, అవకాశాలను అందిస్తూ అభివృద్ధిలో అర్థవంతమైన భాగస్వాములుగా చేయడం. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం.దివ్యాంగుల కోసం దివ్యాంజన్ కౌశల్ యోజన, దివ్యాంగ్ సహకార యోజన. మానసిక వ్యాధుల చికిత్సకు రాంచీ, తేజ్‌పుర్‌లలో నేషనల్ మెంటల్ హెల్త్ ఇనిస్టిట్యూట్ అపగ్ర◌ేడేషన. భారత్ విస్తార్ (వర్చువల్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సిస్ అగ్రికల్చర్ రిసోర్స్) వ్యవసాయ రంగానికి కృత్రిమ మేధను అనుసంధానం చేయడం ద్వారా ఉత్పత్తి పెంపు, మదింపు చేసి, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకునేలా ప్రోత్సహించడంతూర్పు ప్రాంతంలోని 5 పూర్వోదయ రాష్ట్రాల పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇందు కోసం 4వేల ఇ–బస్‌ల అందించటం. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి.మొదటి రెండు కర్తవ్యాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తే, మూడో కర్తవ్యం ద్వారా 2047 నాటికి సమగ్రాభివృద్ధితో వికసిత్ భారత్‌గా మారడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.



# ఏపీ అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ ఒక వరం

## ఇది ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్: ఏపీ సీఎం చంద్రబాబు

**అమరావతి, ఫిబ్రవరి 1 (నినాదం):**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 'ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్' అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. ఈ బడ్జెట్‌ను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు అభినందనలు తెలియజేస్తున్నానని ఆయన అన్నారు. కుప్పంలో ఆయన కేంద్ర బడ్జెట్‌పై స్పందిస్తూ, ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉందని, అభివృద్ధి ప్రణాళికలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి ఈ బడ్జెట్ మరింత ఊతమిస్తుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈల బలోపేతానికి తాము ఇస్తున్న ప్రాధాన్యతకు అనుగుణంగా కేంద్రం 75 శాతం క్రెడిట్ గ్యారెంటీ ఇవ్వడం, రాష్ట్రం తరపున మరో 20 శాతం అందిస్తుండటంతో ఈ రంగానికి భరోసా లభిస్తుందని తెలిపారు. మహిళలు, రైతులు, యువత సాధికారత సాధించేలా ఈ బడ్జెట్ ఉందని, ఇది 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు బలమైన పునాది వేస్తుందని అన్నారు. ఆర్థిక మంత్రి సమతుల్య బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని, దేశానికి సరైన దిశానిర్దేశం చేసేలా ఉందని కొనియాడారు.

**రవాణా, టెక్నాలజీ రంగాలకు పెద్దపీట**

ఈ బడ్జెట్‌లో ప్రకటించిన మూడు కీలకమైన హైస్పీడ్ రైల్ కారిడార్లు (హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై, బెంగళూరు–చెన్నై) ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా అమరావతి, తిరుపతి, పలమనేరు, చిత్తూరు వంటి కీలక ప్రాంతాలు అనుసంధానమవుతాయని తెలిపారు. అలాగే, రాష్ట్రంలో ఉన్న 'రేర్ ఎర్త్ కారిడార్' ద్వారా విలువైన ఖనిజాలను వెలికితీసి, క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి మార్గం సుగమం అవుతుందన్నారు. ఐఎస్ఎం 2.0 కింద సెమీకండక్టర్ల కోసం రూ.40 వేల కోట్లు, టెక్స్‌టైల్ రంగానికి ప్రోత్సాహకాలు ఇవ్వడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. డేటా సెంటర్లకు 2047 వరకు పన్ను మినహాయింపులు ఇవ్వడం ఒక చారిత్రక నిర్ణయమని చంద్రబాబు అన్నారు. దీనివల్ల భారత్ గ్లోబల్ డేటా హబ్‌గా మారుతుందని, ఇప్పటికే విశాఖకు గూగుల్ వంటి సంస్థలు వస్తున్నాయని గుర్తుచేశారు. ఈ డేటా సెంటర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అభివృద్ధికి ఊతమిచ్చి, భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో బిల్ గేట్స్ కూడా అమరావతిలో పర్యటించనున్నారని, ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి నెక్స్ట్ జెన్ టెక్నాలజీలకు ఏపీ చిరునామాగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.

పర్యాటకం, వ్యవసాయ రంగాలకు ఊతం కేంద్ర బడ్జెట్‌లో అరకు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే అంశాన్ని చేర్చడం హర్షణీయమని సీఎం అన్నారు. దీంతోపాటు పులికాట్ సరస్సు అభివృద్ధికి నిధులు కేటాయించడం వల్ల ఫ్లెమింగో వంటి అరుదైన పక్షుల సంరక్షణకు, పర్యాటక వృద్ధికి దోహదపడుతుందన్నారు. ఈస్ట్ కోస్ట్ కారిడార్, అంతర్గత జలరవాణాకు నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రంలోని వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం లాజిస్టిక్స్ పరంగా గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. కొబ్బరి, జీడి, కోకో, చందనం వంటి ఉద్యాన పంటలకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా రాయలసీమను ప్రపంచంలోనే అత్యుత్తమ హార్టికల్చర్ క్లస్టర్‌గా తీర్చిదిద్దుతామని, 'పూర్వోదయ' పథకం నిధులు ఇందుకు దోహదపడతాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'సంజీవని' ప్రాజెక్టు ఈ ఏడాది గేమ్ ఛేంజర్‌గా మారుతుందని, ఇది బయోసైన్స్‌లో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని చంద్రబాబు తెలిపారు. 2019–24 మధ్య వారసత్వంగా వచ్చిన సమస్యలను పరిష్కరించుకుంటూ, కేంద్ర బడ్జెట్ అందించిన అవకాశాలను అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఎన్నికల సంఘానికి పెరిగిన కేటాయింపులు

**25.33 శాతం పెరిగిన నిధుల కేటాయింపు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1 (నినాదం):**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారంనాడు ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎన్నికల కమిషన్ కు నిధుల కేటాయింపు 25.33 శాతం పెరిగింది. 2025–26లో రూ.304.98 కోట్లుబడ్జెట్‌లో కేటాయించగా, 2026–27 బడ్జెట్‌లో ఈ మొత్తాన్ని రూ.382.22 కోట్లకు పెంచారు. ఎన్నికల సంఘానికి కేటాయించిన నిధుల్లో రూ.367.69 కోట్లు ఎన్నికల సంబంధిత వ్యయం కాగా, తక్కిన మొత్తాన్ని పరిపాలన, నిర్వహణా ఖర్చులకు వెచ్చిస్తారు. రాబోయే రెండేళ్లలో పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం రెండో విడత ఎస్ఐఆర్ పక్రియ కొనసాగుతోంది. ఈ పక్రియలో అధికార బీజేపీతో ఎన్నికల సంఘం కుమ్మక్కై పెద్దఎత్తున ఓటర్లను తొలగిస్తున్నారంటూ విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్న నేపథ్యంలో ఈసీకి బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు 25 శాతం పెరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది తమిళనాడు, పశ్చిమబెంగాల్, అస్సాం, కేరళ రాష్ట్రాల్లోఅసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, 2027లో ఉత్తరప్రదేశ్, పంజాబ్‌లో ఎన్నికలు ఉంటాయి. ఎన్నికల కమిషన్‌కు కేంద్రం కేటాయించిన నిధులను సాంకేతికత, ఎన్నికల నిర్వహణ, ఓటర్ల అవగాహన తదితర కార్యక్రమాల కోసం వినియోగిస్తారు. ఈవీఎంలు, వీవీపాట్ యంత్రాల ఆధునీకరణ, పోలింగ్ కేంద్రాల భద్రతకు కూడా ఈ నిధులు వెచ్చిస్తారు.

# మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరాలి

**మంత్రి కొండా సురేఖ**

**ఖమ్మం ప్రతినిధి, ఫిబ్రవరి 1(నినాదం )**

ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ శ్రేణులు సైనికుల్లా కదలాలని, సంక్షేమ పథకాలను ఆయుధాలుగా చేసుకుని ప్రతి ఇంటి గడపను తట్టాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురం టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణ కుమారి అధ్యక్షతన జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మున్సిపల్ ఎన్నికల క్షేత్రంలో పార్టీ జెండా రెపరెపలాడడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

**ఐక్యమత్యమే మహాబలం**

అధికారంలో ఉన్నప్పుడు పదవుల కోసం పోటీ ఉండటం సహజమని, అయితే పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఐక్యంగా ముందుకు సాగాలని మంత్రి సూచించారు. మున్సిపాలిటీలోని 32 వార్డులకు గాను కాంగ్రెస్ నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలో నిలవడంపై ఆమె స్పందిస్తూ, మనలో మనమే కొట్లాడుకుంటే మూడో వ్యక్తి గెలిచే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. నేతలు చొరవ తీసుకుని అభ్యర్థులందరినీ ఏకతాటిపైకి తేవడం అభినందనీయమని పేర్కొన్న మంత్రి, వార్డుకు ఒక్కరే అభ్యర్థి ఉండేలా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు.



**ప్రజాక్షేత్రంలో సంక్షేమ విజయాలు**

మున్సిపాలిటీలో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులతో రూపొందించిన కరపత్రాన్ని మంత్రి ఈ సందర్భంగా ఆవిష్కరించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఆరోగ్యశ్రీ పెంపు వంటి పథకాలు ప్రతి కుటుంబానికి కొండంత భరోసా ఇచ్చాయని ఆమె గుర్తు చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సారథ్యంలో పాలేరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, ఇదే ఊపుతో మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుని ఆయనకు కానుకగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**ప్రచార హోరుకు సర్వం సిద్ధం**

సోమవారం ఉదయం నాటికి అభ్యర్థులందరికీ బి-ఫామ్‌లు అందజేస్తామని, అప్పటి నుంచే ముమ్మర ప్రచారం మొదలుపెట్టాలని మంత్రి సూచించారు. వార్డుల్లో ఘన విజయం సాధిస్తేనే మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కుతుందని, ఐక్యతతోనే అది సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, తుంబూరు దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'సిట్'కు కొత్త అర్థం చెప్పిన హరీశ్ రావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 1 (నినాదం):**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'సిట్' కాదని, 'సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్' అని ఆయన కొత్త అర్థం చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల నుంచి ఫోన్‌లో ఏది చెబితే, పోలీసులు ఇక్కడ అదే పాటిస్తున్నారని ఆరోపించారు. సిట్ స్వతంత్రంగా పనిచేయడం లేదని, సీఎం కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారమే నడుచుకుంటోందని, "సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్" అన్నట్లుగా వారి వైఖరి ఉందని ఎద్దేవా చేశారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో పరాకాష్ఠ అని హరీశ్ రావు అభివర్ణించారు. ఈ నోటీసుల వెనుక చట్టం లేదని, కేవలం సీఎం రేవంత్ రెడ్డి అహంకారం, రాజకీయ ప్రతీకారం మాత్రమే ఉన్నాయని ధ్వజమెత్తారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన నేతకు కనీస మర్యాద ఇవ్వకుండా, ఆయన నివాసం ఎక్కడ ఉందో రాష్ట్రమంతటికీ తెలిసినా, నందినగర్‌లోని ఇంటి గోడకు నోటీసులు అంటించడం కాంగ్రెస్ ప్రభుత్వ చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

పాలన చేతకాక, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే ఈ సిట్ డ్రామా ఆడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. వరుస కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చరిత్రను సృష్టించిన వ్యక్తి కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ప్రభుత్వం ఇచ్చిన నోటీసులు చట్టబద్ధం కానప్పటికీ, అనుసరించిన విధానం రాజ్యాంగ విరుద్ధమైనప్పటికీ.. కేసీఆర్ ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా, భారత పౌరుడిగా దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నారని హరీశ్ రావు స్పష్టం చేశారు. అయినప్పటికీ పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని, గజ్వేల్ నుంచి హైదరాబాద్ వరకు వేలాది మందిని మోహరించి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రైతుల కష్టాలు, యువత ఉద్యోగాలు, పింఛన్ల పెంపు వంటి అంశాలను గాలికొదిలి, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు.

## ముగిసిన కేసీఆర్ సిట్ విచారణ



ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన నిందితులు ఇచ్చిన సమాచారం, వాంగ్మూలాల ఆధారంగా సిట్ అధికారులు కేసీఆర్‌పై ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. మొత్తం విచారణ ప్రక్రియను సిట్ అధికారులు ఆడియో, వీడియో రికార్డింగ్ చేశారు. విచారణ పూర్తయిన తర్వాత సిట్ బృందం కేసీఆర్ నివాసం నుంచి వెనుదిరిగింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, ప్రముఖుల ఫోన్లను ట్యాప్ చేశారన్న ఆరోపణలపై ఈ కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే పలువురిని సిట్ విచారించింది. నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్ల ఆధారంగానే మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ అధికారులు విచారించినట్టు తెలుస్తోంది.

# వికసిత్ భారత్ వైపు ప్రయాణాన్ని వేగవంతం చేసేలా కేంద్ర బడ్జెట్


**డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



**అమరావతి, ఫిబ్రవరి1 (నినాదం) :** ప్రధాని నరేంద్రమోదీ దార్శనిక నాయకత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం సమర్పించిన 2026- 2027 కేంద్ర బడ్జెట్‌ను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ (ఖ్రుఝఅఖ్రుశ్రీఝఅ) వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. భారతదేశ ఆర్థిక పునాదులను బలోపేతం చేసే భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని.. సంస్కరణల ఆధారిత, యువత - ప్రేరేపిత బడ్జెట్‌ను సమర్పించినందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ని తాను హృదయపూర్వకంగా అభినందిస్తున్నానుని తెలిపారు బడ్జెట్ భారతదేశం ..వికసిత్ భారత్ వైపు ప్రయాణాన్ని వేగవంతం చేస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు. ఉపాధి కల్పన, ఆవిష్కరణ, నగర ఆర్థిక ప్రాంతాలు, హై-స్పీడ్ రైలు కారిడార్లపై ప్రాధాన్యత ప్రాంతాలు, రంగాల్లో వృద్ధిని పునర్నిర్మిస్తుందని పేర్కొన్నారు. ప్రధాన కేంద్రాలను అనుసంధానించే హై స్పీడ్ రైలు లింక్‌ల అభివృద్ధి ద్వారా.. మౌలిక సదుపాయాల కల్పనతో లాజిస్టిక్స్ ఖర్చులను తగ్గిస్తుందని చెప్పారు. అలాగే స్థిరమైన రవాణాను ప్రోత్సహిస్తుందని వివరించారు. ఏపీ కోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వంలో అరుదైన భూమి కారిడార్లు, తూర్పు తీర పారిశ్రామిక కారిడార్, మెరుగైన ప్రజా మూలధన వ్యయం, మత్స్యకార అభివృద్ధి, తీరప్రాంత లాజిస్టిక్స్‌కు ప్రాధాన్యత ఇచ్చారని డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఏపీ వ్యాప్తంగా పెట్టుబడి వృద్ధి, పెద్ద ఎత్తున ఉపాధి, సమగ్ర అభివృద్ధిని సాధిస్తాయని తెలిపారు. రాష్ట్రాలకు సాధికారత కల్పించడం, మధ్యతరగతిని బలోపేతం చేయడం ద్వారా స్వావలంబనతో కూడిన భారతదేశాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# వికసిత్ భారత్ దిశగా బ్యాలెన్స్‌డ్ బడ్జెట్

**సీఎం చంద్రబాబు**



**చిత్తూరు, ఫిబ్రవరి1 (నినాదం) :** 2047 వికసిత్ భారత్ దిశగా కేంద్ర ప్రభుత్వం (ఆదివారం) బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ ప్రవేశ పెట్టిందని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్‌తో ఏపీకి కొత్త అవకాశాలు వస్తాయని వివరించారు. ఇది ఫార్వర్డ్ లుకింగ్ బడ్జెట్ అని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నానని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఆదివారం కుప్పంలో సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.

**యువత సాధికారిత సాధించేలా బడ్జెట్..**

రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింత దూకుడుగా వెళ్లేందుకు ఈ బడ్జెట్ సహకరించేలా ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం అమలు చేస్తున్న ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఈ బడ్జెట్ మరింత సహకరించేలా ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఎంఎస్ఎంఈలపై ఎక్కువగా దృష్టి సారించిందని... వీటిని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు. మహిళలు, రైతులు, యువత సాధికారిత సాధించేలా బడ్జెట్ ఉందని చెప్పుకొచ్చారు. 2047 వికసిత్ భారత్ డెవలప్‌మెంట్ ఎకానమీగా మారేందుకు ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఆర్థిక మంత్రి బ్యాలెన్స్‌డ్ బడ్జెట్ ప్రవేశపెట్టారని ప్రశంసించారు. ఏఐతో సహా వివిధ టెక్నాలజీలు, నెక్స్ట్ లెవల్ ఆఫ్ రిఫార్మ్స్‌కు వెళ్తుందని పేర్కొన్నారు.

**దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్..**

రెన్యువబుల్ ఎనర్జీ, వన్ గ్రిడ్ నేషన్ దిశగా బడ్జెట్ ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. 'స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించారు. మెరుగైన జీవన ప్రమాణాలు, ఈజ్ ఆఫ్ లివింగ్ కోసం దోహదం చేసేలా బడ్జెట్ ఉంది. హైదరాబాద్-బెంగుళూరు, హైదరాబాద్ - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ ద్వారా రాష్ట్రానికి ఉపయోగం ఉంది. తిరుపతి, అమరావతి వంటి ప్రాంతాలు ఈ హైస్పీడ్ కారిడార్లల్లో కవర్ అవుతాయి. బెంగుళూరు - చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ వల్ల పలమనేరు, చిత్తూరు, తదితర ప్రాంతాలు కవర్ అవుతాయి. ఈ మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఏపీలోని వివిధ ప్రాంతాలను కవర్ చేస్తాయి. హైదరాబాద్, అమరావతి, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలు అన్ని అనుసంధానం అవుతాయి. డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్లో ఏపీ కూడా ఉంది. అత్యంత విలువైన భార ఖనిజాలు వెలికి తీసి క్రిటికల్ ఎలక్ట్రానిక్స్ తయారీకి ఉపకరించే అవకాశం ఉంది' అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**టెక్స్‌టైల్ సెక్టార్‌కు ఊతం..**

ఐఎస్ఎం 2.0 ద్వారా సెమీ కండక్టర్‌కు రూ.40 వేల కోట్లు పెట్టారు. టెక్స్ టైల్ సెక్టార్‌కు కూడా ఊతమిచ్చారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'మన రాష్ట్రానికి ఈ అంశం చాలా ఉపకరిస్తుంది. పర్యాటకానికి, హాస్పిటాలిటీకి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. మన రాష్ట్రంలో అరకులో టూరిజం పెరగడానికి దోహదం చేస్తుంది. కోకోనట్, జీడి, కోకో, చందనం లాంటి పంటలకు ఊతమిచ్చేలా చర్యలు ఉన్నాయి. డేటా సెంటర్లకు పన్ను మినహాయింపులు 2047 వరకూ పెట్టారు. భారత్.. డేటా సెంటర్ల హబ్‌గా తయారవుతుంది. విశాఖపట్నానికి గూగుల్‌తో సహ వివిధ డేటా సెంటర్లు వస్తున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కు ఊతమిచ్చేలా ఈ డేటా సెంటర్లు తయారవుతాయి. పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. లాజిస్టిక్స్ రంగానికి ఏపీ పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. కేంద్ర బడ్జెట్‌లో తొలిసారిగా లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి గురించి ప్రస్తావించారు' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# చరిత్రలో లేని మెజార్టీ కూటమికే దక్కింది

**సీఎం చంద్రబాబు**

**చిత్తూరు, ఫిబ్రవరి1 (నినాదం) :** గతంలోనూ, ఇప్పుడు కుప్పంలో తాను ప్రారంభించిన కార్యక్రమాలనే ఏపీ వ్యాప్తంగా అమలు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కుప్పంలో సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. అనంతరం టీడీపీ కార్యకర్తలతో సమావేశమ య్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేడర్‌కు ముఖ్య మంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా, సంక్షోభాలు వచ్చినా టీడీపీ కాబట్టే నిలదొక్కుకోగలిగిందని తెలిపారు. చరిత్రలో ఎప్పుడూ రానంత మెజార్టీ కూటమికి, టీడీపీకి వచ్చిందని ప్రస్తావించారు. వైసీపీ ప్రతిపక్ష హోదాకు దరిదాపుల్లోకి కూడా రాలేకపోయిందన్నారు.

**అభివృద్ధికి పునాదులు వేసింది టీడీపీనే..**

ప్రజలతో ఉంటే ఇలాంటి గెలుపు సాధ్యమవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 2028 నాటికి తన రాజకీయ జీవితం 50 ఏళ్లకు చేరుతుందని చెప్పుకొచ్చారు. అభివృద్ధికి పునాదులు వేసింది.. వేసేది టీడీపీనేనని.. విజన్-2020తో ఇది నిరూపితమైందని వెల్లడించారు. ప్రజల భవిష్యత్, ప్రజల సంక్షేమం కోసమే తన ఆలోచన లని తెలిపారు. భారతదేశానికి అమరావతి లాంటి కొత్త నగరాలు అవసరమని ఆర్థిక సర్వేలో చెప్పారని అన్నా రు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పామని.. చేసి చూపించామని అన్నారు. దేశంలోనే ఉద్యాన ఉత్పత్తు లకు రాయలసీమ మొదటి స్థానంలో ఉందని వెల్లడించారు.

**రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి..**

రాయలసీమలో ఉద్యాన రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. ఎమ్మెల్యేల పని తీరు ప్రతి వారం విశ్లేషిస్తూనే ఉన్నానని తెలిపారు. కార్యకర్తలకు, తనకు కమ్యూనికేషన్ గ్యాప్ రాకుండా ఉండేందు కు పార్టీలో కూడా టెక్నాలజీని వినియోగిస్తున్నామని వివ రించారు. సంక్షేమం తెస్తామని ఇంటింటికి వెళ్లి చెప్పా మని ఆ సంక్షేమాన్ని అమలు చేస్తున్నప్పుడు ఇంటింటికీ వెళ్లాలని సూచించారు. కూటమిలోని పార్టీలతో కలిసి పని చేయాలని కేడర్‌కు సీఎం దిశానిర్దేశం చేశారు.

# సత్యమే గెలిచింది.. నిజాయతీ నిలిచింది

**మంత్రి అచ్చెన్నాయుడు**



**అమరావతి, ఫిబ్రవరి1 (నినాదం) :** స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఎం చంద్రబాబు నాయుడుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో సీఎం చంద్రబాబుకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి సంబంధం లేదని ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ కేసులో చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్ ఇవ్వడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. ఆయన నిష్కళంకమైన రాజకీయ ప్రస్థానానికి దక్కిన గొప్ప విజయమిదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. 'సత్యం, న్యాయం మీద నిలబడే నాయకుడు చంద్రబాబు అని ఈ తీర్పుతో మరోసారి రుజువైంది. స్కిల్ కేసులో ఆయనకు ఎలాంటి సంబంధంలేదని ఈడీ స్పష్టం చేయడం మా అందరికీ గర్వకారణం. గత ప్రభుత్వం ఎన్ని కక్షపూరిత కుట్రలు చేసినా.. చట్టానికి గౌరవమిచ్చి ధైర్యంగా నిలిచిన నాయకత్వం ఆయనది. విజయవాడ ఏసీబీ కోర్టులో కేసు విత్‌డ్రా కావడం తప్పుడు ఆరోపణలు చేసిన వారికి చెంపపెట్టు. రాష్ట్ర భవిష్యత్తు కోసం, యువతకు ఉపాధి కల్పించాలని ఆయన తెచ్చిన స్కిల్ డెవలప్‌మెంట్ ఆలోచనను జగన్ అండ్ కో రాజకీయం చేశారు. అటు ఏపీ సీఐడీ, ఇటు ఈడీ రెండూ ఆయన పాత్రలేదని తేల్చడం చంద్రబాబు పరిపాలనా దక్షతకు నిదర్శనం. ?ఎన్ని కుట్రలు చేసినా, వ్యక్తిగత దూషణలకు దిగినా చివరికి గెలిచేది సత్యమే అని సీఎం చంద్రబాబు నిరూపించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ఆయన నాయకత్వంలో మేమంతా ముందడుగు వేస్తాం' అని చెప్పారు.

# టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు



**అమరావతి, ఫిబ్రవరి1 (నినాదం) :** తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌పై ఏపీ ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆయన స్థానంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ రవిచంద్రకు టీటీడీ ఈవోగా ఫుల్ అడిషనల్ ఛార్జ్ అప్పగిస్తూ కూటమి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించే నెయ్యిలో రసాయనాల మిశ్రమం కలవడంపై సీబీఐ సిట్ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆనాడు టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాలను అనిల్ కుమార్ సింఘాల్ గుడ్డిగా అమలు చేశారని లేఖలో సిట్ అధికారులు పేర్కొన్నారు. అప్పుడు, ఇప్పుడు టీటీడీ ఈవోగా అనిల్ కుమార్ సింఘాల్, ఆయన తర్వాత వచ్చిన ధర్మారెడ్డి, ఆర్థిక సలహాదారుడు బాలాజీలు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని సిట్ అధికారులు లేఖలో ప్రస్తావించారు. ఈ క్రమంలోనే వీరిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిట్ అధికారులు లేఖ రాశారు. సిట్ లేఖను ప్రభుత్వం అధ్యయనం చేసి వెంటనే అనిల్ కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు వేసింది.

# జగన్ హయాంలో తిరుమలలో మహాపాపం చేశారు

**సీఎం చంద్రబాబు ఫైర్**

**చిత్తూరు, ఫిబ్రవరి1 (నినాదం) :** ఎన్‌డీబీబీ (చీణఐదీ) నివేదిక ఆధారంగానే తాను తిరుమల గురించి మాట్లాడానని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకే.. గతంలో సిన్సియర్ అధికారి శ్యామలరావును నియమించామని తెలిపారు. తిరుమలలో వైసీపీ హయాంలో మహాపాపం చేశారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం కుప్పంలో సీఎం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.

**టీటీడీ అక్రమాలపై సిట్ వేశాం..**

జగన్ హయాంలో తిరుమలలో అపచారం చేసి తిరిగి తమపైనే ఎదురుదాడి చేస్తున్నారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. టీటీడీలో జరిగిన అక్రమాలపై సిట్ వేశామని ప్రస్తావించారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు తాను సిట్ వేస్తే.. తిరిగి తననే క్షమాపణలు చెప్పాలని అంటున్నారని ఆగ్రహించారు. తిరుమల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని స్పష్ట చేశారు. తిరుమల వేంకటేశ్వరుడు తమ కులదైవమని, తాను ఎప్పుడూ సామాన్య భక్తుడిలానే స్వామివారిని దర్శించుకుంటానని చెప్పారు. అన్నీ ఆ భగవంతుడే చూసుకుంటారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



# కోనసీమ జిల్లాలో మరోసారి గ్యాస్ లీక్..

**ఓఎన్జీసీ నిర్లక్ష్యంపై స్థానికుల ఆవేదన**



**అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఫిబ్రవరి1 (నినాదం) :** అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెంలో ఓఎన్జీసీ డ్రిల్లింగ్ సైట్ వద్ద పైపు లైన్ నుంచి భారీగా గ్యాస్ లీకవడం కలకలం రేపుతోంది. పొగ తరహాలో దట్టంగా బయటకు చిమ్ముతున్న గ్యాస్ సమీప ప్రాంతమంతా వ్యాపించింది. ఇటీవల డ్రిల్లింగ్ పూర్తి చేసి రిగ్ తొలగించిన తర్వాత ఈ లీక్ జరిగిందని స్థానికులు తెలిపారు. గ్యాస్ లీక్‌తో స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఓఎన్జీసీ నిర్లక్ష్యం వల్ల కోనసీమ జిల్లాలో తరచూ ఇలాంటి గ్యాస్ లీక్‌లు జరుగుతున్నాయని, ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ లీకేజీపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కాగా.. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఓఎన్జీసీ గ్యాస్ లీక్ ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. గత నెల (జనవరి)5న మలికిపురం మండలంలోని ఇరుసుమండ గ్రామంలో ఓఎన్జీసీ వెల్ వద్ద రిపేర్/రీ-డ్రిల్లింగ్ పనుల సమయంలో భారీ గ్యాస్ లీక్ జరిగి మంటలు ఎగసిపడ్డాయి. ఇది బ్లోఅవుట్‌గా మారి ప్రమాదకర పరిస్థితి నెలకొంది. వెంటనే సమీప గ్రామాల నుంచి ప్రజలను ఖాళీ చేయించేశారు అధికారులు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# అమరావతికి మళ్ళీ అప్పులే..

**బడ్జెట్‌పై స్పందించిన వైఎస్ షర్మిల**



**అమరావతి, ఫిబ్రవరి1 (నినాదం) :** ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు కీలకంగా ఉన్నా.. రాష్ట్రానికి ప్రయోజనం గుండు సున్నా అని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. బాబు అండతో ప్రధానిగా నిలబడ్డ మోడీ ప్రతి సారి బడ్జెట్‌లో మనకు చేస్తున్నది ఘరానా మోసమే అని ఆరోపించారు. కేంద్ర ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై వైఎస్ షర్మిల స్పందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఎక్స్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. రూ. 50 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఈ సారి సైతం రాష్ట్రానికి మొండి చెయ్యే అని ఆరోపించారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర ప్రయోజనాలకు బడ్జెట్‌లో అనాపైస మందం విలువ లేదని, ఇది ఆంధ్రప్రదేశ్‌ను దగా చేసిన బడ్జెట్ అని మండిపడ్డారు. 5 కోట్ల మంది ప్రజలను ఊరించి ఉసూరు మనిపించిన బడ్జెట్.. అని ఫైర్ అయ్యారు.

**అప్పులే తప్ప ఆపన్నహస్తం అందించలే..**

అమరావతికి మళ్ళీ అప్పులే తప్ప ఆపన్నహస్తం అందించలేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు ఊతమివ్వలేదని, రాయలసీమకు మోసమే తప్ప చిల్లిగవ్వ దక్కలేదన్నారు. జీవనాడి పోలవరానికి జీవం పోయలేదని, విభజన హామీల్లో ఒక్క దానికి పట్టింపు లేదన్నారు. ప్రత్యేక హోదాపై ఊసేలేదు.. విశాఖ స్టీల్ ప్లాంట్ పై కనికరం కలగలేదు.. కడప స్టీల్ వైపు కన్నెత్తి కూడా చూడలేదు.. మెట్రో రైలు ప్రస్తావన లేదు.. ఇండస్ట్రియల్ కారిడార్ల సంగతి తేల్చలేదు.. పట్టుమని 10 పైసల మందం కూడా బడ్జెట్‌తో ప్రయోజనం లేదు.. అని తీవ్ర ఆరోపణలు చేశారు. ఢిల్లీని తలదన్నే రాజధాని కడతామని అప్పులు అంటగట్టడం దుర్మార్గమన్నారు. లక్ష కోట్లు ఖర్చయ్యే అమరావతికి ౼ాణదీ, జపాన్ బ్యాంకుల నుంచి రూ.15 వందల కోట్లు అప్పులిప్పిస్తే రాజధాని పూర్తవుతుందా? అని ప్రశ్నించారు. గతేడాది అప్పుల కింద ఇస్తామని చెప్పిన రూ.15 వేల కోట్లలో ఒక్క రూపాయి అయినా ఇచ్చారా ? అని నిలదీశారు. గ్యారెంటీ కింద అప్పులు అంటే.. ఎవరికి గ్యారెంటీ ? విభజన చట్టం ప్రకారం అమరావతి నిర్మాణం కేంద్రానిదే బాధ్యత అని తెలియదా? అప్పులు ఇస్తామని చెప్తే ఆంధ్రుల ఆత్మగౌరవం ఎప్పుడు పూర్తవుతుంది?, ఇదేనా బీజేపీ కి రాష్ట్రంపై ఉన్న చిత్తశుద్ధి? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

**పోలవరం ప్రాజెక్ట్ కి మళ్ళీ అన్యాయం..**

పోలవరం ప్రాజెకి మళ్ళీ తీరని అన్యాయం చేశారని అన్నారు. ఎత్తు 45.72 మీటర్లకు పెంచాలని కోరినా బడ్జెట్ లో మళ్ళీ పెదచెవిన పెట్టారని పేర్కొన్నారు. కేవలం 3 వేల కోట్లు మాత్రమే ఇచ్చి ఇక ప్రాజెక్టు ఎత్తు 41.15 మీటర్లకే అని చెప్పకనే చెప్పారని వెల్లడించారు. గత బడ్జెట్‌లో ప్రాజెక్ట్ పూర్తికి ఇస్తామని చెప్పిన రూ.12 వేల కోట్లలో ఇచ్చింది రూ.5 వేల కోట్లే అని తెలిపారు. ఈ ఏడాది రూ.3 వేల కోట్లు మాత్రమే ఇస్తే 2027 నాటికి ప్రాజెక్టు ఎలా పూర్తి అవుతుంది? అని ప్రశ్నించారు. మిగిలిన నిధుల సంగతి ఏంటి ? రూ. 20 వేల కోట్ల =ఱ= ప్యాకేజీ మిగులు కోసం పోలవరానికి, రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తుంటే కూటమి ప్రభుత్వం మౌనంగా ఉండటం సిగ్గుచేటు అని విమర్శలు గుప్పించారు. కూటమిలో పెద్దన్నగా చెప్పుకునే చంద్రబాబు నోరు మెదపక పోవడం ఆయన పాలన తీరుకి నిదర్శనం అని అన్నారు.

# విజనరీ లీడర్‌కు దురదృష్టకరమైన ప్రతిపక్షం బాధాకరం

**: ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



**అమరావతి, ఫిబ్రవరి1 (నినాదం) :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై వైసీపీ నేత అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎంపై అంబటి చేసిన వ్యాఖ్యలను టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఖండించారు. అలాంటి కామెంట్స్ దురదృష్టకరమన్నారు. అంబటి వ్యాఖ్యలు సరికావని.. ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి.. చంద్రబాబు నాయుడును కాల్చి చంపాలని కామెంట్ చేశారని గుర్తుచేశారు. అంతేకాకుండా, సీఎం కుటుంబ సభ్యులను కూడా దూషించారని ఎంపీ ఫైర్ అయ్యారు. వైసీపీ నేతల వ్యాఖ్యలు చూస్తే బాధేస్తోందన్నారు. తిరుమల లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేసే విధంగా శనివారం (జనవరి 31) వైసీపీ నేతలు వ్యవహరించారని విమర్శించారు. వ్యవస్థలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పక్క రాష్ట్రాలలో హుందాతనంగా ఉండే విధంగా రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. భావితరాలకు మన మాటలు మార్గదర్శకంగా ఉండాలి తప్ప.. తప్పుడు మార్గం కాకూడదని సూచించారు ఎంపీ. ఒక విజనరీ లీడర్‌కు దురదృష్టకరమైన ప్రతిపక్షం ఉండటం బాధాకరమన్నారు ఎంపీ. 18 నెలల అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే విధంగా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారన్నారు. వైసీపీ నేతలకు జ్ఞానోదయం కలగాలని ఎంపీ అప్పలనాయుడు హితవు పలికారు.

# అనంతపురంలో వ్యక్తి దారుణ హత్య..

**అనంతపురం ఫిబ్రవరి1 (నినాదం) : :** అనంతపురం జిల్లాలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. బొమ్మనహాళ్ మండలం కొలగలహల్లిలో కావలి రమేష్ (50) అలియాస్ సన్నపా ములు అనే వ్యక్తి పొలానికి వెళ్తుండగా ప్రత్యర్థులు మారణాయుధాలతో వేటాడారు. వాళ్లదాడిలో రమేష్ కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. 2022లో జరిగిన ఓ వ్యక్తి హత్య కేసులో రమేష్ ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. 2022లో జరిగిన హత్య నేపథ్యంలోనే కావలి రమేష్ ను చంపినట్లుగా తెలుస్తోంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తమ పార్టీ నేతల ఇళ్లపై దాడులు చేయిస్తే ఊరుకోం


**మాజీ సీఎం జగన్**



**అమరావతి, ఫిబ్రవరి1 (నినాదం) :** తప్పుల్ని ప్రశ్నిస్తుంటే కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేక తమ పార్టీ నేతలపై, వారి ఇళ్లపై దాడులు చేయిస్తోందని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ ఫైరయ్యారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో చంద్రబాబుకు సున్నితమైన హెచ్చరిక చేశారు. ప్రజాస్వామ్యంలో, మీరు చేసిన తప్పుడు ఆరోపణలు తప్పు అని, ఏకంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన ల్యాబులు చీణఐదీ, నిర్ధారణ చేసిన తర్వాత, మీరుచేసిన ఆ తప్పులకు మిమ్మల్ని ప్రశ్నిస్తే, జీర్ణించుకోలేక అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లకు మీరు నిప్పు పెట్టడం, ఆ దుశ్చర్యలతో భయాన్ని కలిగించానని మీరు అనుకోవడం మీ భ్రమేనన్నారు. ఆ ఇద్దరి ఇళ్లకు పెట్టిన నిప్పు.. మీరు మీ ప్రభుత్వానికి పెట్టుకున్నట్లేనని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లకు పెట్టిన నిప్పు అరాచకానికి, ఆటవిక పాలనకు, "జంగిల్‌రాజ్"కు ప్రతీక అని తెలిపారు. కానీ ఈ నిప్పు ద్వారా ప్రజాస్వామ్యంపై రగిల్చిన మంటలతో పుట్టిన వేడి, చంద్రబాబు సర్కార్‌ను దహించివేస్తుందని జోస్యం చెప్పారు. రానున్న కాలంలో మీకు వ్యతిరేకంగా ఉవ్వెత్తున ఎగిసే ప్రజాగ్రహ జ్వాలలు, మీ ప్రభుత్వాన్ని పూర్తిగా దహనంచేసి, బూడిద చేయడం తథ్యమని ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు. "చంద్రబాబుగారూ గుర్తుంచుకోండి.. ప్రజాస్వామ్యంలో హింసా జ్వాలలను రేపే చేయి కాలక తప్పదు, అరాచక, ఆటవిక పాలన అంతం కాక తప్పదు. మీరు సృష్టించిన "జంగిల్ రాజ్" భూస్థాపితం కాక తప్పదు. చరిత్ర చెప్పే సత్యం ఇది" అని జగన్ చేసిన ట్వీట్ లో తెలిపారు.


# వైసీపీ నేతల ఇళ్లపై దాడులు..

**పేర్ని నాని ఇంటివద్ద భారీ బందోబస్త్**



**అమరావతి, ఫిబ్రవరి1 (నినాదం) :** అధికార ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతలు చేసిన వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహ జ్వాలలు రగిలించాయి. ఫలితంగా మాజీ మంత్రులైన అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేసి నిప్పంటించారు. ఈ ఘటనలను వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్రంగా ఖండించారు. వైసీపీ మాజీ మంత్రుల ఇళ్లపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో మచిలీపట్నం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని నాని ఇంటి వద్ద పోలీసులు బందోబస్తే ఏర్పాటు చేశారు. పేర్ని నాని నివాసంపై దాడి జరిగే అవకాశం ఉండటంతో.. ఆయన ఇంటికెళ్లే పలు మార్గాల్లో పోలీసులు పికెటింగ్ నిర్వహిస్తున్నారు. రామానాయుడుపేట, బచ్చుపేట, హిందూ కాలేజీ, రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో పోలీసులు అనుమానితుల్ని తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు వైసీపీ శ్రేణులు భారీగా పేర్నినాని ఇంటికి చేరుకుంటున్నారు.

# రాష్ట్రంలోనే తొలి పెయిన్ క్లినిక్ ప్రారంభం



**విశాఖపట్నం, ఫిబ్రవరి1 (నినాదం) :** రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ రాష్ట్రశీలోని తొలి పెయిన్ క్లినిక్ ను విశాఖలోని కేజీహెచ్ లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ సత్య కుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలిక, క్యాన్సర్ సంబంధిత నొప్పులతో బాధపడు తున్న రోగులకు 'పెయిన్ క్లినిక్' సేవలు ఉపయోగపడతాయని తెలిపారు, ఏ ఎం సి ఏ ఎన్ ఏ (ఆంధ్ర మెడికల్ కాలేజ్ - నార్త్ అమె రికా అలుమ్ని) సంస్థ పెయిన్ క్లినిక్ కోసం రూ.కోటి విరాళం అందిం చడం అభినందనీయమని ప్రశంసించారు. ఇటీవల గుంటూరులో 600 పడకల మాతా-శిశు ఆరోగ్య కేంద్రానికి పూర్వ వైద్య విద్యా ర్థులు అందించిన సహకారం, అలాగే విశాఖ, కాకినాడలో పూర్వ విద్యార్థులు ప్రభుత్వ వైద్య సంస్థల అభివృద్ధికి చేస్తున్న సేవలను ఇటీ వల కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా దృష్టికి తీసుకెళ్లగా, ఆయన దీనిని దేశవ్యా ప్తంగా ఆదర్శంగా నిలిచే మోడల్‌గా ప్రశంసించినట్లు మంత్రి పేర్కొన్నా రు. రాబోయే రోజుల్లో కీమోథెరపీ, రేడియోథెరపీ, పెయిన్ మేనేజ్‌మెం ట్ అంశాలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి క్యాన్సర్ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళా శాలలను బలోపేతం చేస్తూ, పేదలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వెల్లడించారు.

# విశ్వనాథ్ సినిమాలు సమాజానికి గుణపాఠాలు

## కాశీనాధుని విశ్వనాథ్ వర్ధంతి



కాశీనాధుని విశ్వనాథ్ (కె.విశ్వనాథ్) భారతీయ చలనచిత్ర పరిశ్రమలో అపారమైన కీర్తిని పొందిన వ్యక్తి. తెలుగు చిత్రసీమలో సంగీతం, నృత్యం, సాంఘిక అంశాల సమ్మేళనంతో ఆయన సినిమాలు ప్రేక్షకుల మనసులను కట్టి పడేసాయి. కథా రచన, దర్శకత్వం, నటన ఇలా పలు రంగాల్లో విశ్వనాథ్ తన ప్రతిభను చూపించి ఒక స్థిరమైన గుర్తింపును సంపాదించారు.

కాశీనాధుని విశ్వనాథ్ 1930 ఫిబ్రవరి 19న ఆంధ్రప్రదేశ్‌లోనిగుంటూరు జిల్లాలోని రేపల్లెలో జన్మించారు. చిన్నతనం నుంచే కళలపట్ల ఆసక్తిని పెంపొందించుకున్న ఆయన, ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసినప్పటికీ, తన హృదయం ఎల్లప్పుడూ కళా రంగాల పట్ల ఆకర్షితమై ఉండేది.

విశ్వనాథ్ తన సినీ ప్రస్థానాన్ని సహాయ దర్శకుడిగా ప్రారంభించారు. 1965లో విడుదలైన ఆత్మ గౌరవం చిత్రంతో దర్శకుడిగా తొలి అడుగు వేశారు. ఆ చిత్రం మంచి విజయాన్ని సాధించి, విశ్వనాథ్‌గారికి దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చింది.

విశ్వనాథ్ సినిమాల్లోసంగీతం కేంద్రస్థానంగా ఉంటుంది. ముఖ్యంగా భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ప్రధానాంశంగా తీసుకుని, ఆ కళకు గౌరవాన్ని పెంచే విధంగా సినిమాలను రూపొందించారు. శంకరాభరణం, సిరివెన్నెల, సాగర సంగమం వంటి చిత్రాలు సంగీత ప్రాధాన్యతను ప్రతిబింబించే అద్భుత సృష్టులు. విశ్వనాథ్ సినిమాలు కేవలం వినోదం అందించేవిగా కాకుండా, సమాజానికి సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చించేవిగా ఉంటాయి. కుల వ్యవస్థ, పేదరికం, వరకట్న సమస్యలు వంటి అంశాలను ఆయన సినిమాలు ముడి. పెట్టాయి.ఈ సామాజిక సందేశాలను ఆయన హృద్యంగా చెప్పడంలో విజయం సాధించారు.

ఆయన ముఖ్య చిత్రాలలో...శంకరాభరణం (1979): భారతీయ శాస్త్రీయ సంగీతానికి అంకితమైన చిత్రంగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. సాగర సంగమం (1983) నృత్య కళలపై మక్కువ, త్యాగం, ప్రేమను చూపించే ఈ చిత్రం విశ్వనాథ్ గౌరవాన్ని పెంచింది. స్వాతి ముత్యం (1986) సమాజంలోని అమాయకత్వాన్ని, మానవ సంబంధాలను చక్కగా ప్రతిబింబించిన చిత్రం. సిరివెన్నెల (1986): సంగీతం, ప్రేమ, పేదరికం మధురంగా కలసిన ఈ చిత్రం క్లాసిక్‌గా నిలిచిపోయింది. శుభలేఖ (1982): కుల వివక్షను ఆధారంగా తీసుకుని రూపొందించిన అద్భుత చిత్రం. కేవలం దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ విశ్వనాథ్ తన ప్రతిభను చూపించారు. ఆయన నటన సహజంగా ఉంటూ, పాత్రలకు జీవం పోస్తుంది. ఆయన పాత్రలు సినిమాల్లో నిండుదనాన్ని తీసుకువస్తాయి.విశ్వనాథ్‌కు పలు జాతీయ అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (2017), పద్మశ్రీ పురస్కారం, అనేక నంది అవార్డులు, జాతీయ చలనచిత్ర పురస్కారాలు.

2023 ఫిబ్రవరి 2న విశ్వనాథ్ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం తెలుగు సినిమాకు తీరనిలోటు. అయితే, ఆయన రుచి, కళా దృక్పథం, మరియు సినిమాలకు అందించిన విలువలు సార్వకాలికంగా నిలిచిపోతాయి.

కాశీనాధుని విశ్వనాథ్ తెలుగు సినిమా చరిత్రలో ఒక ప్రథమ శ్రేణి కళాస్రష్ట. ఆయన సినిమాలు సమాజానికి గుణపాఠాలు, సంగీతానికి అభివృద్ధి పాఠాలు. జీవితమంతా కళలకే అంకితం చేసిన ఆయన పేరు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచి పోతుంది.

- రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
కాలమిస్ట్... 9440595494

# జీవ వైవిధ్య కేంద్రాలు... చిత్తడి నేలలు

## ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినం

**సముద్రం, నది, ఇతర నీటి వనరుల తీర ప్రాంతాలలో లోతు తక్కువ వుండి ఎక్కువ కాలం నీటి నిల్వ వుండే భూములను చిత్తడి నేలలు అంటారు. మంచి నీటి సరస్సులు, ఉప్పునీటి సరస్సులు, మడ అడవులున్న తీర ప్రాంతాలన్నీ చిత్తడి నేలలే. ఎగువ ప్రాంతంలోని భూములు అలల తాకిడికి దెబ్బ తినకుండా ఈ చిత్తడి నేలలు అడ్డు కట్ట వేస్తాయి. అరుదైన మొక్కలకు, పక్షులకు, జంతువులకు, చేపలు గుడ్లు పెట్టడానికి ఈ చిత్తడి నేలలు చాల అనుకూలం. సమీప నీటి నాణ్యతను పెంచడం లోను, కాలుష్య కారకాలను గ్రహించడం లోను చిత్తడి నేలలు ప్రాధాన్యతను పోషిస్తాయి.**





మానవుల తప్పిదాలతో పర్యావరణానికి చాల హాని కలుగు తున్నది. అలాగే చిత్తడి నేలలకు కూడా మినహాయింపు లేకుండా పోతున్నది. ఫలితంగా హాని జరుగు తున్నది. ప్రజలు వ్యవసాయ అవసరాలకు ఈ భూములను ఆక్రమించు కొని రసాయన ఎరువులకు వాడడం వల్ల.... నివాస యోగ్యానికి ఈ నేలలను పూడ్చడం తోను, చిత్తడి నేలలు విధ్వంసానికి గురవు తున్నాయి. ప్రభుత్వం పరిశ్రమల కొరకు చిత్తడి నేలలను కేటాయిచడంలో అవి మరింత విధ్వంసానికి గురవు తున్నాయి. చిత్తడి నేలల పరిరక్షణకు 1971, ఫిబ్రవరి రెండవ తేదీన ఇరాన్‌లోని రాంసార్‌లో ఒక అంతర్జాతీయ సదస్సు జరిగింది. అప్పుడు తీసుకున్న ఉమ్మడి ఒప్పందం పై 164 దేశాలు సంతకం చేశాయి. దాన్నే "రాంసార్ ఒప్పందం" అంటారు. చిత్తడి నేలల పరిరక్షణకు ఈ ఒప్పందంలో కొన్ని ప్రమాణాలను నిర్దేశించారు. భారత దేశం కూడా ఈ ఒప్పందం పై సంతకం చేసింది. చిత్తడి నేలలు జీవ వైవిధ్యానికి కేంద్రాలు. ఈ ప్రదేశాలలో చాలా జల చర, ఉభయ చర జీవులు... మొక్కలు, జంతువులు ఉంటాయి. చిత్తడి నేలలు ముఖ్యంగా నదీ పరీవాహక ప్రదేశాలు, సముద్ర తీర ప్రాంతాలకు సమీపంగా ఉంటాయి. ఇవి నదుల గుండా వచ్చే కాలుష్య కారక పదార్థాలను, తమలో ఇముడ్చుకుంటాయి. సముద్ర భారీ అలల నుండి సునామీల నుండి తీర ప్రాంతాలను రక్షిస్తాయి. అదే విధంగా నదుల వరదల నుండి కాపాడుతాయి. సముద్ర ప్రాంతాలు, నదీ తీరాలు, చెరువులు, సరస్సులు, నీటి ముంపు ప్రాంతాలు, తీరాల సమీపంలోని ఉప్పునీటి కయ్యలు, మడ అడవులు, మానవ నిర్మిత చేపల చెరువులు, వరి పొలాలు, సాగునీటి ఆనకట్టలు వంటివి చిత్తడి నేలల కోవకు చెందుతాయి. మానవాళి మనుగడకు ఈ నేలలు ఎంతో కీలకం. అయితే మానవుడు తన ఆవాసాల కోసం ఇలాంటి చిత్తడి నేలలను పూడ్చి గృహాలు నిర్మించడం వల్ల చిత్తడి నేలలు కనుమరుగు అవుతున్నాయి. దీనికి ఉదాహరణ ముంబై , కోల్ కత వంటి నగరాలు. దీని వల్ల బయో డైవర్సిటీ తీవ్రంగా నష్టపోతుండటం జరుగుతున్నది. ఈ క్రమంలో 1971 ఫిబ్రవరి 2 వ తేదీన ఇరాన్ దేశం లోని "రాంసార్" పట్టణంలో చిత్తడి నేలల సంరక్షణకు ఒక సదస్సు జరగగా, అన్ని దేశాలు చిత్తడి నేలలను రక్షించడానికి అంగీకరించాయి. అప్పటి నుండి ఫిబ్రవరి 2 వ తేదీని ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవంగా జరుపు కుంటున్నారు.

చిత్తడి నేలల అవసరాన్ని తెలియజెప్పి, సమాజాన్ని చైతన్య పరచడం ద్వారానే వాటిని పరిరక్షించు కోవడం సాధ్యమవుతుంది. అందుకోసం వివిధ స్థాయుల్లో అవగాహన కల్పించాలి. విద్యార్థులకు పాఠ్యాంశంగా చేయాలి.

విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సాగునీరు, వ్యవసాయ, మత్స్య, అటవీ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో చిత్తడి నేలల పరిరక్షణకు కృషి చేయాలి.

గడచిన యాభయ్యేళ్ల కాలంలో చిత్తడి నేలల్లో సుమారు 60 శాతం మత్స్య సంపద, పక్షులు, క్షీరద సంతతి, సరీసృపాలు, ఉభయ చరాలు ఇప్పటికే అంతరించి నట్లు పరిశోధనలు తెలుపు తున్నాయి. ఇకనైనా మేల్కొని, ఇంకా అంతరించి పోకుండా కాపాడుకోవ దానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సి ఉంది.

- రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్,
ఇండిపెండెంట్, జర్నలిస్ట్,
కాలమిస్ట్... 9440595494

# వికసిత్ భారత్ దిశగా కేంద్ర బడ్జెట్

**హైదరాబాద్, (నినాదం):** కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల సమగ్ర అభివృద్ధికి ఎంతగా కట్టుబడి ఉందో నిరూపించేలా కేంద్ర బడ్జెట్ 2026-27 రూపుదిద్దుకుంది. ఇది కేవలం ఆర్థిక పత్రం కాదు... దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే ప్రజారంజక బడ్జెట్ అని కేంద్ర బడ్జెట్ 2026-27పై బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు..



మీడియాకు విడుదల చేసిన ఆ ప్రకటనలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య స్పందిస్తూ దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు ఆదాయపు పన్ను నుంచి మినహాయింపులు ఇవ్వడం, విద్య, వ్యవసాయం, రవాణా, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి పెద్దపీట వేయడం ఈ బడ్జెట్ ప్రత్యేకత అని తెలిపారు.

"దేశానికి ఆయువుపట్టు అయిన వ్యవసాయం, విద్య, మహిళా సంక్షేమం కోసం గణనీయమైన కేటాయింపులు చేయడం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ పనితీరుకు ప్రత్యక్ష నిదర్శనం.పట్టణాలు, ముఖ్య నగరాలకు హై స్పీడ్ రైలు కనెక్టివిటీ, నేషనల్ హైవే కారిడార్లలో తెలంగాణకు ప్రాధాన్యత ఇవ్వడం శుభపరిణామం అని" పేర్కొన్నారు.

అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేలా రూపొందించినందుకే ఇది నిజమైన అర్థంలో ప్రజారంజక బడ్జెట్.ఈ బడ్జెట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన ప్రధాని నరేంద్ర మోదీ గారికి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అని అన్నారు..తెలంగాణ అభివృద్ధికి గత పన్నెండేళ్లుగా కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల నిధులు ఇస్తున్నా... అవి తెలంగాణ కాంగ్రెస్ నేతలకు కనిపించకపోవడం ఆశ్చర్యం ఏమి లేదని" అన్నారు.

ఎంత చేసినా...బట్టకాల్చి మీద వేసుడు కాంగ్రెస్‌కు అలవాటే.కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ స్పందన...కోడిగుడ్డుపై ఈకలు ఏరినట్టే ఉంది.ప్రధాని మోదీ నాయకత్వంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌తో వికసిత్ భారత్ - వికసిత్ తెలంగాణ కల నెరవేరడం ఖాయం అని తెలిపారు..

# మని(షి)'ఛీ'

అంతరిక్షాన్ని ఆసాంతం..
జయించానంటూ కాలర్ ఎగరేస్తాడు
సూక్ష్మ వైరస్ వెంటపడితే..
ఇంట్లో దూరి దాక్కుంటాడు !

భూగోళాన్ని అంతర్జాల వలలో..
చుట్ట చుట్టి పడేస్తానంటాడు
భూమాతను కాలుష్య కంపుతో..
నరక కూపంగా మార్చేస్తాడు !

నీతి న్యాయం అంటూ..
యమ ఫోజులు కొట్టేస్తాడు
వెనక చేరి పదునైన కత్తులతో..
వెన్నుపోటు పొడిచేస్తాడు !

ఉన్నత చదువులు చదివి..
అన్ని తెలుసంటూ నరుకుతాడు
సంస్కార బుద్ధి హీనుడై...
మృగాడిగా క్రూరత్వం ప్రదర్శిస్తాడు !

గాలిలో తేలిపోతానంటూ..
ప్రగల్భాలు పలుకుతాడు నరుడు
మాట మీద నిలబడడం మరిచి...
జంతువును తలపింపజేస్తాడు !

మంచి చెడ్డల్ని నేర్చి..
దుర్మార్గ ఆలోచనలు చేస్తాడు
అమ్మ రొమ్ము పాలు తాగి ఎదిగి..
తల్లి రొమ్మును తన్నేస్తాడు మని(షి)ఛీ !

సకలం తెలుసని..
మురిసి మెరిసి పోతాడు
అక్షర జ్ఞానం ఎంతున్నా..
అపర అజ్ఞాని అనిపించుకుంటాడు !


ఇకమతుల నవ్య నరుడు
అందితే జుట్టు లేదంటే కాళ్ళు
తను నిర్మించుకున్న సాంకేతిక వలలో..
తానే చిక్కి గిలగిల కొట్టుకుంటున్నాడు !

మధుపాళీ
9949700037

# హిందీ భాష వ్యాప్తికి మోటూరి ఎనలేని సేవలు

## మోటూరి సత్యనారాయణ జయంతి

మోటూరి సత్యనారాయణ హిందీ భాష ప్రచారానికి ఎనలేని సేవలు అందించిన విద్యావేత్త. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన భారత రాజ్యాంగ సభలో సభ్యులు. 1966 వరకు రాజ్యసభ (భారత ప్రభుత్వ ఎగువ సభ) లో నామినేటెడ్ సభ్యులు. భారత రాజ్యాంగంలో హిందీని అధికారిక భాషగా మార్చడంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారు. రాజభాష కమిషన్ సభ్యులుగా, స్వాతంత్ర్య సమర యోధులుగా, రాజ్యసభ సభ్యులుగా, హిందీ వికాస సమితి స్థాపకులుగా, హిందీ ప్రచార సభ ప్రధాన కార్యదర్శిగా, బహుభాషా వేత్తగా బహుముఖ సేవలు అందించిన ప్రతిభా శాలి. భారత ప్రభుత్వ పద్మశ్రీ, పద్మ భూషణ్ పురస్కార గ్రహీత.



మోటూరి సత్యనారాయణ (ఫిబ్రవరి 2, 1902 – మార్చి 6, 1995) 1902, ఫిబ్రవరి 2 వ తేదీన కృష్ణా జిల్లా దొండపాడు గ్రామంలో పెద పిచ్చయ్య, రత్తమ్మ దంపతులకు జన్మించారు. ప్రాథమిక విద్య అనంతరం తెలుగు, సంస్కృతం అభ్యసించాడు. ఆంధ్ర జాతీయ కళాశాలలో ఉన్నతులైన గురువుల వద్ద శిక్షణ పొంది హిందీ బాగా అభ్యసించారు. తర్వాత ఇంగ్లీషు, తమిళం, కన్నడం, మలయాళం, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ మొదలైన భాషలు కూడా నేర్చుకున్నారు. ఆయనకు రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక, ఐతిహాసిక, వైజ్ఞానిక, సాంకేతిక విషయాలలో లోతుగా ప్రవేశం ఉండేది. అయన హిందీ ప్రచారంతో జీవితాన్ని ప్రారంభించి క్రమంగా సంఘటకులుగా, కార్యదర్శిగా, చివరకు 1938లో హిందీ ప్రచార సభకు ప్రధాన కార్యదర్శి అయి 1961 వరకు కొనసాగారు. ఆ సంస్థ ప్రథమ ప్రధాన కార్యదర్శి పండిత హరి హర శర్మకు కుడిభుజంగా ఉండి సహకరించారు. అయన దూరదృష్టి, అవగాహన వల్లనే ఈ సభ హిందీ సాహిత్య సమ్మేళనం, ప్రయాగవారి బంధనం నుండి విముక్తి పొంది 1927లో స్వతంత్ర సంస్థగా ఆవిర్భవించింది.

మోటూరి ప్రధాన కార్యదర్శిగా ఉన్నంతకాలం దక్షిణ భారత హిందీ ప్రచార సభ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖింప దగినది. 1936లో ప్రచారసభకు 4 రాష్ట్రాలలో, 4 ప్రాంతీయ శాఖల నిర్మాణం అయన దూరదృష్టిని నిరూపిస్తుంది. మోటూరి సత్య నారాయణ... మహాత్మాగాంధీ, రాజేంద్ర ప్రసాద్ లకు అత్యంత విశ్వాస పాత్రులు. 1946లో జరిగిన సభ రజతోత్సవానికి బాపూజీ 12 రోజులు ఉండి సమావేశాలు జరిపించారు. ప్రతి దినం గాంధీ ప్రార్థనా సమావేశాలలో వేలాది మంది పాల్గొనేవారు. మద్రాసు కార్పొరేషన్ నుండి త్యాగరాయ నగరంలో సుమారు ఐదున్నర ఎకరాల భూమిని సంపాదించి అప్పటి అవసరాల కనుగుణంగా భవనాలను నిర్మించారు. ముద్రణాలయం, పుస్తక ప్రచురణ, పరీక్షలు నిర్వహించడం ద్వారా ఆదాయం సమకూర్చారు. హిందీ ప్రచారాన్ని పెంపొందించడానికి ప్రతి రాష్ట్రంలోను, కొన్నిజిల్లాలలోను, మండలాల వారీగా సంరక్షకులను ఏర్పాటుచేసి నూతన ప్రణాళికల ద్వారా దక్షిణ భారతమంతా మారుమూలల వరకు హిందీని వ్యాపింప జేశారు. మోటూరి నేతృత్వ కృషి ప్రజలలో హిందీ పట్ల ప్రేమ, గౌరవం పెంచింది. 1942 లో క్విట్ ఇండియా ఉద్యమంలో జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య సమర యోధులుగా తామ్రపత్ర గ్రహీతలయ్యారు. రాజకీయ రంగంలో కూడా విలువైన సేవలు అందించారు. భారత రాజ్యాంగ చట్టంలో 17వ భాగం రాజభాష అధ్యాయ నిర్మాణంలోను, దాని డ్రాఫ్టింగ్, రాజ్యాంగ సభలో నెగ్గించడంలో అయన కృషి, సహకారం ఎంతో ఉన్నాయి. రాష్ట్రపతి ద్వారా 1954 నుండి 1966 వరకు వరుసగా రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా నామినేట్ చేయబడ్డారు. 1956లో రాజభాషా కమిషన్ కు సభ్యులుగా పనిచేశారు.

తెలుగు భాషా సమితి స్థాపక కార్యదర్శిగా "తెలుగు విజ్ఞాన సర్వస్వం" 16 భాగాలలో ప్రచురించారు. అదే విధంగా హిందీ వికాస సమితిని కూడా స్థాపించి హిందీలో "విశ్వవిజ్ఞాన సంహిత" పేరుతో హిందీ విజ్ఞాన సర్వస్వాలను ప్రచురింప చేశారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను కళాప్రపూర్ణతో గౌరవిస్తే, కొన్ని విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్ తో సన్మానించాయి. భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ (1958), పద్మభూషణ్ (1962) పురస్కారాల్ని ఇచ్చి గౌరవించింది. అయన సేవలను పురస్కరించుకుని హైదరాబాదులో రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన 1957లో పెద్ద ఎత్తున అభినందన సభ జరిపి అభినందన గ్రంథం సమర్పించారు. ఆయన 1995 సంవత్సరం మార్చి 6 వ తేదీన పరమపదించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్
ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440595494

# నీ చూపు మారితే...?

ప్రపంచం ఎన్నో రకాల ఆలోచనల కలిగిన మనుషుల సమ్మేళనం.

ఆ మనుషుల చూసే చూపు తీరే ఆలోచనలకు శ్రీకారం.

మనిషి చూసే విధానమే తన వ్యక్తిత్వానికి ప్రతిరూపం.

చూపులో కదలాడే భావాలే మాటలకు తొలిమెట్టు.

అంతులేని సంఘర్షణలు, అంతుచిక్కని సందేహాలు ఎదుటివారి చూపుల్లో అన్వేషించడం మానవ నైజం.

నీ హృదయంలో పాతరేసిన ఎన్నో కుతంత్రాల తెరలకు మారుపేరు కనుచూపు.

నీ చూపులో ఉంటుంది ఎదుటి వాళ్లకు విలువ నిచ్చే అవకాశం ఇది గమనించాలి ప్రతి ఒక్కరం.

నీ చూపు నిన్ను నువ్వు పరిశీలించుకునే ఒక మానసిక సాధనం.

నీ చూపు మారితే నీ జీవితం మారుతుంది అనేది తథ్యం.

నువ్వు చూసే చూపులో మంచి ఉంటే ఎప్పుడూ ఎదురు రాదు ఏ అవరోధం.

నీ మాట తీరుపై ప్రభావం నువ్వు చూసే విధానానికే సాధ్యం.

మంచి ఆలోచనలతో ఉన్న నీ చూపు జీవితంలో కనబడుతుంది ఓ మంచి మార్పు.

నీ చూపు ప్రతిక్షణం చేయాలి మంచి మార్పుకై పోరాటం.

అసూయతో నీ చూపు కాకూడదు అవలక్షణపు సంకేతం.

ద్వేషంతో చూడకు అది నీ దరిద్రానికి దారి అవుతుందని మరువకు నేస్తం.

అభిమానంతో చూడు అది నీ వెంట సైన్యంగా మారుతుంది అనేది ఖాయం.

ప్రేమతో చూడు అది నీకు కొండంత అండగా నిలుస్తుంది అనేది జగమెరిగిన సత్యం.

నువ్వు చూసే చూపే నీకున్న లక్షణాలకు నిదర్శనం.

నీ చూపు గొప్పదైతే నీ చుట్టూ పరిస్థితులు అవుతాయి అనుకూలం.

నీ చూపు లక్షణం ఉన్నతంగా ఉంటే ప్రతిదీ అవుతుంది నీ పాదాక్రాంతం.

- వంశీకృష్ణ గౌడ్ బండి
రంగయ్యపల్లి,రేగొండ
జయశంకర్ భూపాలపల్లి జిల్లా
9550837962

# అంకెల గారడీ.. సామాన్యుడికి ఉరితాడు!

## వికసిత భారతం ఎవరి కోసం సగటు జీవి జేబుకు చిల్లులేనా?

ప్రభుత్వాలు మారినా, బడ్జెట్లు మారుతున్నా సామాన్యుడి తలరాత మాత్రం మారడం లేదని 2026-27 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్ మరోసారి నిరూపించింది. పార్లమెంటు సాక్షిగా ఆర్థిక మంత్రి వినిపించిన అంకెల గారడీలో మధ్యతరగతి ఆకాంక్షలు ఆవిరైపోయాయి. దేశ ఆర్థిక వ్యవస్థ ఐదు ట్రిలియన్ డాలర్ల దిశగా దూసుకుపోతోందని పాలకులు గంభీరంగా ప్రకటిస్తున్నప్పటికీ, ఆ సంపద సామాన్యుడి దరికి చేరడం లేదు సగదా, ఉన్న జేబుకు చిల్లు పెడుతోంది. దాదాపు రూ. 53 లక్షల కోట్ల భారీ వ్యయంతో రూపొందించిన ఈ పద్దులో, అంకెలు మెరుస్తున్నా సగటు జీవి బతుకు మాత్రం భారంగానే మారింది. గత కొన్ని ఏళ్లుగా ద్రవ్యోల్బణం గుప్పిట్లో నలిగిపోతున్న పేద, మధ్యతరగతి వర్గాలు ఈ బడ్జెట్ ద్వారా కొంత ఊరట లభిస్తుందని ఆశించాయి. కానీ ప్రభుత్వం మాత్రం కార్పొరేట్ సంస్థలకు కార్పెట్ వేస్తూ, సామాన్యుడిపై మాత్రం పన్నుల పిడుగు వేసింది.



ముఖ్యంగా ఆదాయపు పన్ను విషయంలో జరిగిన ప్రచారం అంతా వెలుగు, వాస్తవం అంతా చీకటి అన్నట్లుగా ఉంది. స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని రూ. 75,000 నుండి రూ. 1,00,000 కి పెంచి, ఏదో పెద్ద ఉపకారం చేసినట్లు ప్రభుత్వం బిల్డప్ ఇచ్చింది. కానీ నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలు, రవాణా ఖర్చులు పెరిగిన వేగంతో పోలిస్తే ఈ రాయితీ ఏ మూలకు సరిపోదు. పైగా, పాత పన్ను విధానాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తూ ప్రజలను కొత్త విధానం వైపు బలవంతంగా నెట్టడం వెనుక పెద్ద కుట్రే ఉంది. సెక్షన్ 80జ వంటి పొదుపు పథకాలపై మినహాయింపులు లేకపోవడం వల్ల సామాన్యుడికి భవిష్యత్తు భద్రత కరువవుతోంది. ప్రజలు తమ కష్టార్జితాన్ని దాచుకోకుండా, ఖర్చు చేయాలనే ధోరణిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది, ఇది దీర్ఘకాలంలో దేశంలోని కుటుంబ ఆర్థిక వ్యవస్థలను చిన్నాభిన్నం చేస్తుంది.

మరోవైపు దేశానికి వెన్నెముక అని చెప్పుకునే వ్యవసాయ రంగానికి ఈ బడ్జెట్ పెద్ద దగా చేసింది. వ్యవసాయ రంగానికి రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించినట్లు చెబుతున్నా, మరోవైపు ఎరువులు మరియు ఆహార సబ్సిడీలలో దాదాపు 12% కోత విధించడం రైతు వెన్ను విరిచింది. పీఎం కిసాన్ నిధిని రూ. 9,000 కు పెంచడం వల్ల వచ్చే లాభం కంటే, ఎరువుల ధరలు పెరగడం వల్ల అయ్యే నష్టమే ఎక్కువ. డీజిల్ ధరలు తగ్గకపోవడం వల్ల సాగు వ్యయం భారమై, పండించిన పంటకు మద్దతు ధర దక్కక రైతులు అల్లాడుతున్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు ఊసే లేదు. రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (MGNREGA) కేటాయింపులు రూ. 86,000 కోట్ల దగ్గరే నిలిచిపోవడం వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కునారిల్లుతోంది.

మౌలిక సదుపాయాల కల్పన పేరుతో రూ. 12.21 లక్షల కోట్లు కేటాయించిన కేంద్రం, సామాన్యుడి దైనందిన జీవితాన్ని ప్రభావితం చేసే విద్య, వైద్య రంగాలను విస్మరించింది. విద్యా రంగానికి కేవలం రూ. 1.25 లక్షల కోట్లు, వైద్య రంగానికి కేవలం రూ. 90,000 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచకుండా, కేవలం ఆయుష్మాన్ భారత్ వంటి ఇన్సూరెన్స్ పథకాలతో సరిపెట్టడం వల్ల కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి సామాన్యుడు బలి అవుతున్నాడు. రైల్వే బడ్జెట్‌ను విశ్లేషిస్తే సామాన్యుడిపై వివక్ష స్పష్టంగా కనిపిస్తోంది. రూ. 2.65 లక్షల కోట్ల రైల్వే నిధులన్నీ కేవలం వందే భారత్ వంటి విలాసవంతమైన రైళ్లకే పరిమితమవుతున్నాయి. సామాన్యుడు ప్రయాణించే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను తగ్గించడం వల్ల పేదవాడి ప్రయాణం నరకప్రాయమైంది.

అభివృద్ధి అంటే కేవలం గణాంకాల్లో కనిపించే జీడీపీ వృద్ధి మాత్రమే కాదు, అది సామాన్యుడి కళ్లలో కనిపించే సంతోషం. కానీ ఈ బడ్జెట్ ధనవంతుడి ఆస్తులను పెంచడానికి, పేదవాడి కడుపు కొట్టడానికి సిద్ధమైనట్లు కనిపిస్తోంది. పెట్రోల్, డీజిల్‌పై భారీగా వసూలు చేస్తున్న సెస్సులు, నిత్యావసరాలపై జీఎస్టీ భారం తగ్గించకపోవడం వల్ల సామాన్యుడి వంటింట్లో నిత్యం మంటలు రేగుతూనే ఉన్నాయి. యువతకు ఉద్యోగాల కల్పన విషయంలో కూడా బడ్జెట్ నిరాశనే మిగిల్చింది. ఖాళీగా ఉన్న లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంపై స్పష్టత లేదు. నిరుద్యోగితా రేటు గరిష్ట స్థాయికి చేరిన తరుణంలో, యువతకు ఉపాధి మార్గాలు చూపని ఈ బడ్జెట్ దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే, దేశ సంపదలో మెజారిటీ వాటాను అనుభవిస్తున్న అతి కొద్దిమంది సంపన్నుల కోసం ఈ ప్రభుత్వం ఎర్ర తివాచీ పరుస్తోంది. సామాన్యుడిపై భారాల మోత మోగిస్తూనే, బడా పారిశ్రామికవేత్తల మొండి బకాయిలను మాఫీ చేయడం ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టం చేస్తోంది. అప్పుల ఊబిలో కూరుకుపోయిన సామాన్యుడికి ఈ బడ్జెట్ ఏమాత్రం ఊపిరి పోయడం లేదు. చివరకు మిగిలేది ఏమిటంటే, ధనవంతులు మరింత ధనవంతులుగా మారడం, పేదవారు మరింత పేదరికంలోకి నెట్టబడడమే. ఈ ఆర్థిక వివక్ష సమాజంలో అసమానతలను మరింత పెంచుతుంది. ప్రజల నుంచి పన్నుల రూపంలో రక్తాన్ని పిండుతూ, సంపన్న వర్గాలకు రాయితీలతో పట్టువస్త్రాలు కడుతున్న ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. గణాంకాల గారడీతో ఎంతో కాలం వాస్తవాలను కప్పిపుచ్చలేరు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, సామాన్యుడిపై మోపిన ఈ భారాన్ని తగ్గించి, ప్రజా క్షేమమే పరమావధిగా నిర్ణయాలు తీసుకోవాలి. లేనిపక్షంలో సామాన్యుడి ఆగ్రహానికి పాలకులు గురికాక తప్పదు. ఈ బడ్జెట్ మొత్తంగా చూస్తే ఒక వర్గానికే మేలు చేస్తూ, సామాన్య బహుజన వర్గాలను విస్మరించిన అప్రజాస్వామిక పత్రంగా నిలిచిపోతుంది.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

### కెసిఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై

# భగ్గుమన్న బిఆర్ఎస్

## జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే బిగాల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ





**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 1 (నినాదం) :** సిట్ విచారణ పేరుతో కెసిఆర్ కు నోటీసులు ఇవ్వడం పై నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌కి సిట్ నోటీసులు పంపించడం ఆయనను అవమానించిన ట్లనని, ఆయన ఇంటికి నోటీసులు అతికించడం విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసనగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 1500 బైక్‌లపై ర్యాలీతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఆదివారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి నిజామాబాద్ అర్బన్ మాజీ గణేష్ బిగాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమానికి మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఎల్లమ్మ గుట్ట చౌరస్తా నుండి నిఖిల్ సాయి చౌరస్తా, పూలంగ్ మీదుగా రాజ రాజేంద్ర చౌరస్తా, గాంధీ చౌక్, పాత కలెక్టరేట్ మీదుగా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకు నల్ల జెండాలు, బిఆర్ఎస్ జండాలతో ర్యాలీగా నిరసన తెలిపారు. ఎల్లమ్మ గుట్ట చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు సిద్ధం చేసిన దిష్టిబొమ్మను పోలీసులు లాక్కొని పోలీస్ వ్యాన్‌లో వేశారు. దీంతో పోలీసులకు బిఆర్ఎస్ నాయకుల మధ్య తోపులాట జరగగా పలువురు బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి నాలుగవ టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ చేసిన నాయకులను, కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, గణేష్ బిగాల కలిసి నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్‌కి వెళ్లి కార్యకర్తలకు అండగా మేమున్నామంటూ ధైర్యం చెప్పారు.

# చెట్టు సహాయం (కథ)

అదో అందమైన ప్రకృతి ఒడి. ఊరి పక్కనే పారుతున్న నది. ఆ ఊరిలో గోవర్ధన్ అనే సుతారి మేస్త్రీ ఉండేవాడు. ఆయనకు రమేశ్ అనే ఒక కొడుకు ఉండేవాడు. రమేశ్ కు చిన్నప్పటి నుండే అక్షరమన్నా, అడవన్నా అమితంగా ఆసక్తి ఉండేది . రమేశ్ వాళ్ల నాన్న కు చదువంటే ఇష్టం లేదు .తనతో పాటు మేస్త్రీ పనికి రావాలని రోజూ గొడవ పడుతుండేవాడు. తన పేదరికపు నుండి బయటపడటానికి కొడుకు కొంచెం వేడి నీళ్లకు చన్నీళ్ళ మాదిరిగా ఉపయోగ పడాలని అతని ఆశ. రమేశ్‌కు మాత్రం మంచి చదువు చదువుకొని ఊరికి, సమాజానికి సేవచేయాలని ఆకాంక్ష . రమేశ్ వాళ్లనాన్నను ఒప్పించి వాళ్ల ఊరిలో ఉన్న 5వ తరగతి వరకు చదివాడు. ఇగ ఆపై చదువులు చదవాలంటే చాలా దూరం వెళ్లాలి.నదిని కూడా దాటాలి నదిని దాటితేనే పెద్ద పట్టణం ఉంది అక్కడ పై చదువులకు కావాల్సిన వసతి ఉంది.వాళ్ల నాన్న చదువు మానెయ్యి ఇగ చదివిన వరకు చాలు, నా తోటి పనికిరా అని ఒకటే పోరు పెట్టేవాడు. అంతే గాకుండా పెద్ద నదిని కూడా దాటాలి. అది నీనుంచి కాదని తెగేసి చెప్పేవాడు దానితో నదీ ఒడ్డున ఉన్న ఒక పెద్ద చెట్టుకింద కూర్చుని రమేశ్ బాగా ఏడ్వ సాగాడు. అప్పుడు చెట్టు ప్రత్యక్ష మై ఎందుకు ఏడ్చుతున్నావు, నీకు ఏమి కష్టం వచ్చింది అని అడిగింది. దానికి రమేశ్ బాగా చదువుకొని కలెక్టర్ కావాలని మా ఊరికి, సమాజానికి సేవ చేయాలని చెప్పాడు . నాకు నదిని దాటడానికి ఎవరు సహాయం చేయడం లేదు. అని బదులిచ్చారు. అప్పుడు నేను నదికి అడ్డంగానా కొమ్మలను వంచుతాను వాటిసహాయంతో నువ్వు నదిని దాటి మంచిగ చదుకొమ్మని చెప్పింది. అలాగే అని రమేశ్ కొమ్మల సహాయంతో నదిని దాటి పట్టణంలో బాగా కష్టపడి, సమయాన్ని సద్వినియోగం చేసుకొని కలెక్టర్ అయ్యాడు. తిరిగి కొమ్మల సహాయంతో తన ఊరికి చేరుకొని రోడ్లు, పాఠశాలలు, దవాఖానాలు.నదికి అడ్డంగా బ్రిడ్జిని నిర్మించి ఊరి వారి కష్టాలను తీర్చాడు. రమేశ్‌ను వాళ్ల నాన్న, మరియు ఊరి వాళ్లు బాగా మెచ్చుకున్నారు.రమేశ్ చెట్టుకు కృతజ్ఞతలు చెప్పాడు. చెట్టు ఒక స్నేహితుడు, చెట్టు అమ్మ లాంటిదని, చెట్టు లేకుంటే మానవ మనుగడలేదని, తరువే మనకు ఆ దేరువని ప్రచారం చేశాడు రమేశ్.

తాటిపాముల రమేశ్ (తార)
7981566031



ఈ ఉరుకుల పరుగులు జీవితంలో చాలా మందికి నిద్రతోపాటు సరైన ఆహారం కూడా తీసుకునేందుకు కూడా సమయం ఉండటం లేదు. అది కూడా సమయానికి తినడం లేదు. పురుషుల సంగతి పక్కన పెడితే..మహిళలు మాత్రం తీసుకునే ఆహారంపై ఎక్కువగా శ్రద్ధ చూపకపోవడంతో పోషకాహారం లోపంతో వివిధ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

# మహిళల్లో ఐరన్‌లోపం ఎందుకు వస్తుంది?

ముఖ్యంగా మహిళల్లో ఐరన్ (ఇనుము) లోపం పెద్ద ఆరోగ్య సమస్యగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా అనీమియా (రక్తహీనత)తో బాధపడుతున్న వారిలో అధిక శాతం మహిళలే కావడం గమనార్హం. ముఖ్యంగా కిషోర వయసు అమ్మాయిలు, గర్భిణులు, పాలిచ్చే తల్లుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది.

**ఐరన్ అంటే ఏమిటి?**

ఐరన్ మన శరీరంలో హీమోగ్లోబిన్ తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. హీమోగ్లోబిన్ రక్తం ద్వారా శరీరానికి ఆక్సిజన్ అందిస్తుంది. ఐరన్ తక్కువైతే శరీరానికి కావాల్సిన ఆక్సిజన్ అందక అలసట, బలహీనత వంటి సమస్యలు మొదలవుతాయి.

**మహిళల్లో ఐరన్ లోపానికి ప్రధాన కారణాలు**

నెలసరి సమయంలో అధిక రక్తస్రావం.. ప్రతి నెలా వచ్చే మాసిక ధర్మం కారణంగా మహిళలు సహజంగానే ఐరన్ కోల్పోతుంటారు. ఎక్కువ రోజులు లేదా ఎక్కువగా రక్తస్రావం జరిగే వారికి ఐరన్ లోపం మరింత పెరుగుతుంది.

**పోషకాహార లోపం..** ఐరన్ ఉన్న ఆహారం తక్కువగా తీసుకోవడం, ఫాస్ట్ ఫుడ్ మీద ఆధారపడటం, ఆకుకూరలు, పప్పులు తినకపోవడం ప్రధాన కారణాలు.గర్భధారణ, పాలిచ్చే కాలం.. గర్భధారణ సమయంలో తల్లి నుంచి బిడ్డకు ఎక్కువ ఐరన్ అవసరం అవుతుంది. సరైన పోషకాహారం లేకపోతే తల్లిలో ఐరన్ లోపం ఏర్పడుతుంది. జీర్ణ సంబంధిత సమస్యలు.. గ్యాస్ట్రిక్ సమస్యలు, అల్సర్లు, ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం వల్ల కూడా ఐరన్ శోషణ తగ్గుతుంది.

**పరాన్నజీవి సంక్రమణలు..** కొన్ని రకాల పురుగులు (హుక్‌వార్మ్ లాంటి) రక్తాన్ని పీల్చి ఐరన్ లోపానికి కారణమవుతాయి.

**ఐరన్ లోపం లక్షణాలు, సమస్యలు**

ఎప్పుడూ అలసటగా అనిపించడం..చర్మం పసుపు లేదా తెల్లగా మారడం..తల తిరగడం, తలనొప్పి...గుండె వేగంగా కొట్టుకోవడం..జుట్టు రాలడం..ఊపిరి తక్కువగా రావడం దృష్టి కేంద్రీకరించలేకపోవడం ఈ లక్షణాలు ఎక్కువ రోజులు కొనసాగితే వెంటనే వైద్యుడిని సంప్రదించడం అవసరం.

**ఐరన్ లోపాన్ని ఎలా తీర్చాలి?**

ఐరన్ అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి.. శాకాహారులులైతే.. పాలకూర, తోటకూర, మెంతికూర, శెనగపప్పు, కందిపప్పు, మినపప్పు, బెల్లం, ఎండు ద్రాక్ష, ఖర్జూరం, నువ్వులను తమ ఆహారంలో తప్పకుండా ఉండేలా చూసుకోవాలి. మాంసాహారులులైతే.. కోడి, మేక కాలేయం (లివర్), ఎర్ర మాంసం, చేపలు, గుడ్డు పచ్చసొన తమ ఆహారంలో తీసుకోవాలి.

**విటమిన్ C తీసుకోవాలి..**

ఐరన్ శరీరంలో బాగా శోషించబడాలంటే విటమిన్ C అవసరం. నిమ్మకాయ, నారింజ, ఉసిరికాయ, టమాటా లాంటి వాటిని ఆహారంతో పాటు తీసుకోవాలి.టీ, కాఫీ తగ్గించాలి.. భోజనం చేసిన వెంటనే టీ లేదా కాఫీ తాగితే ఐరన్ శోషణ తగ్గుతుంది. కనీసం ఒక గంట గ్యాప్ ఇవ్వడం మంచిది.వైద్యుల సూచనతో ఐరన్ మాత్రలు.. తీవ్రమైన ఐరన్ లోపం ఉన్నప్పుడు డాక్టర్ సూచనతో ఐరన్ సప్లిమెంట్స్ తీసుకోవాలి. స్వయంగా ఐరన్ లోపం చిన్న సమస్యలా కనిపించినా దీర్ఘకాలంలో ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కౌమార దశలో ఉన్న అమ్మాయిలు, గర్భిణులు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవడం అవసరమని గుర్తించాలి.

## అవని

## పాలతో వీటిని కలుపుకొని తాగితే..

**దిమ్మతిరిగే ప్రయోజనాలు..**



పాలు మన రోజువారీ ఆహారంలో కీలక పాత్రను పోషిస్తాయి. టీ, కాఫీ లేదా ఇతర పదార్థాల రూపంలో రోజూ ఏదో విధంగా మనం వీటిని తీసుకుంటూనే ఉంటాం. ఇందులో కాల్షియం, ప్రోటీన్, విటమిన్ డి, బి12, పొటాషియం, భాస్వరం వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల, ప్రతిరోజూ పాలు తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభించడమే కాకుండా, ఎముకలు, కండరాలు బలపడతాయి. ముఖ్యంగా రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని పాలు తాగడం వల్ల హాయిగా నిద్ర పట్టవచ్చు. కానీ సాదా పాలు తాగే బదులు, దానికి కొన్ని సహజ పదార్థాలు జోడించడం వల్ల పాల పోషక విలువలు రెట్టింపు అవుతాయి. ఈ వ్యాసంలో, పాలను శక్తివంతమైన పానీయంగా మార్చే ఐదు ముఖ్యమైన పదార్థాల గురించి తెలుసుకుందాం.

పాలలో పసుపు కలిపి తాగడం

పసుపులో కర్కుమిన్ అనే శక్తివంతమైన సమ్మేళనం ఉంటుంది, ఇది అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. పాలలోని కొవ్వు పదార్థం శరీరం ఈ కర్కుమిన్‌ను సులభంగా గ్రహించడంలో సహాయపడుతుంది. ఒక గ్లాసు పాలలో ఒక చెంచా పసుపు వేసి మరిగించి తాగడం ద్వారా శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే వివిధ ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి కూడా సహాయపడుతుంది. కీళ్ల నొప్పులు, వాపులను తగ్గించడానికి ఇది ఒక అద్భుతమైన నివారణ.పాలలో చిటికెడు దాల్చిన చెక్క పొడిని కలుపుకోవడం వల్ల పాల రుచి పెరగడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచిది. దాల్చిన చెక్క శరీరంలో మంటను తగ్గిస్తుంది.



# తులసితో అదిరిపోయే చర్మ ఆరోగ్యం

ఆయుష్ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ జాతీయ ఆయుర్వేద సంస్థ ప్రకారం తులసి అనేది చర్మ సౌందర్యాన్ని పెంచడంతో ఎంలో అద్భుతంగా పనిచేస్తుంది. ఇది ముఖంపై మొటిమలు, మచ్చలను తొలగించడంలో సహాయపడుతుంది.తులసిలోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు చర్మాన్ని శుభ్రంగా, ఆరోగ్యంగా , ప్రకాశవంతంగా ఉంచడంలో సహాయపడతాయి.

తులసి నీరు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు ! నిపుణుల ప్రకారం: తులసి నీరు మన శరీరంలోని రక్తాన్ని శుద్ధి చేసి చర్మంపై మొటిమలు రాకుండా అడ్డుకుంటుంది. అలాగే కొత్త మచ్చలు ఏర్పడకుండా నిరోధిస్తుంది. తులసి ఆకులను రోజూ తినడం వల్ల అంతర్గత చర్మ ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. తులసిని పలు విధాలుగా చర్మ ఆరోగ్యానికి ఉపయోగించవచ్చు. తులసి ఫేస్ ప్యాక్ ద్వారా ముఖాన్ని మెరిసేలా చేయవచ్చు. ఇందుకోసం ఎనిమిది నుండి పది తాజా తులసి ఆకులను మెత్తగా పేస్ట్ లా చేసి.. దానిలో ముల్తానీ మిట్టి లేదా తేనెతో కలపండి. ఈ పేస్ట్‌ను మీ ముఖంపై పదిహేను నుండి ఇరవై నిమిషాలు అప్లై చేసి, తర్వాత కడిగేయండి. ఇది మొటిమలను తొలగించడంలో, మచ్చలను తగ్గించడంలో, జిడ్డుగల చర్మాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. వారానికి రెండు నుండి మూడు సార్లు దీన్ని ఉపయోగిస్తే.. మీ చర్మం మిళమిళా మెరిసిపోవాల్సిందే

**తులసి నీరు :** తులసి నీరు ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. దీని కోసం, ఐదు నుండి ఏడు తులసి ఆకులను రాత్రిపూట శుభ్రమైన నీటిలో నానబెట్టండి. ఉదయం ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగడం వల్ల విష పదార్థాలు బయటకు వెళ్లి, రక్తాన్ని శుద్ధి చేసి, చర్మాన్ని ప్రకాశవంతం చేస్తుంది. ఇది మొటిమలకు సులభమైన, ప్రభావవంతమైన నివారణ.

**తులసి టీ :**

తులసి టీ రుచికరమైనది మాత్రమే కాదు, దీనికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఈ టీ తయారు చేయడానికి, నాలుగు నుండి ఐదు తులసి ఆకులను నీటిలో మరిగించండి. నిమ్మకాయ లేదా తేనెతో కలిపి తాగడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది, చర్మ కాంతి మెరుగుపడుతుంది.

**పచ్చి తులసి ఆకులు:** ఒత్తిడి వల్ల కలిగే మొటిమలపై ఇది ప్రత్యేక ప్రభావాన్ని చూపుతుంది. పచ్చి తులసి ఆకులను నమలడం కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. ఉదయం రెండు నుండి మూడు తాజా తులసి ఆకులను నమలడం వల్ల మీకు తాజాదనం లభిస్తుంది. అలాగే చర్మాన్ని ఇన్ఫెక్షన్ నుండి కాపాడుతుంది.

**రోగనిరోధక శక్తి:**

తులసిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఇది చౌకైన, సహజమైన, సులభంగా లభించే నివారణ. మీకు మొటిమలు లేదా మచ్చలు తీవ్రంగా ఉంటే ఆయుర్వేద వైద్యుడిని సంప్రదించి తులసిని తీసుకోండి. దీనితో పాటు, మంచి పరిశుభ్రత పాటించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, పుష్కలంగా నీరు త్రాగడం వల్ల చర్మ కాంతి చాలా రెట్లు పెరుగుతుంది

నినాదం మార్కెట్

# ఆరు సంవత్సరాల్లో అతిపెద్ద పతనం

## సావరిన్ గోల్డ్ బాండ్ల ఇన్వెస్టర్లకు బ్యాడ్ న్యూస్!

కేంద్ర బడ్జెట్ 2026 ఫ్యూచర్స్, ఆప్షన్స్ (F&O)లో వ్యవహరించే భారతీయ స్టాక్ మార్కెట్ వ్యాపారులను నిరాశపర్చింది. వారితో పాటు సావరిన్ గోల్డ్ బాండ్లకు కొత్త పన్ను నియమాలను కూడా పేర్కొంది.అసలు ఇష్యూకు సభ్యత్వాన్ని పొందని పెట్టుబడిదారులపై పన్ను భారాన్ని పెంచింది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026 బడ్జెట్‌లో ప్రకటించిన ప్రతిపాదన ప్రకారం SGBలపై మూలధన లాభాల పన్ను మినహాయింపు అసలు ఇష్యూకు సభ్యత్వాన్ని పొంది, మెచ్యూరిటీ వరకు ఉంచిన పెట్టుబడిదారులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.సావరిన్ గోల్డ్ బాండ్లకు సంబంధించి మూలధన లాభాల పన్ను నుండి మినహాయింపు.. జారీ సమయంలో ఒక వ్యక్తి అటువంటి బాండ్లకు సభ్యత్వాన్ని పొంది, మెచ్యూరిటీ తర్వాత విమోచనం వరకు ఉంచితే అప్పుడు మాత్రమే పన్ను మినహాయింపు ఉంటుందని ఆర్థిక మంత్రి సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ మినహాయింపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జారీ చేసే అన్ని సావరిన్ గోల్డ్ బాండ్లకు ఒకే విధంగా వర్తిస్తుందని కూడా తెలిపారు.వాస్తవానికి SGBలు ఇష్యూకు సభ్యత్వం పొందిన వ్యక్తులకు 100 శాతం పన్ను రహితంగా ఉండే విధంగా రూపొందించారు. RBI ద్వారా వాటిని రీడీమ్ చేసుకుంటూ ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు ఉంచబడ్డాయి.

## రూ.9.40 లక్షల కోట్లు కోల్పోయిన పెట్టుబడిదారులు

ఒకటి కాదు రెండు కాదు లక్షల కోట్ల ఆస్తి మదుపర్ల సంపద ఆవిరైపోయింది. మన దేశీయ మార్కెట్లు ఇన్వెస్టర్లకు చుక్కలు చూపించాయి. ఆదివారం (ఫిబ్రవరి 1) ఉదయం స్టాక్ మార్కెట్ ప్రారంభమైన తీరు, బడ్జెట్ ప్రసంగం తర్వాత కూడా సెన్సెక్స్ – నిఫ్టీ పందుకున్నాయి.మార్కెట్ ఉత్సాహంగా కొనసాగుతుందని అనిపించింది. కానీ అది అంతలోనే ఆశలు అడియాసలు అయ్యాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పెషల్ టాక్స్ (STT) పై పన్ను పెంపును ప్రకటించి, బైబ్యాక్‌లపై పన్నును పెంచిన వెంటనే, స్టాక్ మార్కెట్ తన ఉత్సాహాన్ని కోల్పోయింది.పెట్టుబడిదారులు గణనీయమైన నష్టాలను చవిచూశారు. ఒకానొక సమయంలో, సెన్సెక్స్ దాదాపు 2,400 పాయింట్లు పడిపోయింది. నిఫ్టీ 749 పాయింట్లు పడిపోయింది. అయితే, మార్కెట్ ఆ తరువాత కాస్త కోలుకుంది. చివరికి 2% కంటే తక్కువ క్షీణతతో ముగిసింది. ఇది ఆరు సంవత్సరాలలో బడ్జెట్ రోజున అతిపెద్ద క్షీణత.

**కుప్పకూలిపోయిన సెన్సెక్స్, నిఫ్టీలు**

ఫిబ్రవరి 1న జరిగిన ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌లో సెన్సెక్స్ – నిఫ్టీ బాగా పడిపోయాయి. ఆర్థిక



మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలో సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ టాక్స్ (STT) పెంచాలని ప్రతిపాదించిన తర్వాత పెట్టుబడిదారులు లాభాలను నమోదు చేసుకున్నారు. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (F&O) విభాగంలో అధిక ఊహాగానాలను అరికట్టడమే ఈ చర్య లక్ష్యం అని ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రారంభ లాభాలను తిప్పికొడుతూ, సెన్సెక్స్ 2,370.36 పాయింట్లు అంటే 2.88 శాతం పడిపోయి 80,000 మార్కు కంటే దిగువన 79,899.42కి చేరుకుంది. ఇది 1,546.84 పాయింట్లు అంటే 1.88 శాతం తగ్గి 80,722.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 495.20 పాయింట్లు అంటే 1.96 శాతం తగ్గి 24,825.45కి చేరుకుంది. మొత్తం రోజులో, ఇది 748.9 పాయింట్లు అంటే 2.95 శాతం పడిపోయి 24,571.75కి చేరుకుంది.

**భారీ క్షీణత చవిచూసిన స్టాక్స్ ఇవే..!**

బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల షేర్లను భారీగా అమ్మడం వల్ల మార్కెట్ క్యాప్ రూ.9.40 లక్షల కోట్ల మేర తగ్గింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు 5.61 శాతం, అదానీ పోర్ట్స్ షేర్లు 5.53 శాతం పడిపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, ఐటిసి, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా నష్టపోయాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, సన్ ఫార్మా, టైటాన్ లాభాలను చవిచూశాయి. దాదాపు 1673 షేర్లు పుంజుకోవడం, 2296 షేర్లు క్షీణించడం, 158 షేర్లు మారకపోవడం వల్ల మార్కెట్ సెంటిమెంట్ ప్రతికూలంగానే ఉంది.

**STTలో పెరుగుదల**

ఆప్షన్స్ కాంట్రాక్టులపై STTని 0.02 శాతం నుండి 0.05 శాతానికి పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆప్షన్ ప్రీమియంలు, ఆప్షన్ల వినియోగంపై STTని వరుసగా 0.1 శాతం, 0.125 శాతం నుండి 0.15 శాతానికి పెంచాలని ప్రతిపాదించినట్లు కేంద్ర మంత్రి చెప్పారు.

దీనిపై ఆర్థిక నిపుణులు భిన్నంగా స్పందించారు. ముఖ్యంగా ఎఫ్&ఓలో STT పెరుగుదల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (FPI) ప్రవాహాలపై, ముఖ్యంగా అధిక ఫ్రీక్వెన్సీ, ఉత్పన్న-కేంద్రీకృత ప్రపంచ నిధులపై స్వల్పంగా ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఛాయిస్ ఈక్విటీ బ్రోకింగ్‌లో సాంకేతిక పరిశోధన విశ్లేషకుడు ఆకాష్ షా మనీ కంట్రోల్ కథనంలో ఇలా పేర్కొన్నారు. ప్రపంచ రిస్క్-ఆఫ్ సెంటిమెంట్, పెరుగుతున్న US బాండ్ దిగుబడి, కరెన్సీ ఒత్తిళ్ల మధ్య, FPIలు ఇప్పటికే జాగ్రత్తగా ఉన్నారు, జనవరి 2026లో రూ. 41,000 కోట్లకు పైగా ఈక్విటీ అవుట్‌ఫ్లోలు సంభవించాయి. ఈ వాతావరణంలో, అధిక STT పన్ను అనంతర రాబడిని మరింత తగ్గిస్తుందని, స్వల్పకాలిక మరియు ఉత్పన్న-ఆధారిత విదేశీ పెట్టుబడిదారులకు భారతదేశం సాపేక్షంగా తక్కువ ఆకర్షణీయంగా మారుతుందని షా అన్నారు. ఫ్యూచర్లపై STTని 0.05%కి పెంచాలనే ఆర్థిక మంత్రి ప్రతిపాదన మొత్తం మూలధన మార్కెట్ నిర్మాణానికి, ముఖ్యంగా F&O ఆధారిత వాణిజ్యానికి నిర్మాణాత్మకంగా ప్రతికూలంగా ఉంది. లావాదేవీల ఖర్చులు పెరగడం వల్ల ట్రేడింగ్ వాల్యూమ్‌లు తగ్గుతాయి, స్వల్పకాలిక వృద్ధి మందగిస్తుంది. క్రియాశీల మార్కెట్ పాల్గొనేవారి లాభదాయకత తగ్గుతుంది. పన్ను అనంతర ట్రేడింగ్ సామర్థ్యంలో క్షీణత ఉత్ప న్నాలలో FII భాగస్వామ్యాన్ని కూడా తగ్గిస్తుంది, ఇది అధిక ద్రవ్యతకు దారితీస్తుందని నిపుణులు అభిప్రాయపడ్డారు.

మార్కెట్ ట్రేడింగ్‌లో ప్రత్యక్షంగా పాల్గొన్న బ్రోకరేజ్ కంపెనీలు, ఎక్స్ఛేంజీలు, AMCలు, డిపాజిటరీల ఆదాయ మార్గాలపై ఇది గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని సామ్కో సెక్యూరిటీస్‌లో పరిశోధన విశ్లేషకుడు రాజ్ గైకర్ మనీ కంట్రోల్ కథనంలో తెలిపారు. ఇటీవలి నెలల్లో డెరివేటివ్‌ల వాల్యూమ్‌లు ఇప్పటికే తగ్గాయి. ఈ పెరుగుదల సమీప కాలంలో ఆదాయాల స్పష్టతను మరింత ఒత్తిడికి గురి చేస్తుంది. ఈ చర్య ఆర్థికంగా సహాయకారిగా ఉన్నప్పటికీ, ఇది మూలధన మార్కెట్ సంబంధిత స్టాక్‌లకు సవాలును కలిగిస్తుందన్నారు.

**ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటాల అమ్మకం**

పెట్టుబడిదారుల భారీ అమ్మకాల కారణంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీ 4 శాతానికి పైగా పడిపోయింది. ప్రధాన రంగాల సూచీలలో నిఫ్టీ ప్రభుత్వ రంగ బ్యాంకు సూచీ అతిపెద్ద క్షీణతను నమోదు చేసింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా షేర్లు అత్యధికంగా 7 శాతం , 6 శాతం పడిపోయాయి. యూకో బ్యాంక్ , పంజాబ్ & సింద్ బ్యాంక్ అత్యల్పంగా 2 శాతం, 2.7 శాతం పడిపోయాయి. ఇండెక్స్‌లోని అన్ని 12 బ్యాంకులు నష్టాల్లో ముగిశాయి.

# ఐటీఆర్ దాఖలు చేసేవారికి గుడ్‌న్యూస్..

కేంద్ర బడ్జెట్‌ను సమర్పించినప్పటి నుండి దేశంలోని కార్మికవర్గం, మధ్యతరగతి వర్గాలలో కొత్త పన్ను నిబంధనల గురించి చర్చలు వేడిగా మారాయి. బడ్జెట్ అనేక ప్రధాన ప్రకటనలు చేసినప్పటికీ, ఒక నిర్ణయం పన్ను చెల్లింపుదారుల మనశ్శాంతిని, వా జేబులను నేరుగా ప్రభావితం చేస్తుంది.

ఆదాయపు పన్ను రిటర్న్‌లు (ITRలు) దాఖలు చేసేటప్పుడు తొందరపాటు లేదా సమాచారం లేకపోవడం వల్ల తప్పులు జరగడం సర్వసాధారణం. ఈ సమస్యను గుర్తించి ప్రభుత్వం పన్ను చెల్లింపుదారులకు గణనీయమైన ఉపశమనం కల్పించింది. మీ తప్పులను సరిదిద్దుకోవడానికి మీరు ఇప్పుడు మార్చి 31 వరకు సమయం తీసుకోవచ్చు. వాటిని సరిదిద్దడానికి మీకు ఇంకా అవకాశం ఉన్నప్పటికీ మీరు జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుంది.

ఇప్పుడు మీరు మార్చి 31 వరకు మీ తప్పును సరిదిద్దుకోవచ్చు:

కొత్త ఆదాయపు పన్ను నిబంధనల ప్రకారం, పన్ను చెల్లింపుదారులు ఇప్పుడు మార్చి 31 వరకు “ఆలస్యమైన” లేదా “సవరించిన” ఐటీఆర్‌లను దాఖలు చేయవచ్చు. డాక్యుమెంటేషన్ లేకపోవడం వల్ల ప్రజలు తరచుగా అంచనాల ఆధారంగా రిటర్న్‌లను దాఖలు చేస్తారు. మీరు మీ రిటర్న్‌లను దాఖలు చేసి కొంత ఆదాయాన్ని ప్రకటించలేకపోయారని లేదా అవసరమైన తగ్గింపును క్లెయిమ్ చేయలేదని తరువాత గ్రహిస్తే, భయపడాల్సిన అవసరం లేదు. మార్చి 31 నాటికి సవరించిన రిటర్న్‌ను దాఖలు చేయడం ద్వారా మీరు దీన్ని సరిదిద్దవచ్చు.

తప్పులను సరిదిద్దుకోవడం ఉచితం కాదు..

గడువును పొడిగించడం ద్వారా ప్రభుత్వం ఒకవైపు ఉపశమనం కల్పించింది. కానీ ఈ సౌకర్యం పూర్తిగా ఉచితం కాదు. గడువు తర్వాత మీరు మీ ఐటీఆర్‌ను దాఖలు చేసినా లేదా సవరించినా, మీరు ఆలస్య దాఖలు చేసినందుకు రుసుము చెల్లించాల్సి రావచ్చు. మీ ఆదాయం ఆధారంగా జరిమానా మొత్తం నిర్ణయిస్తారు. మీ మొత్తం వార్షిక ఆదాయం రూ. 5 లక్షల వరకు ఉంటే జరిమానా తక్కువగా ఉంటుంది. అయితే, మీ ఆదాయం ఎక్కువగా ఉంటే మీరు ఎక్కువ జరిమానా చెల్లించాల్సి రావచ్చు.




ఇంకా, మీకు ఏదైనా పన్ను బకాయి ఉంటే ఆ బకాయి పన్నుపై వడ్డీ విధిస్తారు.

వరు ఎక్కువ ప్రయోజనం పొందుతారు?

ఈ కొత్త నియమం వల్ల ప్రత్యక్ష ప్రయోజనం ఎక్కువగా జీతం పొందే వారికి దక్కుతుంది. తరచుగా జీతం పొందే వ్యక్తులు బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల నుండి వడ్డీ, స్టాక్ మార్కెట్ నుండి ఆదాయాలు లేదా ఫ్రీలాన్స్ పని వంటి బహుళ ఆదాయ వనరులను కలిగి ఉంటారు. రిటర్న్‌లను దాఖలు చేసేటప్పుడు ఈ చిన్న వివరాలు తరచుగా తప్పిపోతాయి.అదనంగా ఈ వ్యవస్థ మొదటిసారి పన్నులు దాఖలు చేసే యువతకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. తరచుగా సమాచారం లేకపోవడం వల్ల, వారు తప్పు ఫారమ్‌ను ఎంచుకుంటారు లేదా తప్పు డేటాను నమోదు చేస్తారు. నోటీసు భయంతో వారి తప్పును అంగీకరించి సవరించిన రిటర్న్‌ను దాఖలు చేయడం మంచిది.

# ప్రజావాణి రద్దు

## కలెక్టర్ ప్రతీక్ జైన్



**వికారాబాద్, ఫిబ్రవరి 1(నినాదం):** సాధారణ మున్సిపల్ ఎన్నికలు 2026 నేపథ్యంలో ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమం తిరిగి నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు, దరఖాస్తుదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## మాచిరాజు మైండ్ కేర్ క్లినిక్‌ను ప్రారంభించిన కార్పొరేటర్



**అల్వాల్, ఫిబ్రవరి 1(నినాదం):** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ సిటిజన్ కాలనీ రోడ్ నెంబర్ 7 లో మాచిరాజు మైండ్ కేర్ క్లినిక్ ను స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ మరియు అపోలో ఆసుపత్రి హెచ్.ఓ.డి.డాక్టర్ అశోక్ ముఖ్య అతిథులుగా హాజరై క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ అనుదీప్ సుబ్బారావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్ క్లినిక్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ మాచిరాజు అనుదీప్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఆందోళన, ఒత్తిడి, డిప్రెషన్, కుటుంబ సమస్యలు ఉంటాయని వాటి నుండి ఉపశమనం పొందడానికి మా క్లినిక్ లో కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు. మా యొక్క మైండ్ కేర్ లో సైకియాట్రిక్ కన్సల్టేషన్, వ్యక్తిగత కౌన్సిలింగ్, దంపతుల, కుటుంబ కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అభిరామ్,జోగిరాజు,శ్రీనివాస్, రవీంద్ర మరియు స్థానిక నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి,సుభాష్ గౌడ్,వెంకటేష్, ప్రకాష్,వెంకటేష్ గౌడ్,భిక్షపతి రెడ్డి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామిజాతర వేడుకల్లో పాల్గొన్న కొలను హనుమంత రెడ్డి






**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 1 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ డివిజన్ లో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ జాతర ఉత్సవాకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంతరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతల చల్లని చూపుతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలు, ఆరోగ్యం, సమృద్ధిగా పొందాలని వేడుకున్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రజల్లో ఐక్యత, శాంతిని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ స్మైల్ ద్వారా 151 మంది చిన్నారుల రక్షణ

## ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్



**వికారాబాద్, ఫిబ్రవరి 1(నినాదం):** చిన్నారుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మొత్తం 151 మంది చిన్నారులను రక్షించినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ తెలిపారు. రక్షించబడిన వారిలో 130 మంది బాలురు, 21 మంది బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా బాలకార్మికులుగా మగ్గుతున్న 104 మందిని, బడి మానేసిన డ్రాపౌట్స్ 45 మందిని, అదేవిధంగా భిక్షాటన చేస్తున్న ఇద్దరు బాలికలను సురక్షితంగా ఆపరేషన్ స్మైల్ టీం రక్షించారు. వీరిలో తెలంగాణేతర రాష్ట్రాలైన బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్ మరియు అస్సాం రాష్ట్రాలకు చెందిన 26 మంది చిన్నారులు కూడా ఉన్నారని ఎస్పీ వివరించారు. జిల్లాలోని మూడు సబ్ డివిజన్ల వారీగా రక్షణ చర్యలను వివరిస్తూ పరిగి సబ్ డివిజన్‌లో అత్యధికంగా 59 మందిని, వికారాబాద్ సబ్ డివిజన్‌లో 46 మందిని తాండూర్ సబ్ డివిజన్‌లో 46 మంది చిన్నారులను రక్షించినట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి చిన్నారులతో పని చేయిస్తున్న యజమానులపై జిల్లా వ్యాప్తంగా మొత్తం 32 ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. రక్షించబడిన వారిలో 130 మంది పిల్లలను వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించామని, సరైన సంరక్షణ లేని 21 మంది బాలురను చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్స్ సీ సీ ఐ కు తరలించినట్లు పేర్కొన్నారు. పిల్లలు బడిలో ఉండాలని పనిలో కాదని అన్నారు. బాల్యానికి అండగా నిలవడమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నారుల హక్కులను కాపాడటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీకోరారు. పోలీస్, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ డబ్ల్యూ సీ డి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సీ డబ్ల్యూ సీ లేబర్, హెల్త్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్లతో పాటు సాధన అంకిత స్వచ్ఛంద సంస్థల ఎన్ జీవోస్ చైల్డ్ లైన్ అధికారులు పాల్గొన్నారని ఆమె తెలిపారు. ఈ బృందాలలో అంకితభావంతో పనిచేసిన అధికారులను సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి

## మూడు యూనియన్ల సమ్మేళనంతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 1 (నినాదం):** కుత్బుల్లాపూర్‌లో నెలకొన్న పరిస్థితులను చక్కదిదడానికి, కుత్బుల్లాపూర్ జర్నలిస్టుల సంక్షేమానికి యూనియన్లకు అతీతంగా త్వరలోనే సమావేశం నిర్వహించాలని మూడు యూనియన్ల సీనియర్ నాయకులు సమావేశం నిర్వహించారు. సూరారం లోని ప్రెస్ క్లబ్ నిర్వహణ, నిర్మాణం, బండల లావాదేవీలు తదితర అంశాలపై నెలకొన్న గందరగోళానికి పులిస్టాప్ పెట్టే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉన్నందున ఈ సమావేశంలో ప్రత్యేకంగా అత్యవసర సమావేశం చేపట్టారు. ఇందుకు మూడు సంఘాలకు చెందిన ప్రతినిధులతో ఓ కమిటీని వేశారు. ఈ కమిటీ ప్రెస్ క్లబ్, జర్నలిస్టుల సంక్షేమానికి ముడిపడి ఉన్న అన్ని లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి ప్రతి జర్నలిస్టుకు సమాధానం చెబుతుందని నిర్ణయించారు. ఈ కమిటీలో సీనియర్ పాత్రికేయులైన వార్తా జగదీశ్వర్ గుప్తా, ఆంధ్రజ్యోతి వెంకట్, సాక్షి రంగు వెంకట్ ఉన్నారు. వీరు త్వరలోనే దస్తగిరి తో మాట్లాడి అన్ని విషయాలను జనరల్ బాడీ సమావేశంలో వెల్లడిస్తారు. ఇది భవిష్యత్ కోసం తీసుకున్న నిర్ణయం. మీమీ అభిప్రాయాలను త్వరలోనే నిర్వహించే జనరల్ బాడీ సమావేశంలో తెలపాల్సిందిగా మనవి. వాట్సప్ గ్రూపులలో అనవసరమైన చర్చోప చర్చలు చేయడం ద్వారా సమాజానికి తప్పుడు సంకేతాలు ఇచ్చిన వాళ్ళం అవుతాము. ఇప్పటికే నాయకులలో, అధికారుల్లో మన పట్ల చులకన భావం ఏర్పడిందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత దిగజారుతుందని జర్నలిస్టుల విలువలను కాపాడుదాం. యూనియన్లకు అతీతంగా నిర్వహించే సమావేశం వివరాలు త్వరలో తెలియజేస్తామని ప్రెస్ క్లబ్ అడాహాక్ కమిటీ పత్రికా ప్రకటనలో వివరించారు.

# వైభవంగా మల్లన్న కళ్యాణ మహోత్సవం





## పాల్గొన్న మల్కాజిగిరి ఎమ్మెల్యే, కార్పొరేటర్

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 1 (నినాదం):** గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్ మల్లన్న దేవాలయంలో ఆదివారం మల్కాజిగిరి శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ లు, స్వామి వారి కళ్యాణ మహోత్సవం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించారు ఒగ్గు కథలు గొలుసు తెంపుట వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భారీగా అన్నదాన కార్యక్రమంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, మురిగేష్, అనిల్ కుమార్, చిన్న యాదవ్, నాయకులు, కార్యకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ స్క్రినింగ్‌ను వీక్షించిన బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు




**మల్కాజిగిరి, ఫిబ్రవరి 1(నినాదం):** పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ స్క్రీనింగ్ సందర్భంగా ఆదివారం నేరేడ్ డివిజన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, నియోజకవర్గ నాయకులతో కలిసి కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి బడ్జెట్ ను వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, సుధాకర్, గోపాల్, జగదీశ్, నవీన్, శ్రీకాంత్ యాదవ్, శివ, కృష్ణ మోహన్, అకారం సాయి పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమ నాయకులను ఏం చేయలేరు



**అల్వాల్, ఫిబ్రవరి 1 (నినాదం):** సిట్ విచారణలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కు శాంతియుతంగా స్వాగతం తెలిపేందుకు వెళ్తున్న మల్కాజ్‌గిరి శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డిని అల్వాల్ మీ సేవా కేంద్రం వద్ద అల్వాల్ పోలీసులు అడ్డుకోవడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శాంతియుత పద్ధతిలో మహానేత కేసీఆర్ గారికి స్వాగతం తెలిపేందుకు వెళ్తుండగా పోలీసుల అడ్డంకులు విధించడం బాధాకరమని, ఇది రాష్ట్రంలో కొనసాగుతున్న నిరంకుశ పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేని కాంగ్రెస్ ప్రభుత్వం విచారణల పేరుతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వేధించడం సిగ్గుచేటని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ గారికి మద్దతుగా వందలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు స్వాగతం తెలిపేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర నిరాశతో వెనుదిరగాల్సి వచ్చిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుని హక్కు అని, ఆ హక్కును హరించే విధంగా ప్రభుత్వం పోలీసులను ఉపయోగించుకోవడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ప్రభుత్వ వ్యవహార తీరు, పోలీసుల ప్రవర్తనపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోందని, ఇలాంటి అణచివేత చర్యలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ భయపడదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దహనం



**కాప్రా, ఫిబ్రవరి 1 (నినాదం)** : 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుపై అంబటి రాంబాబు చేసిన అనుచితమైన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తు కాప్రా సర్కిల్ ఏ ఎస్ రావు నగర్ డివిజన్ రాధిక చౌరస్తాలో దిష్టిబొమ్మని తగలబెట్టడం జరిగినది. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు టీజీకే మూర్తి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ సూర్ణం రాజేష్, కాంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీరాములు, ముదిగొండ పాండు, నాగ బైరవ సాంబశివరావు, శ్రీనివాస్ దేవినేని, బొప్పన రాంమోహన్ రావు, పసల ప్రసాద్, విజయ్, ముప్ప శ్రీనివాస్, ప్రసాద్, బ్రహం చౌదరి, బిక్షపతి గౌడ్, సతీష్ యాదవ్, శ్రీశైలం, ఎల్ కృష్ణ, ఎన్ కృష్ణారావు, చౌదరి శ్రీను, రంగారావు పాల్గొన్నారు.

# మచ్చబొల్లారం హిందూ స్మశానవాటికను పరిరక్షించండి

## ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశాలపై గందరగోళం

## పెద్దఎత్తున ఆందోళనకు జేఏసీ హెచ్చరిక




**అల్వాల్, ఫిబ్రవరి 1 (నినాదం):** మచ్చబొల్లారం పరిధిలోని సర్వే నం.199లో ఉన్న హిందూ శ్మశానవాటికకు సంబంధించిన అంశంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ ఎన్ హెచ్ ఆర్ సి స్పష్టమైన ఆదేశాలు బుధవారం జిల్లా కలెక్టర్ మరియు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు జారీ చేసినట్లు మచ్చబొల్లారం శ్మశానవాటిక రక్షణ జేఏసీ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివారం మచ్చబొల్లారం శ్మశానవాటిక వద్ద జేఏసీ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఒకవైపు "మాకు ఎలాంటి ఆదేశాలు అందలేదని" చెబుతూనే, మరోవైపు శుక్రవారం "చెత్తను వేరే ప్రాంతాలకు మళ్లించాం" అని చెప్పడం ద్వారా పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయడంతో స్థానిక ప్రజల్లో తీవ్ర గందరగోళం నెలకొందని జేఏసీ సభ్యులు ఆరోపించారు. ఎన్ హెచ్ ఆర్ సి ఆదేశాలు జిల్లా కలెక్టర్ మరియు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఈమెయిల్ ద్వారా బుధవారమే పంపబడినట్లు తెలిపారు. గురువారం జాయింట్ యాక్షన్ కమిటీ తరపున ఎన్ హెచ్ ఆర్ సి ఆదేశాల కాపీతో పాటు వాటిని అమలు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గారికి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కు లిఖితపూర్వక వినతిపత్రం అందజేశామని చెప్పారు. శుక్రవారం ఉదయం డీసీకి ఆర్డర్ కాపీతో పాటు అమలు చేయాలనే లేఖ ఇవ్వడానికి వెళ్లిన సమయంలో, జోనల్ కమిషనర్ నుండి ఆదేశాలు అందాయని చెప్పి చెత్త తరలించే ఆటోలను వేరే ప్రాంతాలకు మళ్లిస్తున్న విషయాన్ని డీసీ వెల్లడించారని తెలిపారు. ఈ సందర్భంగా డీసీకి కృతజ్ఞతలు తెలుపుతూ ఆర్డర్ కాపీతో కూడిన వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. అయితే, అనంతరం కొన్ని వార్తాపత్రికలకు డీసీ "తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని" చెప్పడం పట్ల జేఏసీ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ హెచ్ ఆర్ సి ఎన్ హెచ్ ఆర్ సి ఆదేశాల కాపీతో వినతిపత్రం అందజేస్తున్న ఫోటోలు సైతం ప్రచురితమైనప్పటికీ, అధికారులు ఆదేశాలు అందలేదని మీడియాకు చెప్పడం సరికాదని విమర్శించారు. కొన్ని పత్రికల్లో "మచ్చబొల్లారం కేంద్రాన్ని యథావిధిగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు" అనే కథనాలు రావడంతో, శనివారం ఉదయం సాయి రెడ్డి కాలనీలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న డీసీని స్థానికులు నిలదీశారని తెలిపారు. ఎన్ హెచ్ ఆర్ సి ఆదేశాల్లో స్పష్టంగా "శ్మశానవాటిక మరియు దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్త వేయరాదు, చెత్తను ట్రాన్స్ఫర్ చేయరాదు" అని పేర్కొనబడినప్పటికీ, డీసీ మీడియాతో మాట్లాడుతూ "సమాధులు మరియు సమాధుల చుట్టూ మాత్రమే చెత్త వేయరాదు" అంటూ వక్రభాష్యాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేశారని జేఏసీ ఆరోపించింది. ఈ వ్యవహారంలో స్పష్టత రాకపోతే, ఎన్ హెచ్ ఆర్ సి ఆదేశాలను పూర్తిగా అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్థానిక ప్రజలు హెచ్చరించారు.

## వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా

# పోలీస్ యాక్ట్ అమలు

## ఎస్పీ స్నేహ మెహ్రా ఐపిఎస్

**వికారాబాద్, ఫిబ్రవరి 1(నినాదం):** వికారాబాద్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, ఈ నెల ఫిబ్రవరి 1 నుండి 28 వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ ప్రకటించారు. ప్రజా జీవనానికి ఎటువంటి ఆటంకం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ చట్టం అమల్లో ఉన్న సమయంలో జిల్లా పరిధిలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ధర్నాలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు లేదా ప్రజలు గుంపులుగా చేరే కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. పండుగలు లేదా రాజకీయ సభల పేరుతో నిర్వహించే ఏ కార్యక్రమమైనా కూడా నిర్వాహకులు కనీసం వారం రోజుల ముందుగా సంబంధిత పోలీసు అధికారులకు దరఖాస్తు చేసుకుని లిఖితపూర్వక అనుమతి పొందాలని సూచించారు. అనుమతి పొందిన వారు కూడా నిర్దేశించిన నిబంధనలను అతిక్రమించకూడదని, ధ్వని కాలుష్యం కలిగించేలా లౌడ్ స్పీకర్లను పరిమితికి మించి వాడకూడదని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా ప్రవర్తించినా, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రహదారులను దిగ్బంధించినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ ట్విట్టర్ వంటి వాటిలో తప్పుడు ప్రచారాలు చేసే వారిపై పోలీసు నిఘా ఉంటుందని, వారి పైన చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. కుల, మతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా పోస్టులు పెట్టినా లేదా రెచ్చగొట్టే వ్యాఖ్యలను షేర్ చేసినా ఐటీ యాక్ట్ మరియు 30 పోలీస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందిఅని, జిల్లా ప్రజలందరూ పోలీసు యంత్రాంగానికి సహకరించాలని, చట్టాన్ని గౌరవించి శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని ఎస్పీ తెలియజేశారు.

## ఘనంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడి జన్మదిన వేడుకలు



**అల్వాల్, ఫిబ్రవరి1(నినాదం):** శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ అధ్యక్షులు మరియు ఆల్వాల్ కాంగ్రెస్ సర్కిల్ సీనియర్ నాయకులు బి నాగేశ్వరరావు జన్మదిన సందర్భంగా మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్ర డైనమిక్ లీడర్ మైనంపల్లి హనుమంతరావు శాలువతో సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్ ఆర్ కె ప్రసాద్, అల్వాల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నల్ల బలవంత రెడ్డి, నారాయణ శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి, సతీష్ పాల్గొన్నారు

# అక్రమ కేసులు ఎత్తివేయాలి



**వికారాబాద్, ఫిబ్రవరి 1(నినాదం):** బిఆర్ఎస్ అధినేత ఉద్యమదాత కేసీఆర్ పై తదితరులపై ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసి రాష్ట్రన్ని అప్రదిష్ట పాలుచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వమని నినదిస్తూ ఆదివారం జిల్లా వ్యాప్తంగా బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో రోడ్లపై బైఠాయించి నిరసనలు తెలిపారు. ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. రాష్ట్రాన్ని సాధించి పెట్టి అన్ని విదాలుగా అభివృద్ధి పథంలో నడిపిన కే సీ ఆర్ పై అక్రమ కేసులు బాణాయించి హామీలను తుంగలో తొక్కుతున్నారిని అన్నారు. ప్రజల దృష్టి మళ్లించే చర్యలు చేస్తూ రాష్ట్రాన్ని అదొగతి పాలుచేస్తున్నారని పలువురు నాయకులు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకోసం ఆహర్నిశలు సమాలోచనలు చేసిన చోటే అధినేతను విచారణ చేసే స్థలం కావడం దురదృష్ట కరమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పోలీసులు సమన్వయం వ్యవహరించి నిరసన కారులను అదుపులోకి తీసుకుని నిలువరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రంలో బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, తాండూర్ లో మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ఆయా స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు నోటీసులు





## నిరసన తెలిపిన బిఆర్ఎస్ నాయకులు

## పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 1(నినాదం):** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో ఫోన్ టాపింగ్ వ్యవహారంలో సిట్ (ఎస్ఐటి) నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం మల్కాజిగిరి నియోజకవర్గంలోని నేరేడ్‌మెట్ చౌరస్తా వద్ద మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నాయకత్వం వహించగా, బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, రాజకీయ వేధింపుల విధానాలను తీవ్రంగా ఖండిస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్పొరేటర్లు చింతల శాంతి, మేకల సునీత రామ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మురుగేష్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు జీకే హనుమంతరావు, రావుల అంజయ్య, అమీన్‌ఉద్దీన్, చిన్న యాదవ్, రాము యాదవ్, అనిల్ కిషోర్ గౌడ్, అరుణ్ రావు, రేగటి శివ కుమార్ గౌడ్, జె కె సాయి గౌడ్, సుమన్ గౌడ్, పెద్ద ఎత్తున మహిళలు, యువత, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మల్లన్న దీవెనలు తీసుకున్న కార్పొరేటర్



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 1 (నినాదం):** శ్రీ కృష్ణ యాదవ్ సంఘం వారు నిర్వహించిన మల్లన కల్యాణం, బోనాల జాతర సందర్భముగా ఆదివారం గౌతమ్ నగర్ డివిజన్ మలికార్జున నగర్ లోని మల్లన దేవాలయంను వినాయక నగర్ డివిజన్ కార్పొరేటర్ సందర్శించి, మల్లన దీవెనలను తీసుకున్నారు. ఈ కార్యక్రమములో యాదవ సోదరి, సోదరీమణులు, నాయకులు సునీల్ యాదవ్, చారి, గణేష్, మంజుల పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్..

**కారు దిగి చెయ్యి అందుకున్న నేతలు..**

**కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ప్రణవ్**



**జమ్మికుంట, ఫిబ్రవరి 1(నినాదం) :** మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతుంది. దీనికోసం అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటుంది. దాంట్లో భాగంగా జమ్మికుంట పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పొనగంటి మధు,అతని 100 మంది అనుచరులతో బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్. గడిచిన రెండు ఏళ్లలో బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో ఆదరణ లేదని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా ఇదే జరుగుతుందని నమ్మి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మెట్‌పల్లి మున్సిపాల్టీలో నామినేషన్లు చెల్లుబాటు



**26 వార్డులకు 289 నామినేషన్లకు ఆమోదం**

**మెట్‌పల్లి, జనవరి 31 (నినాదం):** మెట్‌పల్లి మున్సిపాల్టీలో జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో 26 వార్డులకు సంబంధించి దాఖలైన నామినేషన్లను రిటర్నింగ్ అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలనలో మొత్తం 289 నామినేషన్లు నిబంధనలకు అనుగుణంగా ఉన్నట్లు నిర్ధారించి, అన్నింటినీ చెల్లుబాటు అయినవిగా ప్రకటించారు. పార్టీల వారీగా నామినేషన్లను పరిశీలిస్తే కాంగ్రెస్ పార్టీ అత్య ధికంగా 104 నామినేషన్లు దాఖలు చేసింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చెరో 56 నామినేషన్లతో బరిలో నిలిచాయి. ఏఐఎంఐఎం పార్టీ నుంచి 8 నామినేషన్లు దాఖలయ్యాయి. జనసేన పార్టీ 14 నామినేషన్లు సమర్పించింది. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి 2 నామినేషన్లు ఉన్నాయి..ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘంలో నమోదు అయిన ఇతర రాజకీయ పార్టీల నుంచి 10 నామినేషన్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థులుగా 33 మంది నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా అన్ని నామినేషన్లు ఆమోదం పొందడంతో మెట్‌పల్లి మున్సిపల్ ఎన్నికలు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి. అన్ని పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొననున్నట్లు కనిపిస్తోంది.

# సీతారామ లక్ష్మణ వేషధారణలో గిరి ప్రదర్శన



**జమ్మికుంట, ఫిబ్రవరి 1 (నినాదం) :** కొండగట్టు ఆంజనేయస్వామి 37వ పౌర్ణమి గిరి ప్రదర్శన లో చిరుతల రామాయణ తెలంగాణ రాష్ట్రకళాకారుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పదాల సత్యనారా యణ గౌడ్ పంతులు ఆధ్వర్యంలో సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి వేషధారణలతో గిరి ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ రాష్ట్ర కళాకారుల వేదిక జమ్మికుంట మండల అధ్యక్షుడు గౌరవ డాక్టర్ వేముల అశోక్ , కనపర్తి కళాకారుడు ముత్యాల హుస్సేన్, నాయి బ్రాహ్మణ దొంగల రాజయ్య , జనగాని శ్రీనివాస్ గౌడ్ , రంగమ్మపల్లి కళాకారులు నీల మహేందర్ నిమ్మల శంకర్ పాల్గొన్నారు.

## ప్రఫుల్ దేశాయ్ జన్మదిన వేడుకలు

# నిర్వహించిన టీఎన్జీవో జిల్లా శాఖ



**కరీంనగర్, ఫిబ్రవరి 1(నినాదం) :** మున్సిపల్ నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ జన్మదినం సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో టీఎన్జీవోల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల ప్రతినిధులు కమిషనర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, వెంకటేశ్వర స్వామి కండువా, శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ప్రజలు ప్రభుత్వ ఉద్యోగుల మధ్య సమన్వయ వారధిగా నిలుస్తూ, నగర అభివృద్ధికి వినూత్న నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్న కమిషనర్ నాయకత్వం అభినందనీయమని తెలిపారు. కరీంనగర్ నగరాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్లడంలో ఆయన చేస్తున్న కృషి స్లాఘనీయమని, ఇలాంటి సేవలు మరింత కాలం కొనసాగించాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టిఎన్జీవోలు ముద్రించిన డైరీ 2026 ను వారికి అందించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో మీరు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. స్వామి ఆశీస్సులు మీపై ఎల్లప్పుడూ ఉండాలని, అలాగే మీ ఆశీస్సులు మాపై ఉండాలని ఆకాంక్షిస్తున్నాం అని తెలిపారు. అలాగే నగరపాలక సంస్థ అభివృద్ధి కోసం అహర్నిశలు, అనుక్షణం విశేష కృషి చేస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఐఏఎస్ సేవలు ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి జిల్లా కార్యదర్శి సంఘము లక్ష్మణరావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, సర్దార్ హర్విందర్ సింగ్, గూడ ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి రాగి శ్రీనివాస్, ఏవీ రాజేశ్వరరావు, కర్ణాకర్, నారాయణ, పూర్ణచందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాకర్స్‌తో ముఖాముఖి నిర్వహించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



**కరీంనగర్, ఫిబ్రవరి 1(నినాదం) :** రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, అభివృద్ధికి పట్టం కట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ఆదివారం రోజున ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్ ను కలిసి ముఖాముఖి నిర్వహించినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మున్సిపల్ కార్పొరేషన్ లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి గణనీయంగా పెరుగుతుండదని అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని గుర్తు చేశారు. 200 యూనిట్ల ఉచిత కరెంటు, సన్న బియ్యం, రైతులకు రైతుబంధు, ఇందిరమ్మ ఇళ్ళు, రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఇలాగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన పయనింప చేస్తున్నందుకు, కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలని అన్ని డివిజన్లో ఘన విజయం సాధించడానికి చేయూతనివ్వాలని పిలుపు నిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రజలకు అన్ని విధాలుగా తోడ్పాటునందిస్తున్నదని చెప్పారు. తెలంగాణలో అనేక పెట్టుబడులు తీసుకురావడం అదేవిధంగా విద్యార్థులకు చక్కటి విద్యతోపాటు వసతులు కల్పించడం హర్షించదగ్గ విషయమని ప్రధానంగా వ్యవసాయ రంగంలో ఇతర రాష్ట్రాలకు దీటుగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి సాధిస్తున్నది హార్షం వ్యక్తం చేశారు. అభ్యర్థిస్తూ మేఘన అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును, వినియోగించు కోవాలని ఈ సందర్భంగా వాకర్స్ ని కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విన్నవించారు. కరీంనగర్ లో కాంగ్రెస్ విజయం తథ్యమని తెలంగాణ రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలలో అఖండ విజయం నమోదు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో పలువురు కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, విఎన్ఆర్ ఫౌండేషన్ కార్యకర్తలు ఉన్నారు.

# అక్రమ సంపాదన కక్కిస్తాం..!

**కోరుట్ల, మెట్‌పల్లి పురపోరులో "కారు"కు అభ్యర్థుల కరువు..**

**అపోహలు సృష్టిస్తే కోరుట్ల**

**ఎమ్మెల్యే సంజయ్ అక్రమాస్తులు బయటకు తీస్తాం**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల, ఫిబ్రవరి 1(నినాదం) :** సుద్దపూస మాటలు చెబుతూ ప్రజల మధ్య విబేధాలు సృష్టిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల కుటుంబం అభివృద్ధి పేర.. మీ అయ్య అవినీతి, అక్రమ సంపాదనను బయటకు కక్కిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు హెచ్చరించారు. కోరుట్ల పట్టణశీలోని జువ్వాడి భవన్ లో ఆదివారం విలేక రుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గం లో ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉంటే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల మధ్య అపోహాలు సృష్టించి ఎన్నికల్లో లబ్ది కోసం శాంతిభద్రతల సమస్యను తలెత్తెలా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ దుర్మార్గపు ఆలోచనలు చేస్తే మున్సి" పోల్స్"లో "కారు"ను కనుమరుగు చేస్తారని ఆయన హెచ్చరిం చారు. ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో ఇలాగే చేస్తే బిఆర్ఎస్ కు గుణపాఠం చెప్పిన తరహాలో మున్సిపల్ ఎన్నికల్లో పునరావృతం అవుతుందన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కోరుట్ల మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 మంది కౌన్సిలర్లు గెలిస్తే టిఆర్ఎస్ పార్టీ నుండి ఎనిమిది మంది కౌన్సిలర్లు గెలిచినప్పుడు మీ అయ్య కల్వకుంట్ల విద్యాసాగర్ రావు రౌడీయిజంతో దుర్మార్గంగా కోరశీ లేదనే సాకుతో ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లను అక్రమం గా టిఆర్ఎస్ పార్టీ వ్యక్తిని చైర్ పర్సన్ ప్రకటిం చుకున్న చరిత్ర మరిచారా? గత జడ్పిటిసి ఎన్నిక ల్లో కోరుట్ల జెడ్పిటిసి అభ్యర్థిగా కాంగ్రెస్ నుండి పోటీ చేసిన వ్యక్తిని నామినేషన్ వేయకుండా బెదిరించి గుండా రాజకీయానికి తెరతీసిన చరిత్ర మీది నేడు మీదుర్మార్గాలు సాగవని ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఈ ఎన్నికల్లో మీకు డిపాజిట్లు కూడా దక్కమని పోటీ చేసే అభ్యర్థులు మీకు కరువయ్యారని అందుకే ఇలాంటి దుర్మార్గాపు ఆలోచన చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్ పై జువ్వాడి కృష్ణారావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కోరుట్ల ఎమ్మెల్యేగా మీ తండ్రి ఉన్నప్పుడు ఎకీన్ పూర్ లో నిర్మించిన బ్రిడ్జి మీ అవినీతి దాహానికి నిర్మాణ దశలోనే పిల్లర్ కుంగి పోయిందని గుర్తు చేశారు. ప్రజాధనం దుర్వినియోగం చేశారని కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల, మెట్ పల్లి మున్సిపల్ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కోరారు. అధికార పార్టీ ప్రభుత్వానికి అండగా ఉంటే రానున్న రోజుల్లో మున్సిపాలిటీలన్నీ అభివృద్ధి చెందుతాయని, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల అంజిరెడ్డి, కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, కోరుట్ల నియోజక వర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్, కోరుట్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇంద్రాల హరీష్, కోరుట్ల మార్కెట్ కమిటీ డైరెక్టర్ అయ్యూబ్, మాజీ జెడ్పిటిసి సభ్యులు తోట గంగాధర్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ చైర్మన్ ఎతిరాజం నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్యాల లక్ష్మినారాయణ, మరిపెల్లి జనార్ధన్, తెడ్డు విజయ్ సుమన్, అయిండ్ల గణేష్, గుర్రాల ప్రవీణ్, సోగ్రాభి, ఏఆర్ అక్బర్, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజకీయ కక్షతోనే కేసీఆర్‌కు సిట్ నోటీసులు

**ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నేతృత్వంలో భారీ ర్యాలీ!**



**జమ్మికుంట, ఫిబ్రవరి1 (నినాదం) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, తెలంగాణ బాపూజీగా ప్రజల గుండెల్లో నిలిచిన కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపడాన్ని నిరసిస్తూ హుజురాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సమక్షంలో ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. హుజురాబాద్ పట్టణ సమీపంలోని సిరసపల్లి క్రాస్ రోడ్ నుంచి శాలపల్లి ఇందిరానగర్ వరకు కొనసాగింది. రంగాపూర్, గొల్లపల్లి, రాజపల్లి, చెల్పూర్ గ్రామాల మీదుగా సాగిన ఈ ర్యాలీ అంతా జై తెలంగాణ జై కెసిఆర్ సీఎం డౌన్ డౌన్ నినాదాలతో మారుమోగింది. అనంతరం తిరిగి సిరసపల్లి క్రాస్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో దాదాపు 2000 బైకులు పాల్గొనగా, సుమారు 4000 మంది కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన కేసీఆర్‌కు సిట్ నోటీసులు పంపడం హేయమైన, రాజకీయ కక్షతో చేసిన చర్యగా తీవ్రంగా ఖండించారు. కేసీఆర్‌పై ఎలాంటి అక్రమాలు లేవని, ప్రజలే ఆయనకు అండగా నిలుస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణం ఎన్నికల ఇంచార్జ్ భూపతి రెడ్డి జమ్మికుంట పట్టణం ఇంచార్జ్ సుదీర్ జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు మహమ్మద్ జానీ పాతకాల రమేష్ బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీ పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష మల్లె తులసార్చన



**జమ్మికుంట, ఫిబ్రవరి 1 (నినాదం) :** జమ్మికుంట పట్టణంలోని వెంకటాద్రి నగర్ లో ప్రతిష్ట చేసిన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారికి లక్ష్య మల్లె తులసా ర్చనను నిర్వహించారు. జమ్మికుంట పట్టణం లోని వెంకటాద్రి నగర్ లో ప్రతిష్ఠింపజేసిన వెంకటేశ్వర స్వామి అష్టాదశ బ్రహ్మోత్సవాలలో భాగంగా పద్మావతి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ వేద పండితులు హరికృష్ణ ఆచార్యులు వేణుగోపాల ఆచార్యుల ఆధ్వర్యంలో లక్ష్యమల్లె తులసి అర్చన వేద మంత్రాలు మధ్య అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. అనంతరం స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలం కరించి రథో త్సంపై అధిరోహింపజేసి ఊరేగింపు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు మక్కా జితేందర్ గుప్తా ,రావికంటి రాజేంద్రప్రసాద్, ప్రభాకర్ రావు, పుల్లూరి శ్రీనివాస్, ఎద్దులాపురం వెంకటేశ్వర్లు సమ్మయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం



**జమ్మికుంట, ఫిబ్రవరి 1 (నినాదం) :** జమ్మికుంట పట్టణా నికి చెందిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దబ్బెట రవీందర్, తెలంగాణ రాష్ట్ర బిసి ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర కార్యదర్శి కాసుల కిరణ్ కుమార్ కు తెలుగు వెలుగు సాహితీ వేదిక, తెలుగు ఇండియన్ కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు వెలుగు సాహితీ వేదిక స్వామి వివేకానంద నేతాజీసుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు జాతీయ పురస్కార సన్మాన పత్రం తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం అందుకున్నారు. దబ్బెట రవీందర్, కిరణ్ కుమార్ తోపాటు ముదురకోలరాజు , కురిమిండ్ల అశోక్ ,ధర్ముల శంకర్ ,ఆకారపు రమేష్, చేస్తున్న సామాజిక సేవా ప్రజాసేవ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి వీరికి తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారాన్ని మాజీ మంత్రి శాసనమండలి సభ్యులు బస్వ రాజు సారయ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాస్యనటులు ఆర్ఎస్ నంద చేతుల మీద పురస్కారంఅందుకున్నారు. తెలుగు వెలుగు నిర్వాహకులు పోలోజు రాజ్ కుమార్ ఆచార్య , డాక్టర్ పొడిచెట్టి విష్ణు వర్ధన్ చేతుల మీదుగా పురస్కారం ఇవ్వడం జరిగింది. ఈ పురస్కారం రావడం పట్ల పలు బీసీ సంఘాలు విశ్వకర్మ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

# కుల బంధమా..? కుసంస్కారమా..?

**కండువా లేకుండా కార్యకర్తల సమావేశం..**

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు**

**సోషల్ ట్రోల్ అవుతున్న ఎమ్మెల్సీ బల్మూరి**



**జగిత్యాల ప్రతినిధి ఫిబ్రవరి1 (నినాదం) :** ఫిరాయింపు ఎమ్మెల్యే వర్గానికి వత్తాసు పలికే క్రమంలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి పై నోరు జారిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శల పాలయ్యారు. నిజాంబాద్ పార్లమెంట్ సెగ్మెంట్లోని ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు బల్మూరి వెంకట్ పై సోషల్ మీడియా వేదికగా అనేక విమర్శలు గుప్పిస్తున్నారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పిరాయింపు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కార్యాలయంలో ఎమ్మెల్యే అనుచర వర్గంతో బల్మూరి వెంకట్ సమావేశమయ్యారు. ఫిరాయింపు ఎమ్మెల్యే వర్గంలో ఏ ఒక్క కార్యకర్తకు కండువా లేకపోగా ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ కూడా కండువా వేసుకోకుండా కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. న్యాయపరమైన చిక్కుల దృష్ట్యా కండువా వేసుకోలేదని సరిపెట్టుకున్న పిరాయింపు శిబిరం నుంచి మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ఉద్దేశిస్తూ సీనియర్ నాయకులైన పార్టీ లైన్ దాటితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే కాకుండా జీవన్ రెడ్డి అభిమానులు కూడా ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ పై సోషల్ మీడియా వేదికగా తీవ్రమైన ట్రోలింగ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బల్మూరు వెంకట్ ను నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ ఇన్చార్జిగా నియమించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి ని కలిసిన అనంతరం ఫిరాయింపు శిబిరంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలపై రెచ్చిపోయారు. కాంగ్రెస్ పార్టీకి సంబం ధించిన ఎమ్మెల్యేను కాదని ఆయన అనుచరులు కూడా కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేకుండా కలిసి పని చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకోవడానికి నా మూషిగా ఫీలయ్యే ఎమ్మెల్యే కార్యకర్తల మధ్య ఒక పిసిసి ఉపాధ్యక్షులు గా ఉన్న బల్మూరి వెంకట్ గరుడుగట్టిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రిని విమర్శించడం కాంగ్రెస్ పార్టీని అవమానించినట్లే అవుతుందని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరాయి పంచన చేరి కులపోడని కాంగ్రెస్ పార్టీ విధానాలను అవహేళన చేసిన బల్మూరి వెంకట్ కచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి క్షమాపణ చెప్పాలని సోషల్ మీడియా వేదికగా టోల్ చేస్తున్నారు. దూతగా వచ్చిన వెంకట్ ఇరువర్గాలను సమన్వయపరిచే విధంగా తన సంభాషణ ఉండాలని బాధ్యత మరిచి మరింత రెచ్చగొట్టిపోయారని కాంగ్రెస్ అభిమానులు చెప్తున్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ది ఒకే సామాజిక వర్గం కావడంతో జీవన్ రెడ్డి పై విమర్శలు చేశారని అపవాది మూట కట్టుకున్నారు. ఈ పరిణామాలన్నీ కాంగ్రెస్ పార్టీ ఉనికికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. జగిత్యాల నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలన్నీ ప్రజలు గమనిస్తున్నారు. ఓపిరాయింపు ఎమ్మెల్యే కోసం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టించాలనేది వాస్తవం. బీఫాముల విషయంలో తలెత్తిన వివాదం కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ ఆశావాకులకు తలనొప్పిగా మారింది. కుల మర్యాద ఉంటే నాలుగు గోళ్ళ మధ్యలో పెట్టుకోవాలి కానీ కార్యకర్తలు గాని కార్యకర్తల సమావేశంలో పాల్గొనడమే కాకుండా నిజమైన నాయకులను సీనియర్లను విమర్శించడం పట్ల బల్మూరి వెంకట్ పై తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి

# మున్సిపాలిటీల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం..

**ధనం ఉన్నోడికి కాదు గుణం ఉన్నోడికి ఓటెయ్యండి**

**మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ప్రణవ్ జోరు..**





**జమ్మికుంట, ఫిబ్రవరి 1 (నినాదం) :** హుజూరాబాద్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ దూసుకెళ్తుంది. ఓ వైపు కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తూ, పదేళ్లలో జరగనివి,రెండేళ్లలో జరిగిన పనులను ప్రజలకు వివరంగా తెలియజేస్తున్నారు. హుజూరాబాద్ పట్టణంలోని 3,4,18 వార్డులలో ఇంటి,ఇంటికి ఎన్నికల ప్రచారం చేశారు హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్. ప్రచారం చేసే సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఈ సారి పక్కగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపి స్తామని హామీ ఇస్తున్నారు. ప్రజలను నిండు మనసుతో ఆశీర్వదిస్తే మరింత బాధ్యతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ధనం ఉన్నోడికి కాదు గుణం ఉన్నోడికి ఓటేయండి**

మున్సిపల్ ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసి ఓట్లు దండుకోవాలని చూసేవారికి కాకుండా అభివృద్ధి చేసి అండగా నిలబడే మంచి గుణం ఉన్న వ్యక్తికి ఓటు వేసి గెలిపించాలని ప్రణవ్ సూచించారు. రాష్ట్రంలో అధికారంలో ఉంది కాంగ్రెస్ ప్రభుత్వమని వార్డులు మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలవాలని చెయ్యి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రణవ్ కోరారు.

**కార్యకర్తలే పార్టీకి కొండంతా అండ**

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని వారి అండదండలతోనే రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిందని హుజూరాబాద్ నియోజకవర్గం లో జరుగుతున్న పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని ప్రజలు ఆలోచించి తమ అమూల్యమైన ఓటును చెయ్యి గుర్తుకు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. నాయకుడంటే ప్రజల గుండెల్లో ఉండాలని ప్రజలు చీదరించుకునే విధంగా ఉండకూడదని ఆయన అన్నారు.

# కేసీఆర్ మీద కక్ష సాధింపు ధోరణితోనే నోటీసులు

**తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చిన కేసీఆర్ కు నోటీసులు ఇవ్వడం అంటే తెలంగాణ ప్రజలకే నోటీసులు ఇచ్చినట్టు**

**మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**



**కరీంనగర్, ఫిబ్రవరి 1(నినాదం) :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కు సిట్ నోటీసులు పంపిన నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర పిలుపు మేరకు బిఆర్ఎస్ పార్టీ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాఎమ్మెల్యే గంగుల కమలాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా,బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలసి రాస్తారోకో . నిరసన వ్యక్తం చేస్తూ, నోటీసులు పంపడాన్ని తీవ్రంగా ఖండిం చారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగు సీరియల్ లాగా రోజుకో నోటీసులు, రోజు కొకరికీ చొప్పున పంపిస్తూ, కాలం వెలదీస్తూ పాలనను మర్చిపోయారని మండిపడ్డారు. డైవర్షన్ పాలిటిక్స్ చేయడం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అలవాటుగా మారిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కి రాష్ట్ర మంత్రులకు ఫోన్ టాపింగ్ ల తో సంబంధం ఉండదని కేవలం రాష్ట్ర ప్రజల దృష్ట్యా. ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు శాఖ సంబంధించిన అధికారులు మాత్రమే ఫోన్ టాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ టీంలో అప్పుడు ఇంటిలిజెన్స్ విభాగంలో పనిచేసిన అధికారులే ఉన్నారని మొదటగా వారికి నోటీసులు పంపాలని రేవంత్ రెడ్డికి సూచించారు. కెసిఆర్ మీద కక్ష సాధింపు ధోరణితోనే నోటీసులు పంపుతు న్నారన్నారు. టిఆర్ఎస్ పార్టీ ఉవ్వెత్తున ఎగిస్తుందని ఇంటిలిజెంట్ ద్వారా సమాచారం తెచ్చుకొని. నిర్వీర్యం చేయాలని ఉద్దేశంతోనే నోటీసులు, విచారణల రోజుకో కార్యక్రమం ప్రభుత్వం చేపడుతుందని మండిపడ్డారు. ప్రభుత్వాల అవినీతినీ ఎప్పటికప్పుడు బయటకు తీస్తామని. హెచ్చరించారు. దేశ ప్రధానే కెసిఆర్ ను ఏం చేయలేకపోయారని ఇక రేవంత్ రెడ్డి ఏం చేస్తారని విమర్శించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా చంద్రబాబు నాయుడును ఇలాగే ఇబ్బంది పెట్టాడని ప్రజలు జగన్మోహన్ రెడ్డికి ఎన్నికల్లో ఏవిధంగా తీర్పు ఇచ్చారో దారిని చూసైనా సిగ్గు తెచ్చుకోవాలని రేవంత్ రెడ్డికి సూచించారు. 3 ఏళ్ల తరువాత రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 9 సీట్లే వస్తాయని జోష్యం చెప్పారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆణిముత్యం బయటకు వస్తారన్నారు. ఒకసారి జూబ్లీహిల్స్ ఎన్నికల్లో, మరోసారి సర్పంచ్ ఎన్నికల్లో, ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల్లో.. ఇలా కేవలం ఎన్నికలప్పుడే నోటీసులు పంపడం. తద్వారా బిఆర్ఎస్ పార్టీ,నాయకులు అప్రమత్తంగా, ఉండకుండా చేస్తున్నారు. కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు ఎప్పుడైతే అవినీతిలో కూరుకు పోతాయో. అప్పుడే ఇలాంటి నోటీసులు విచారణల పేరిట ప్రజల దృష్టి మరల్చేందుకు నాటకానికి తెరదీస్తారు అన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బిఆర్ఎస్ పార్టీ నాగర శాఖ అధ్యక్షులు చల్లా హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నోటీసుల జారీతో రేవంత్ పతనం షురూ..

### ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఉద్యమ నేత కెసిఆర్

### కోదాడలో మాజీ ఎమ్మెల్యే బొల్లం నేతృత్వంలో ప్రధాన రహదారిపై భారీ బైక్ ర్యాలీ





**కోదాడ, ఫిబ్రవరి 1(నినాదం):** 14 సంవత్సరాలు అలుపెరగని పోరాటం చేసి అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి నోటీసులు జారీ చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి పతనం షురూ అయిందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు... ఆదివారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు నోటీలు జారీచేయడం నిరసిస్తూ ప్రధాన ప్రధాన రహదారిపై వందలాదిమంది బిఆర్ఎస్ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ నల్ల జెండాలతో జై తెలంగాణ జై కేసీఆర్ సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.. కొద్దిసేపు గాంధీ విగ్రహం ఎదుట మూతికి నల్ల వస్త్రాలు ధరించి నిరసన తెలిపారు అనంతరం బస్టాండ్ ఎదుట సీఎం రేవంత్ రెడ్డి చౌక్కా దగ్ధం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన చేతకాని దద్దమ్మ ప్రభుత్వం నడుస్తుందని విమర్శించారు.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజలను మభ్య పెట్టేందుకే ఈ నోటీసుల జారీ అన్నారు... అవినీతిలో కూరుకుపోయి కుంభకోణాలతో మంత్రులతో సహా ఎవరికి వారు కోట్లాది రూపాయల కమిషన్లు దండుకుంటూ పాలనను గాలికి వదిలేసారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.. కడిగిన ముత్యంలా కేసీఆర్ సిట్కు సమాధానం ఇచ్చి తిరిగి వస్తారని స్పష్టం చేశారు.. రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో నెంబర్ వన్ గా నిలిపితే రేవంత్ రెడ్డి అదో పాతాళానికి తీసుకువెళ్లాడని విమర్శించారు.. యావత్ తెలంగాణ ప్రజల గుండెల్లో ఉద్యమనేత కేసిఆర్ చిరస్థాయిగా ఉన్నారని.. కెసిఆర్‌ను తిరిగి ముఖ్య మంత్రిగా చూడాలన్నదే ప్రజల ఆకాంక్ష అన్నారు.. కెసిఆర్ పై నిందలు మోపటం సూర్యుడు పై ఉమ్మి వేయటమేనని పేర్కొన్నారు.. కక్ష సాధింపు చర్యలతో కేసీఆర్ను బదనాం చేయటం ఎవరి వల్ల కాదన్నారు.. కాగా చిలుకూరు అనంతగిరి మునగాల మోతే కోదాడ నడిగూడెం మండల కేంద్రాలలో టిఆర్ఎస్ శ్రేణులు నల్లజెండాలతో నిరసన తెలిపారు. ఈ ర్యాలీలో పట్టణ అధ్యక్షుడు నయీమ్ భూపాల్ రెడ్డి బట్టు శివాజీ కర్ల సుందర్ బాబు భాగ్యమ్మ లలిత మామిడి రామారావు కరీం కవిత శెట్టి సురేష్ అలవాల వెంకట్ వందలాదిమంది బిఆర్ఎస్ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సిపిఐ పార్టీ మద్దతు



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 1 (నినాదం):** మిర్యాలగూడ నియోజకవర్గ సమావేశం కామ్రేడ్ అంజన్న పిల్లి రామలింగం అధ్యక్షతన సమావేశం జరిగినది ఈ సమావేశానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో మున్సిపాలిటీ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో సిపిఐ పార్టీ మిర్యాలగూడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణమైనటువంటి మద్దతుని తెలియజేస్తుందని వారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నందున పేద ప్రజల. సంక్షేమం కొరకు పాటుపడుతుందని వారన్నారు అనేక సంక్షేమ పథకాలు ఇస్తున్నారు కనుక భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సంపూర్ణమైనటువంటి మద్దతును తెలియజేస్తుందని మిర్యాలగూడలో 48 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కొరకు సిపిఐ పార్టీ నాయకులు. కృషి చేయాలని వారు అన్నారు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వటం వలన సిపిఐ పార్టీకి కో ఆప్షన్ నెంబర్ ఇచ్చేందుకు ఎమ్మెల్యే గారు అంగీకరించారని వారన్నారు ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల్ల శ్రీనివాస్ మండల కార్యదర్శి లు జిల్లా యాదగిరి పోలేపల్లి ఉదయ్ కుమార్ మహిళా సమైక్య నాయకురాలు ఎర్రబోతు పద్మ ఎస్కే షమీం లింగంపల్లి సైదమ్మ జములకోటయ్య సీనియర్ నాయకులు గజ్జల లక్ష్మీ నరసింహా రెడ్డి కత్తుల బిక్షం పుట్టల నాగయ్య పేరుపొంగు లక్ష్మయ్య శుద్ధ బోయిన రాములు ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా యశ్వంత్ పేరుపాక సంతు తదితరులు పాల్గొన్నారు.

## భూక్యా యశ్వంత్ మరో సాహసం

### ఒడిశాలోని ఎత్తైన డియోమాలి పర్వతారోహణ

### పర్వతంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసిన తెలంగాణ గిరిజన బిడ్డ



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 01 (నినాదం):** తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యా తండాకు చెందిన భూక్య రామ్మూర్తి–జ్యోతి దంపతుల కుమారుడు భూక్యా యశ్వంత్ ఒడిశాలోని ఎత్తైన శిఖరం డియోమాలి పర్వతాన్ని (1,672 మీటర్లు) శనివారం విజయవంతంగా అధిరోహించి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి శభాష్ అనిపించుకున్నాడు. భారతదేశంలోని 28 రాష్ట్రాలలోని ఎత్తైన శిఖరాలను, ఏడు శిఖరాలను అధిరోహించాలనే తన లక్ష్యంతో మరో ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. భారతీయ యువతలో సాహస క్రీడలు, శారీరక దృఢత్వం మరియు మానసిక స్థితిస్థాపకతను ప్రోత్సహించే లక్ష్యంతో యశ్వంత్ దేశవ్యాప్తంగా ఎత్తైన పర్వతారోహణ ప్రచారంలో భాగంగా డియోమాలి యాత్ర జరిగింది. ఈ విజయంతో యశ్వంత్ ఇప్పుడు అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, అస్సాం, రాజస్థాన్ మరియు ఒడిశాలోని ఎత్తైన శిఖరాలను అధిరోహించారు. 28 స్టేట్స్ హై పాయింట్స్ ఛాలెంజ్‌ను పూర్తి చేసే దిశగా తన స్థిరమైన పురోగతిని కొనసాగిస్తున్నారు. యశ్వంత్ అనేక సవాలుతో కూడిన అంతర్జాతీయ ఎత్తైన యాత్రలను విజయవంతంగా పూర్తి చేశాడు, వాటిలో దక్షిణ ఆఫ్రికా టాంజానియాలోని కిలిమంజారో పర్వతం (5,895 మీటర్లు), రష్యాలోని మౌంట్ ఎల్బ్రస్ (5,642 మీటర్లు), ఆస్ట్రేలియాలోని మౌంట్ కోస్సియుస్కో (2,228 మీటర్లు), నేపాల్ లోని మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ (5,364 మీటర్లు), లడఖ్ లోని మౌంట్ కాంగ్ యాట్సే 2 (6,250 మీటర్లు), అరుణాచల్ ప్రదేశ్ లోని మౌంట్ గోరిచెన్ (6,488 మీటర్లు) ఎత్తైన పర్వతాన్ని అతి పిన్న వయస్కుడు యశ్వంత్ విజయవంతంగా అధిరోహించాడు. ఈ విజయాలు భారతదేశంలో మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎత్తైన, అత్యంత సవాలుతో కూడిన శిఖరాలను అధిరోహించడంలో యశ్వంత్ నిబద్ధతను తెలియజేస్తున్నాయి. విజయవంతమైన అధిరోహణ తర్వాత తన ఆలోచనలను పంచుకుంటూ, ప్రతి శిఖరాగ్ర సమావేశం బలపరుస్తుందని పేర్కొన్నాడు. యశ్వంత్ తన జాతీయ, అంతర్జాతీయ పర్వతారోహణ ఆశయాలను సాధించడానికి దగ్గరగా వెళుతున్న కొద్దీ రాబోయే యాత్రలకు తన సన్నాహాలు కొనసాగిస్తున్నాడు.

## చంద్రబాబుకు రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి

### మర్రిగూడ మండల టీడీపీ అధ్యక్షుడు దోమల వెంకటయ్య యాదవ్



**మునుగోడు, ఫిబ్రవరి 1(నినాదం):** వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ని ఉద్దేశించి ఉపయోగించిన, భాష అత్యంత హేయమైనది, హంకారమైనదని మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు దోమల వెంకటయ్య యాదవ్ విమర్శించారు. ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసహనం దిగజారుడుతనంతో అంబటి రాంబాబు వాడిన పదజాలం సభ్య సమాజం చీదరించుకునే రీతిలో ఉందన్నారు. ప్రతిపక్ష నాయకులు బాధ్యతతో ప్రజాస్వామ్య రీతిలో వ్యవహరించాలి కానీ ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని అసభ్య పదజాలంతో బూతులు తిడితే ప్రజలు ప్రజాస్వామ్య వాదులు చూస్తూ ఊరుకోరన్నారు. అంబటి రాంబాబు తన తప్పు తెలుసుకొని చంద్రబాబు నాయుడు కి ప్రజల ముందు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. చెప్పని ఎడల అంబటి రాంబాబును ఆంధ్రలో గాని తెలంగాణలో గాని ఎక్కడ కూడా తిరుగనివబోమని అన్నారు. దేశ రాజకీయాల్లో పేరున వ్యక్తి చంద్రబాబు నాయుడు అని అలాంటి వ్యక్తిపై అంబటి రాంబాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఊరుకోరని వారి నాలుక కట్ చేస్తారని హెచ్చరించారు. దేశ రాజకీయాలను శాసించే శక్తి చంద్రబాబు నాయుడుకి ఉందని కనీసం గ్రామస్థాయిలో గ్రామాన్ని శాసించే శక్తి లేని అంబటి రాంబాబు మాట్లాడి భాష విధానం మార్చుకోకపోతే తెలంగాణా లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున వచ్చి వారి ఇంటిని ముట్టడిస్తామని, వారిని తెలంగాణలో కూడా తిరగనివ్వమని హెచ్చరించారు. అదేవిధంగా మర్రిగూడ మండల తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలే మల్లయ్య మాట్లాడుతూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా అసభ్య పదజాలంతో మాట్లాడడం చట్టరీత్య నేరం, సమాజంలో ఇలాంటి ధోరణి నీ అరికట్టాలంటే ఇలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమల కల్తీ నెయ్యి విషయాన్ని సైడ్ ట్రాక్ చేయాలనే ఉద్దేశంతో వైసీపీ నాయకుడు జగన్ ఆడిస్తున్న గేమ్లో భాగంగానే అంబటి రాంబాబు రాష్ట్ర ముఖ్యమంత్రి పై బూతు పురం తో రెచ్చిపోయాడని అన్నారు. జగన్ కు ప్రజాస్వామ్యంపై విలువ ఉంటే తక్షణమే అంబటి రాంబాబును పార్టీ నుండి సస్పెండ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలు ధరించి బిఆర్ఎస్ శ్రేణుల నిరసన



**కమలాపూర్ ఫిబ్రవరి 1 (నినాదం):** పోన్ ట్యాపింగ్ కేసు విచారణ లో భాగంగా మాజి ముఖ్యమంత్రి బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కె చంద్ర శేఖర్ రావును రాజకీయ కక్షతో సిట్ విచారణకు హాజరు కావాలనే నిర్ణయానికి నిరసనగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఆదివారం మండల వ్యాప్తంగా బిఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసనలు తెలిపారు. మండలంలోని వంగపల్లి గ్రామంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కోడెపాక మధు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు ధరించి బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. కానిపర్తి, కన్నూరు గ్రామాల్లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పలు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు

- నెల రోజులు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుంది
- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఫిబ్రవరి 1 నుండి ఫిబ్రవరి 28 వరకు నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ -- 1861 అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కాలంలో పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా లేదా ప్రజాధనానికి నష్టం కలిగించే ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడకూడదని హెచ్చరించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, ఇతర వ్యక్తులు లేదా రాజకీయ పార్టీలను కించపరిచే వ్యాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాలలో అటువంటి పోస్టులు పెట్టినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి కఠినంగా అమలు చేయడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ముగిసిన ఎన్‌సిసిఎ సర్టిఫికెట్ పరీక్ష



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 1 (నినాదం):** పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో 31 వ బెటాలియన్ సుబేదార్ మేజర్ ఎం .మాధవరావు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన ఎన్ సి సి విద్యార్థుల ఏ సర్టిఫికెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా వి. వెంకటేశులు తెలిపారు. ఆదివారం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ఎన్ సి సి ఏ సర్టిఫికెట్ సాధించిన విద్యార్థులకు ఉన్నత విద్యలో వెయిటేజ్ ఉంటుందని ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ రిక్రూట్మెంట్ పరీక్షలో బోనస్ మార్కులు ఉంటాయని మొత్తం 188 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఎన్ సి సి తో విద్యార్థులలో క్రమశిక్షణ దేశభక్తి పెంపొందుతుందని అన్నారు. ఆఫీసర్లు నాయక్ సుబేదార్ చంద్రవీర్, గుండ గాని రాజయ్య, బి.సత్యనారాయణ, శంకర్ ఎన్ సి సి విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరో అడ్డుకుంటే.... ఊరుకుంటామా.!





### బిఆర్ఎస్ నాయకుల నిరసన

### అదుపులోకి తీసుకున్న పోలీసులు

**మహదేవపూర్, ఫిబ్రవరి 1, (నినాదం):** మాజీ తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కెసిఆర్) ను సిట్ విచారించనున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడ్డ అలజడి కారణంగా బిఆర్ఎస్ ఇచ్చిన నిరసన పిలుపు పోలీసులు ఎంత అడ్డుకున్న నిరసన కార్యక్రమం కొనసాగడం విశేషం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులను స్థానిక పోలీసులు అరెస్టు చేసిన నిరసనలు మాత్రం ఆగకపోవడం గమనార్హం. పలుకుబడి పేరు ఉన్న నాయకులను పోలీసులు అరెస్టు చేసిన ...?స్థానిక కార్యకర్తలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను మండల కేంద్రంలోని రెండు చోట్లలో దహనం చేయడం చర్చనీ అంశంగా మారింది. పోలీసులు ఎంత నిర్బంధించిన నాయకులను మాత్రమే నిర్బంధించగలిగారు కానీ కార్యకర్తలను మాత్రం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయకుండా కాపాడలేకపోయారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను సిట్ ప్రశ్నించడం ఎంతవరకు సమంజసమని బిఆర్ఎస్ నాయకులు ఆగ్రహంతో పోలీసుల నిర్బంధంలో చిక్కుండా మండల కేంద్రంలోని మార్కెట్ చౌరస్తా వద్ద, బొమ్మపూర్ క్రాస్ రోడ్డు వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం విశేషం. పోలీసుల నిర్బంధం నుంచి బిఆర్ఎస్ నాయకులు తప్పించుకొని ఈ కార్యక్రమం చేయటం పట్ల సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. పోలీసుల నిర్బంధంలో ఉన్న బిఆర్ఎస్ నాయకులు మండల శాఖ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, మహదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు, మైనార్టీ నాయకుడు అలీమ్ ఖాన్, ఆన్కారిప్రకాష్, లాంటి సీనియర్ నాయకులు పోలీస్ స్టేషన్లో నిర్బంధించబడిన బి ఆర్ ఎస్ మంథని నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీత ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన చేసిన ఈ కార్యక్రమంలోబి ఆర్ ఎస్ నాయకులు పెండ్యాల మనోహర్, మేసినేని రవీందర్ రావు, సూరారం మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి తో పాటు పలువురు బి ఆర్ ఎస్ కార్యకర్తలు విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి

### అందరూ సమన్వయంతో పని చేసుకోవాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి 01 (నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలే మున్సిపాలిటీ అభ్యర్థులను గెలిపిస్తాయని బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు..మహబూబాబాద్ జిల్లా 7 మున్సిపాలిటీలు ఇల్లందు, డోర్నకల్ ,మరిపెడ, మహబూబాబాద్,కేసముద్రం ,నర్సంపేట, ములుగు మున్సిపాలిటీలు ఉన్నాయని,ఇక్కడ అన్ని మున్సిపాలిటీ లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవాలి.అందుకోసం ఈ 10 రోజులు కష్టపడాలి.కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ లను గెలించాలని లక్ష్యంతో ఐదుగురు శాసన సభ్యులు, మంత్రి సీతక్క నలుగురు డీసీసీ అధ్యక్షులు ఇక్కడి నుండి ఉన్నారన్నారు.గత ప్రభుత్వం 10 సంవత్సరాలుగా వారు ఇచ్చిన వాగ్దానం నెరవేర్చక ప్రజలు విసిగిపోయారు.ఒక్క డబుల్ బెడ్ రూం లు ఇవ్వలేదు.మేము నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని,అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇచ్చాం.దేశంలో ఎక్కడ లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం.200 లోపు యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ సరఫరా చేస్తున్నాం.. ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం.గత ప్రభుత్వం ప్రారంభించిన షాది ముబారక్,కళ్యాణ లక్ష్మి పథకాలు కొనసాగిస్తున్నాం.గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్న వడ్లకు 500 బోనస్,గిట్టుబాటు కల్పిస్తున్నాం.మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నాం.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక పథకాలను తీసుకొచ్చింది.గ్రూప్ 1 నుండి గ్రూప్ 4 వరకు ఎక్సైజ్ నుండి ఎండోమెంట్ వరకు పోలీస్,టీచర్ ఇలా 70 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాము.మేము అధికారంలో ఉన్నాం మమ్మల్ని ఆశీర్వదించారు.మీకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వాన్ని నడిపే బాధ్యత మాది.సర్పంచ్ ఎన్నికల్లో మమ్మల్ని ఆశీర్వదించిన మాదిరి మున్సిపల్ ఎన్నికలలో కూడా మమల్ని ఆశీర్వదించండి అన్నారు.ఇన్ఫ్రాస్ట్రక్చర్,ఇన్క్లూజివ్ గ్రోత్,విద్యా,వైద్యం,ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి 2047 లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు పోతున్నాం.మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న 7 మున్సిపాలిటీ లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్,డిసిసి అధ్యక్షురాలు ఉమామురళి నాయక్, జిల్లా నాయకులు వంటి కొమ్ము యుగంధర్ రెడ్డి, మండల అధ్యక్షులు రఘువీరారెడ్డి,కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రవి నాయక్,పట్టణ అధ్యక్షులు తాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు కాలం రవీందర్ రెడ్డి, గంధసిరి అంబరీష,నల్లు శ్రీకాంత్ రెడ్డి,ప్రగతి శ్రీపాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులు,పార్టీ ఆశావాహులు,నాయకులు,కార్యకర్తలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# బోర్లగూడెంలో సీఎం దిష్టిబొమ్మ దహనం



**మహాముత్తారం, ఫిబ్రవరి 1(నినాదం):** తెలంగాణ రాష్ట్రం తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు గురి చేస్తూ సీట్ విచారణకు వ్యతిరేకంగా టిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మహాముత్తారం మండల బోర్ల గూడెంలో బీఆర్ఎస్ పార్టీశ్రేణులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజలపై చేస్తున్న అరాచకాలపై నినాదాలు చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి మహముత్తారం పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెండ వెంకటస్వామి, పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షులు జాటోత్ జయపాల్ నాయక్, వజనపల్లి సర్పంచ్ జాగరి మహేష్, నిమ్మగూడెం సర్పంచ్ జాడి రాజేష్, స్తంభంపల్లి(పిపి) సర్పంచ్ జాడీ కీర్తన శ్రీనివాస్, జాటోత్ రూప నాయక్, బొబ్బిలి వెంకటయ్య, ఠాకూర్ శ్రీ హర్ష, వాసంపల్లి మహేష్, వావిళ్ళ చంద్రయ్య ఇనుముల మల్లేష్, వావిళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొల్లం సమక్షంలో చేరికలు



**కోదాడ, ఫిబ్రవరి 1(నినాదం):** కోదాడ పట్టణంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరడం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.కోదాడ పట్టణ పరిధిలోని 27వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఖాజా షరీఫ్, మహమ్మద్ ఖాలిద్ నాయకత్వంలో సుమారు 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు తమ పార్టీకి రాజీనామా చేసి, ఆదివారం మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సమక్షంలో అధికార బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం ప్రతి కార్యకర్తకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని, అందుకే పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలను విస్మరిస్తూ అంతర్గత విభేదాలతో కుంగిపోతుందని, బీఆర్ఎస్ మాత్రమే రాష్ట్రాభివృద్ధికి సరైన దిశ చూపుతోందని ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు పేర్కొన్నారు. తమ భవిష్యత్ రాజకీయ ప్రయాణం బీఆర్ఎస్‌తోనే కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నయీం, షేక్ అబ్బు, మహమ్మద్ శాకీర్, పిట్టల భాగ్యమ్మ, అలీంతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ భారీ చేరికలతో కోదాడలో బీఆర్ఎస్ బలం మరింత పెరిగినట్లయ్యిందని, రానున్న రాజకీయ పోరాటాల్లో పార్టీకి ఇది కీలకంగా మారనుందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి




**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 1 (నినాదం):** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దీనివల్ల రోగాల బారిన పడకుండా ఉండొచ్చని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాఘవేంద్ర చెప్పారు. వనపర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కోఎడ్యుకేషన్) ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 2,4 ఆధ్వర్యంలో ఏదుల మండల కేంద్రంలో శీతాకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం ఆదివారం మూడవ రోజుకు చేరుకుంది. ఏదుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ పాఠశాల, అంగన్వాడి, ఎస్సీ కాలనీలో రోడ్లను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభ్రం చేశారు. చెత్తను తీసి పరిసరాలను పరిశుభ్రం చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్ లో వేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు ధాంసింగ్, వెంకటస్వామి, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు



**మహాముత్తారం, ఫిబ్రవరి 1(నినాదం):** తెలంగాణ రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై సీట్ విచారణ కాంగ్రెస్ పార్టీ వేధింపులకు గురిచేస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తున్న తీరును వ్యవహరిస్తూ పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం బోర్ల గూడెంలో బిఆర్ఎస్ పార్టీ పక్షాన తలపెట్టిన నిరసనకు ముందే నాయకులను మహాముత్తారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు అరెస్టు చేసిన వారిలో. బిఆర్ స్ పార్టీ అధ్యక్షులు మార్క రాము గౌడ్, బోర్ల గూడెం సర్పంచ్ అజ్మీర ధరమ్ సింగ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గంట కొండారెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీపతి సురేష్ గౌడ్, బోర్ల గూడెం పార్టీ అధ్యక్షులు జాగరి మల్లేష్, యూత్ అధ్యక్షులు పంతకాని రాజు, పంగ సంపత్, సాంబరాజు చంద్రయ్య, జంగాపల్లి వెంకటరాజం పోరిక సమ్మయ్య లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బోర్లగూడెంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ఆందోల్ గడ్డపై బీఆర్ఎస్ జెండా

**మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రణాళిక**



**సంగారెడ్డి :** జిల్లాలోని ఆందోల్ జోగిపేట్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో జోరు అందుకున్నది. ఆందోల్ గడ్డపై మళ్లీ బిఆర్ఎస్ జెండా ఎగిరేయడమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు మూడు సార్లు వార్డుల వారీగా ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించిన క్రాంతి కిరణ్ అందరి అభిప్రాయాలతో అభ్యర్థుల్ని ఎంపిక చేసే ప్రక్రియను పూర్తి చేశారు. గతంలో ఉన్న అనుభవాలు, పార్టీ కోసం బలంగా నిలబడ్డ వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రజల్లో మంచి పలుకుబడి ఉండి ప్రజల సమస్యల్ని అర్థం చేసుకొని వాటిని తీర్చగలిగే సామర్థ్యం కలిగిన వ్యక్తులను కౌన్సిలర్ అభ్యర్థులుగా బరిలోదింపడానికి కసరత్తు చేశారు. అందులో భాగంగా ఒకవైపు అభ్యర్థు లపై కసరత్తు పూర్తి చేస్తూనే ఇంకోవైపు రెండు సంవత్స రాల కాలంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను, రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు జరిగిన నష్టాన్ని వివరి స్తూ ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి కారణమైన తొమ్మిది గ్యారంటీలు అమలు చేయడంలో విఫలం కావడంతో ఆ తొమ్మిది గ్యారెంటీల బాకీలను తీర్చాలని డిమాండ్ చేస్తూ ప్రతి ఇంటింటికి బాకీ కార్డులను అందజేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఇన్చార్జ్ నరహరెడ్డితో కలిసి బాకీ కార్డులను విడుదల చేసిన క్రాంతి కిరణ్ ఈ బాకీ కార్డు ప్రతి ఒక్కరు జేబులో ఉండే విధంగా మనం ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని కార్యకర్తలకు ఉద్బోధిస్తున్నారు. దీంతో మున్సిపాలిట ీలోని ప్రతి వార్డులోని ఆశావాహులు, కార్యకర్తలు కలిసి ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ బాకీ పడ్డ వివరాలను ప్రతి ఓటరు కు వివరిస్తున్నారు. పట్టణంలో విస్తృతమైన ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనికి ప్రజల నుంచి విస్తృతమైన స్పందన వస్తున్నది. రెండు సంవత్సరాల కాలంలో అభివృద్ధి చేయడంలో విఫలం కావడంతో పాటు సంక్షేమ పథకాలు అమలులో కూడా కాంగ్రెస్ పార్టీ విఫలమైందని ప్రజల నుంచి కూడా తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. పట్టణం లోని ఇరవై వార్డులలో బాకీ కార్డుల ద్వారా చేస్తున్న ప్రచారానికి కూడా ప్రజల నుంచి విస్తృతమైన మద్దతు వస్తున్నది. అంతేకాకుండా టిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మున్సిపాలిటీలో సిసి రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు, ఇంటింటికి నల్ల లాంటి కనీస సౌకర్యాలు తీర్చే కార్యక్రమాలు చేపట్టారు. కానీ రెండేళ్ల కాలంలో గెలిచిన ఎమ్మెల్యే దామోదర రాజనర్సింహా మంత్రి అయినప్పటికీ ఆందోల్ మున్సిపల్ పట్టణాన్ని పట్టించుకోలేదని ప్రజలు కూడా తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో మంజూరైన టీయు ఎఫ్ ఐ డి నిధులనే మళ్లీ మంజూరు చేయించి రోడ్లు వేయిస్తున్నారు తప్పించి మంత్రిగా ఒక్క పైసా కూడా అదనపు నిధులను దామోదర్ రాజనర్సింహా ఆందోల్ కేటాయించలేదని ఆంధ్ర ప్రజలు గురుగా ఉన్నారు. ఈ పరిస్థితి బి ఆర్ ఎస్ కు అనుకూలంగా మారే అవకాశాలున్నాయి.

# పాలన గాలికి వదిలేసి.. కక్ష సాధింపు చర్యలా..?

**నిరసనల హోరు.. బైకు ర్యాలీలు**

**సీఎం దిష్టిబొమ్మ దహనం**

**నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ ప్రతినిధి ఫిబ్రవరి 1 (నినాదం) :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తూ నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా నిరసనల హోరెత్తించారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి పార్టీ జెండాలతో మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. నాగర్కర్నూల్ ప్రధాన కూడలిలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు దీంతో పోలీసులకు బి ఆర్ ఎస్ నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందని. అనంతరం మర్రి జనార్దన్







రెడ్డి మాట్లాడుతూ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పాలను గాలికి వదిలేసి కేసిఆర్ పై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల దృష్టిని మళ్ళించడానికే కాళ్వేశ్వరం కమిషన్లని సిట్ ఫోన్ టాపింగ్ అని రకరకాల పేర్లతో కేటీఆర్ హరీష్ రావు సంతోష్ రావులను వేధించడమే కాక ఇప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సిట్ నోటీసుల పేరుతో డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుత మంత్రివర్గాన్ని దండుపాళ్యం బ్యాచ్ గా అభివర్ణిస్తూ రోజుకో కుంభకోణానికి పాల్పడుతున్నారని రాష్ట్రాన్ని దొరికిన కాడికి దోచుకు తింటున్నారని తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన 420 హామీలు నెరవేర్చలేక కెసిఆర్ కుటుంబం పై బురదజల్లే చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు బొగ్గు స్కాం సోలార్ పవర్ స్కాం సింగరేణి డిజిటల్ స్కాం ఎక్సైజ్ మద్యం స్కాంలను బయట పెట్టారని ఈ స్కామ్ ల నుండి తప్పించుకోవడానికి ప్రజల దృష్టిని మరల్చడానికి కేసీఆర్ కు సిట్ నోటీసుల డ్రామా కు తెర లేపారని రేవంత్ రెడ్డి తాటాకు చప్పుళ్ళకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు తెలంగాణ ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని త్వరలో తెలంగాణ బడుగు బలహీన వర్గాల ప్రజలతో కలిసి నీ పాలనకు చరమగీతం పాడుతామని నిన్ను ప్రజల్లో తిరగనివ్వబోమని హెచ్చరించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు స్థానికంగా ఉండి ప్రజలకు మీరిచ్చిన అమలు గాని 420 హామీలపై చైతన్య పరుస్తారని కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిరిగేలా చేయాలనే కుట్రలో భాగంగానే ఇలాంటి చర్యలకు రేవంత్ రెడ్డి పాల్పడుతున్నారని ఆరోపించారు. న్యాయం ధర్మం తమ వైపే ఉన్నాయని ఈ కక్ష సాధింపు చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎఫ్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మరిపెడలో గర్జించిన గులాబీ సైన్యం

**తెలంగాణ రాష్ట్ర సాధకుడు మాజీ సీఎం కేసీఆర్**

**బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి**

**డోర్నకల్ గడ్డ బీఆర్ఎస్ అడ్డ...**

**డోర్నకల్ మరిపెడ మున్సిపాలిటీలను బీఆర్ఎస్ కైవాసం చేసుకోవాలి : మాజీ మంత్రి రెడ్యానాయక్**



**డోర్నకల్/మరిపెడ ఫిబ్రవరి1 (నినాదం) :**
తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఎక్కడ చూసినా ఎడారి లాగా ఉండేదని,తెలంగాణ రాష్ట్ర నినాదాన్ని ఎత్తుకొని 36 పార్టీలను ఏకం చేసుకుని ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావుకు సిట్ నోటీసులు జారీ చేయడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని,పార్టీ పదవులను సైతం లెక్కచేయకుండా రాజీనామాలు చేస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిని అన్నారు.తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాతనే ధన్యగార రాష్ట్రంగా మారిందని, మూడు కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించే రాష్ట్రంగా తీర్చిదిద్దిన నాయకుడు కేసీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఆకలి కేకలు,ముంబై వలస బతుకులు ఉండేవని తెలంగాణ ఏర్పడిన తర్వాతనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. కెసిఆర్ కు సిట్ విచారణ కోసం నోటీసులు జారీ చేయడానికి నిరసిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఊరు వాడ కెసిఆర్ కోసం కథము తొక్కి రోడ్లపై తిరుగుతూ నిరసన తెలిపారు అన్నారు.మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు.అనంతరం మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు గెస్ట్ హౌస్ లో మరిపెడ మున్సిపాలిటీలోని 15 వార్డులకు అభ్యర్థులను ప్రకటించారు.రెడ్యానాయక్ నిర్ణయాన్ని అందరూ శిరసావహించి ప్రతి వార్డును కూడా బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకునే విధంగా ఎవరికి ఎలాంటి మనస్పర్థలు ఉన్నా అభిప్రాయ భేదాలు ఉన్న పార్టీ శిరోధార్యంగా భావించి అందరూ కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థి ఎవరో ఒకరు కాదు ప్రతి ఒక్కరు కూడా వార్డులో ఉన్న బీఆర్ఎస్ పార్టీ సైనికులందరు కూడా నిలబడ్డట్టుగా పనిచేసి పోయినసారి లాగే మరిపెడ మున్సిపాలిటీలో 15 వార్డులకు 15 వార్డులు బీఆర్ఎస్ పార్టీ సాధించుకునే దిశగా పనిచేస్తారని మీ అందరికీ మనస్ఫూర్తిగా వేడుకుంటున్నాను అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు,పట్టణ అధ్యక్షులు ఉప్పల నాగేశ్వరరావు, మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి,మాజీ ఎంపీపీ గుగులోత్ వేంకన్నా,మాజీ జడ్పీటీసీ శారద రవీందర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు రాంబాబు నాయక్, రామదుగు అచ్చుతారావు,ఉగ్గంపల్లి గ్రామ సర్పంచ్ ఆయుబ్ పాషా,మాజీ వైస్ ఎంపీపీ అశోక్ రెడ్డి,మాజీ వార్డ్ కౌన్సిలర్లు,మాజీ కోఆప్షన్ సభ్యులు,బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ఎస్సీ సెల్,బిసి సెల్ అధ్యక్షులు,మాజీ సర్పంచులు,మరిపెడ వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు ఇంకా తదితరులు పాల్గొన్నారు..

## కేసీఆర్‌కు సిట్ నోటీసులు విచారణకు

# నిరసనగా బిఆర్ఎస్ ర్యాలీ, ధర్నా

**కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలి**

**మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు**



**మిర్యాలగూడ ఫిబ్రవరి 1(నినాదం):** మాజీ సిఎం బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ కి సిట్ నోటీసుల పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు, అరాచక చర్యలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం ఆర్టీసీ బస్టాండ్ వద్ద మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. అబద్ధాల పునాదులపై గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు హామీలను అమలు చేయడం చేతకాక ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, కేసీఆర్ పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఆధారాలు లేని ఫోన్ ట్యాపింగ్ అనే లొట్టపీసు కేసులో రాజకీయ కక్షతోనే విచారణ పేరిట డ్రామాలు ఆడుతున్నదని ధ్వజమెత్తారు. రేవంత్ సర్కార్ రాజకీయ దురుద్దేశంతోనే ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తెచ్చిందని విమర్శించారు. బీఆర్ఎస్ ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుట్రలకు పాల్పడుతున్నాయన్నారు. కేసీఆర్ లక్ష్యంగా సిట్ అధికారుల తీరు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందన్నారు. రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలించిన మహానేత కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. విచారణకు అంగీకరిస్తానని చెప్పినా కూడా కేసీఆర్ ఇంటి గేటుపై అర్ధరాత్రి సిట్ అధికారులు నోటీసును అంటించడం రేవంత్ సర్కార్ కుట్రలో భాగమేనన్నారు. రేవంత్ సర్కార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్ కేసు ను తెరపైకి తెచ్చి బీఆర్ఎస్ పై రేవంత్ సర్కార్ రాజకీయ కుట్ర పన్నిందన్నారు. రేవంత్ తీరును, అనుసరిస్తున్న విధానాలను యావత్ తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటు వేసి ఓటుతోనే రేవంత్ సర్కార్ కు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని ఆకాంక్షించారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులను బంపర్ మెజారిటీతో గెలిపించాలని పట్టణ ప్రజలను భాస్కర్ రావు కోరారు. బీఆర్ఎస్ శ్రేణులు మిర్యాలగూడ పట్టణంలో రెడ్డికాలనీ బీఆర్ఎస్ కార్యాలయం నుంచి నల్లకండువాలు, నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులు చేబూని బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేబూని రేవంత్ సర్కార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీఎస్ ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నల్లమోతు సిద్దార్థ, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టిబాబునాయక్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి షోయబ్, నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు, మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

NINADAM CINEMA

## ఇది ఫెబ్ మంత్ కాదు

# ఫన్ మంత్..

**మరో కొత్త మూవీతో వచ్చేస్తున్న సుహాస్**




**సరికొత్త మూవీతో ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసేందుకు వచ్చేస్తున్నాడు హీరో సుహాస్. కొత్త దర్శకుడు గోపీ అచ్చర దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ 'హే భగవాన్' అనే క్యాచీ టైటిల్‌తో రాబోతున్నది.**

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్', 'లిటిల్ హార్ట్స్' సినిమాలతో యూత్‌ను ఎట్రాక్ట్ చేసిన యంగ్ బ్యూటీ శివాని నాగరం ఇందులో హీరోయిన్‌గా నటిస్తుండగా.. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి. నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేయబోతుండగా.. అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసి ఆడియన్స్‌ను ఆకట్టుకుంటున్నారు. ఇందులో భాగంగానే తాజాగా సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తూ మరో సరికొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'హే భగవాన్' మూవీ ఫిబ్రవరి 20 న రిలీజ్ కాబోతున్నట్లు తెలుపుతూ.. 'ఇది ఫెబ్ మంత్ కాదు.. ఫన్ మంత్' అనే ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌ను జత చేశారు. వీకే నరేష్, వెన్నెల కిషోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ, అజయ్ ఘోష్, స్రవంతి చొక్కారపు తదితరులు ఇందులో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగే ఈ చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన పలు అప్డేట్స్‌తో పాటు టీజర్ ఆకట్టుకోగా.. మూవీపై పాజిటివ్ ఎక్స్‌పెక్టేషన్స్ నెలకొన్నాయి.

# ఇలా జరుగుతుందని అస్సలు ఊహించలేదు..

**కిచ్చా సుదీప్ ఎమోషనల్ నోట్‌రి**



కన్నడ కిచ్చా సుదీప్ వెండితెరపై అడుగుపెట్టి మూడు దశాబ్దాలు (30 ఏళ్లు) పూర్తి చేసుకున్నాడు. ఈ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని, పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగిన ఆయన, తన జర్నీపై ఎమోషనల్ నోట్‌ను విడుదల చేశాడు. కేవలం ఒక నటుడిగా మాత్రమే కాకుండా.. దర్శకుడిగా, నిర్మాతగా, సింగర్‌గా, 'బిగ్‌బాస్' హోస్ట్‌గా మల్టీ టాలెంటెడ్ హీరోగా గుర్తింపు పొందిన సుదీప్, ఇన్నాళ్లు ఆదరించిన ప్రేక్షకులకు శిరస్సు వంచి నమస్కరించారు. "ఎన్నో కలలతో ఇండస్ట్రీలోకి వచ్చిన ఒక సామాన్య కుర్రాడిని, ఈ రోజు ఈ స్థాయికి చేర్చింది కేవలం అభిమానుల ప్రేమే" అని సుదీప్ పేర్కొన్నారు. దర్శక నిర్మాతలు తనపై ఉంచిన నమ్మకం, తోటి నటీనటులు, సాంకేతిక నిపుణుల టీమ్ వర్క్ వల్లే ఇదంతా సాధ్యమైందని ఆయన గుర్తు చేసుకున్నారు. కన్నడ ఇండస్ట్రీ తనకు గుర్తింపునిచ్చిందని, ఇక్కడి మూలాలే తనను నిలబెట్టాయని చెబుతూ.. తెర వెనుక పనిచేసే ప్రతి ఒక్క లైట్ బాయ్ నుండి టెక్నీషియన్ వరకు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. సినీ ప్రపంచంలో ఎన్నో కలలతో అడుగుపెట్టిన తాను ఈ స్థాయికి చేరుకుంటానని కలలో కూడా ఊహించలేదని ఆనందం వ్యక్తం చేశాడు.

# అందమైన బొమ్మలా ఉండటం నాకు ఇష్టం లేదు..

**శోభిత కామెంట్స్ ఆ హీరోయిన్లను ఉద్దేశించేనా**



నాగచైతన్యతో పెళ్లి తర్వాత దాదాపు మూడేళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్న శోభిత మళ్లీ 'చీకటిలో' మూవీతో సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసింది. ప్రస్తుతం ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతూ.. జనాలను మెప్పిస్తోంది. ఈక్రమంలో.. వరుస ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న శోభిత ఆసక్తికర విషయాలు పెంచుకుంటూ అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పెళ్లి తర్వాత తన జీవితంలో వచ్చిన మార్పులపై మాట్లాడుతూ.. అక్కినేని నాగచైతన్యను పెళ్లి చేసుకున్నంత మాత్రాన తన కెరీర్ మారిపోలేదని శోభితా ధూళిపాళ స్పష్టం చేశారు. నాకు పెళ్లయి ఏడాది అవుతోంది, కానీ నా కెరీర్‌లో నేను సాధించినవన్నీ నా కష్టంతో వచ్చినవే. ఒక పెద్ద సినీ కుటుంబంలో కోడలిగా ఉన్నప్పటికీ, నా పనిని, నా ఫ్యామిలీని నేను ఎప్పుడూ కలపను అని చెప్పింది. ఇంట్లో ఉన్నప్పుడు మా అత్తమామలను కేవలం కుటుంబ సభ్యులుగా మాత్రమే చూస్తాను కానీ, ఇండస్ట్రీ మనుషులుగా కాదని. భవిష్యత్తులో ఏం జరుగుతుందో తెలీదు కానీ, ప్రస్తుతానికి మాత్రం నా కెరీర్ నిర్ణయాలు నావే" అని తెలిపింది. ఇక సినిమాల ఎంపిక విషయంలో కూడా శోభిత తన రూటు మార్చుకున్నట్లు వెల్లడించింది. "చిత్రాల్లో కేవలం అలా వచ్చి పోయే అందమైన బొమ్మలా ఉండటం నాకు ఇష్టం లేదు. పాత్ర మంచిదైనా, చెడ్డదైనా.. కథను మలుపు తిప్పేలా ఉండాలి. హైదరాబాద్‌కు షిఫ్ట్ అయిన తర్వాత నాకు నా కెరీర్ మీద మరింత క్లారిటీ వచ్చింది. ఎవరి సపోర్ట్ లేకుండా ఆడిషన్స్ ఇచ్చి ఈ స్థాయికి వచ్చానని, ఒక పెద్ద ఫ్యామిలీతో బంధం ఏర్పడినంత మాత్రాన తన ఆలోచనలు మారవని" అని శోభిత తేల్చి చెప్పింది.



## నా కెరీర్‌లో ఇది అత్యంత

# సవాలుతో కూడిన పాత్ర

**అదితి రావు హైదరీ**

అదితి రావ్ హైదరీ మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. గతంలో 'రాక్‌స్టార్' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఆమె, ఇప్పుడు ఇమ్తియాజ్ అలీ క్రియేట్ చేసిన 'ఓ సాథీ రే' ద్వారా ఆయనతో కలిసి పని చేస్తోంది. నెట్‌ఫ్లిక్స్ నిర్మాణంలో వస్తున్న ఈ పీరియాడికల్ లవ్ స్టోరీపై అదితి స్పందిస్తూ.. ఇమ్తియాజ్ అలీతో పనిచేయాలనే తన చిరకాల కోరిక ఈ సినిమాతో నెరవేరిందని వెల్లడించింది. ఈ మూవీ షూటింగ్ సమయంలో ఇమ్తియాజ్ అలీ పనితీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని అదితి పేర్కొంది. "ఇమ్తియాజ్ మానిటర్ వైపు కూడా చూడరు, నేరుగా నటుల వైపు చూస్తూ సీన్ ఎలా వస్తుందో గమనిస్తారు. ఆయన ఎనర్జీ, అప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేసే తీరు నటిగా నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది" అని తెలిపింది. 'ఓ సాథీ రే' భావోద్వేగపరంగా చాలా లోతైన కథ అని, తన కెరీర్‌లో ఇది అత్యంత సవాలుతో కూడిన పాత్ర అని ఆమె చెప్పుకొచ్చింది. అయితే ఇలాంటి క్లిష్టమైన పాత్రలు చేయడమే ఒక నటిగా తనకు గొప్ప సంతృప్తిని ఇస్తుందని అదితి స్పష్టం చేసింది. ఇక ఈ సినిమాలో తన కో-స్టార్స్ గురించి కూడా అదితి ఆసక్తికర విషయాలు పంచుకుంది. 'గర్ల్ ఆన్ ఏ ట్రైన్' తర్వాత మళ్ళీ అవినాష్ తివారీతో కలిసి నటించడం ఆనందంగా ఉందని, ఆయన ఒక మంచి స్నేహితుడని తెలిపింది. అలాగే అర్జున్ రాంపాల్‌ను యూనివర్సల్ క్రష్‌గా చెప్తూ ఆయన సెట్స్‌లో చాలా ప్రొటెక్టివ్‌గా ఉంటారని ప్రశంసించింది. ఈ ప్రాజెక్ట్‌తో పాటు పంకజ్ త్రిపాఠితో కలిసి 'పారివారిక్ మనోరంజన్' అనే చిత్రంలోనూ, అలాగే ఒక సౌత్ థ్రిల్లర్ మూవీలోనూ తాను నటిస్తున్నట్లు అదితి అప్‌డేట్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ అదివి రావు కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# సల్మాన్ సినిమా కంటే.. పవన్ కళ్యాణ్ సినిమా బెస్ట్:

'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. ఇక ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే వరుస విజయాలతో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. అలా రామ్ చరణ్ అల్లు అర్జున్ రవితేజ మహేష్ బాబు వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి క్రేజ్ సంపాదించింది. ఇక 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'లక్ష్యం', 'సరైనోడు', 'నాన్నకు ప్రేమతో', 'ధ్రువ' వంటి సూపర్ హిట్స్‌తో టాలీవుడ్‌లో టాప్ రేంజ్‌లో నిలిచింది. అయితే ఈ మధ్య రకుల్‌కి టాలీవుడ్‌లో అవకాశాలు కరువయ్యాయి. దీంతో బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తుంది. ఇక ఈ భామ పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే నిర్మాత జాకీ భగ్నానిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటినుంచి భర్తతో మ్యారేజ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తుంది. ఇదిలా ఉంటే.. గతంలో(2013లో) రకుల్ పెట్టిన పోస్ట్ఇప్పుడు వైరల్ అవుతోంది. వైరల్ అవుతున్న ట్వీట్‌లో ఈ చిన్నది.. 'ఒక పంజాబిని అయిన నాకు సల్మాన్ ఖాన్ నటించిన దబాంగ్ సినిమా కంటే పవన్ కళ్యాణ్ యాక్ట్ చేసిన గబ్బర్ సింగ్ మూవీ నచ్చింది.. పవన్ కళ్యాణ్ నిజంగా రాక్ స్టార్' అని రాసుకొచ్చింది. దీంతో ఈ ట్వీట్‌ను ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ట్రెండ్ చేస్తున్నారు. మరి మీరు కూడా గతంలో ఈ ముద్దుగుమ్మ చేసిన ట్వీట్‌ను చూసేయండి.





# నేను బిజీగా జీవిస్తున్నాను..

యంగ్ హీరోయిన్ రాశీ ఖన్నా ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నది. ఇటీవల ఈ చిన్నది స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ సరసన 'తెలుసు కదా' మూవీలో నటించి మెప్పించింది. థియేటర్లలో రిలీజ్ అయిన ఈ చిత్రం ఓకే ఓకే అనిపించుకున్నప్పటికీ ఈ భామ యాక్టింగ్‌కు మాత్రం ఫుల్ మార్కులే పడ్డాయి. ప్రస్తుతం ఈ బ్యూటీ తెలుగులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్ మూవీలో నటిస్తోంది. దీనికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నాడు. అయితే ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787